హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
ప్రజల గొంతుక...
దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్


విలేకరులు కావలెను

పీపుల్స్ న్యూస్ దినపత్రిక

9866330400

www.peoplesnews.in తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 14 సంచిక : 209 గురువారం, ఏప్రిల్ 10, 2025 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad



## ఏదో ఒకరోజు మోడీ దేశాన్ని
# అమ్మేస్తారు

- ప్రభుత్వ సంస్థలన్నీ ప్రైవేట్ పరం అవుతున్నాయి
- ఎన్నికల సంస్థలు కూడా మోడీ గుప్పిట చిక్కుకున్నాయి
- బ్యాలెట్ పోరే దేశానికి శ్రీరామరక్ష
- అహ్మదాబాద్ కాంగ్రెస్ సభలో మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ,ఏప్రిల్9:** ప్రధాని మోడీ ఏదో ఒకరోజు దేశాన్ని అమ్మేస్తారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్ అహ్మదాబాద్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ- (ఏఐసిసి) సమావేశాలు జరుగు తున్నాయి. అహ్మదాబాద్‌లో జరుగుతున్న ఈ సమావే శాల్లో ఆయన మాట్లాడుతూ.. 'దేశ ఆర్థిక వ్యవస్థలో గుత్తాధిపత్యం నెలకొల్పబడుతోంది. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ దెబ్బతింది. వారు బలహీన వర్గాల వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదు. వారు ప్రభుత్వరంగాన్ని ఒక్కొక్కటిగా అమ్మేస్తూ.. తమ స్నేహితులకు సహాయం చేస్తున్నారు. ఇదే కొనసాగితే.. మోడీ ఏదో ఒకరోజు ఈ దేశాన్ని అమ్మేస్తారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిర్మించిన ప్రభుత్వ రంగ కర్మాగారాలను నాశనం చేస్తున్నారు. మీరు, నేను దేశం కోసం ఏం చేస్తున్నాం? భవిష్యత్ తరాలకు మనం ఏమి ఇవ్వాలను కుంటున్నాము? కాంగ్రెస్‌ను దుర్భాలాషలాడడం తప్ప మోడీ దగ్గర వేరే సమాధానాలు లేవు అని ఆయన అన్నారు. నేడు ఎన్నికల సంస్థలు కూడా వారి నియం త్రణలోకే వెళ్లాయి. ప్రభుత్వం వివరాలు 2లో

# భారతదేశంలో జైనానిది విడదీయలేని బంధం

- ఉగ్రవాదం లాంటి సవాళ్లకు జైనమత విలువలే సమాధానం
- మహావీర్ జయంత్యుత్సవంలో ప్రధాని మోడీ




**న్యూఢిల్లీ,ఏప్రిల్ 09:** భారత దేశానికి గుర్తింపు తీసుకురావడంలో.. జైన మతం వెలకట్టలేని పాత్రను పోషించిందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచానికి సవాళ్లుగా మారిన ఉగ్రవాదం, వివరాలు 2లో

## మాజీ గవర్నర్ తమిళసైకి
# పితృ వియోగం

- సంతాపం తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,ఏప్రిల్9:** తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ తండ్రి,తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గొప్ప సాహితీవేత్త కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహాత్ముడి సిద్ధాంతాలను పునికిపుచ్చుకున్న దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు, అనంతన్ గారిని కోల్పోవడం ఎంతో బాధాకరం అని పేర్కొన్నారు. కుమారి అనంతన్ నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమిళ సై కి, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. అనంతన్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

## పెట్రోల ధరలతో
# కేంద్రం ఆర్థిక దోపిడీ

- సెస్సు వసూళ్లతో సొంత రాజకీయ ప్రచారాలు
- సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న మోడీ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి కెటిఆర్ లేఖ






# మంచు కుటుంబంలో ముదురుతున్న వివాదం

- జల్‌పల్లి నివాసం ముందు మనోజ్ బైఠాయింపు
- ఉద్రిక్తతలు చోటు చేసుకోకుండా పోలీసుల మొహరింపు
- ఆస్తి పంచాయితీ కాదంటున్న మంచు మనోజ్

**హైదరాబాద్,ఏప్రిల్9:** నటుడు మోహన్‌బాబు కుటుంబం మరోమారు రోడ్డున పడింది. సొంత గొడవలతో పోలీస్ స్టేషన్ ఎక్కిన తనయులు తాజాగా మరో వివరాలు 2లో

## గృహ వినియోగదారులకు
# శుభవార్త

- మరింత తగ్గనున్న ఇఎంఐ భారం
- ఆర్‌బిఐ నిర్ణయంపై రియల్టర్ల ఆనందం




**హైదరాబాద్,ఏప్రిల్9 :** రెపోరేటు తగ్గడంతో గృహరుణ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోమారు శుభవార్త చెప్పింది. దీంతో వడ్డీలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. స్తబ్దుగా ఉన్న రియల్ రంగానికి ఇది బూమ్ ఇస్తుందని రియల్ ఎస్టే వర్గాలు చెబుతున్నాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో వడ్డీ రేట్లు- తగ్గి గృహ విక్రయాలు పుంజుకుంటా యని రియల్ ఎస్టేట్ సమాఖ్యలు క్రెడాయ్, నరెడ్కో ఆశాభావం వ్యక్తంచేశాయి. ఆర్‌బీఐ తాజా నిర్ణయంపై హర్షాతిరేకం వ్యక్తంచేశాయి. వృద్ధికి ఊతమిచ్చేందుకు తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ రంగానికి కూడా దన్నుగా నిలుస్తు ందని పేర్కొంటున్నాయి. ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయాన్ని బ్యాంకులు ఎంత వేగం అమలుచేసి.. వినియోగదారులకు ప్రయోజనాన్ని బదిలీ చేయడంపై ఈ ఊరట ఆధారపడి ఉంటుంది. ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు-పై తీసుకున్న రుణాలను బ్యాంకులు వెంటనే సవరించాల్సి ఉంటు-ంది. మూడు నెలలకోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ఆర్‌బీఐ నిబంధనలు చెబుతున్నా యి. ఒకవేళ వివరాలు 2లో




# కోలుకుంటున్న మార్క్ శంకర్

- మరో మూడు రోజులు ఆస్పత్రిలోనే చికిత్స
- కొడుకు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో పవన్ సంప్రదింపులు
- మార్క్ ఫోటోను విడుదల చేసిన కుటుంబ సభ్యులు

**అమరావతి,ఏప్రిల్ 09:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనో విచ్ ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. సింగపూర్‌లోని స్కూల్లో చోటు-చేసుకున్న అగ్నిప్రమాదంలో మార్క్ శంకర్ గాయపడ్డ సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో చిన్నారి మార్క్ కాళ్లు, చేతులకు గాయాలు కాగా, ఊపిరితిత్తుల్లోకి పొగ చేరింది. ప్రస్తుతం అతడు సింగపూర్‌లోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వివరాలు 2లో

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు
# అటకెక్కించారు

- ఒక్క హామీ లమలు చేయలేక చతికిల పడ్డారు
- కెసిఆర్‌ది సాగుభాష ..రేవంత్‌ది చావు భాష
- బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



**సంగారెడ్డి,ఏప్రిల్9:** కేసీఆర్‌ది సాగు భాష అయితే.. రేవంత్ రెడ్డిది చావు భాష అని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డివి మాటలు తప్ప చేతలు లేవన్నది ప్రజలకు అర్థమయి పోయిందన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అయినా నెరవేర్చారా అని ప్రశ్నించారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జి ఆదర్శ్ రెడ్డి పాదయాత్ర అనంతరం బుధవారం సిద్ధి వినాయక దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమానికి మాజీ మంత్రి హరీష్ రావు హాజరయ్యారు.హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఈ రోజు రాష్ట్రమంతా కూడా కేసీఆర్ వైపు చూస్తున్న ది. ఏడాది పాలనలో ప్రజలకు పాలేవో,నీళ్ళేవో అర్థం అయిపోయింది. నో ఎల్‌ఆర్‌ఎస్ అని అన్నారు కానీ ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. మేము వస్తే ఫార్మాసిటీ భూములన్ని రైతులకు వాపసిస్తామని అన్నారు. ఇప్పుడేమో 16 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం స్వీకరిస్తామని ప్రకటించారని హరీశ్‌రావు గుర్తు చేశారు. కేసీఆర్‌ది సాగు భాష అయితే రేవంత్ రెడ్డిది చావు భాష. కేసీఆర్ ఎప్పుడు మాట్లాడిన మిషన్ కాకతీయ కింద చెరువులు బాగు చేయాలి అనేది. ప్రాజెక్టుల నిర్మాణం వివరాలు 2లో

గురువారం, ఏప్రిల్ 10, 2025 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 2

## భారతదేశంలో జైనానిది విడదీయలేని బంధం

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధం, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలకు.. జైన మత విలువలు సమాధానం ఇవ్వగలవన్నారు. నవకర మహామంత్ర దివస్ సందర్భంగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రాచీన మతానికి చెందిన సంప్రదా యాన్ని, వారసత్వాన్ని, ప్రబోధనలను రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టు-బడి ఉందని మోదీ తెలిపారు. పార్లమెంట్ బిల్డింగ్ లో జైన తీర్థంకరుల విగ్రహాలు ఉన్నట్లు- చెప్పారు. జైన మతంలో ఉన్న అనేకాంతవాదం గురించి ఆయన ప్రస్తావిం చారు. నిజం అనేది అనేక రూపాల్లో వ్యక్తం అవుతుందన్నారు. జైన మతంలో ఒకరిపై ఒకరు ఆధారపడుతారన్న వాస్తవాన్ని గుర్తింపు ఉందని, అందుకే వాళ్లు స్వల్ప స్థాయిలో కూడా హింసను ఆమోదించరన్నారు. శాంతి, సామర్యం, పర్యావరణ పరిరక్షణలో ఇదే కీలకం అన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవానికి జైన సాహిత్యం వెన్నుముకగా నిలుస్తుందన్నారు.

### రేపు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించనున్న సిఎం రేవంత్

**హైదరాబాద్,ఏప్రిల్9:** సైనిక్ స్కూల్స్ తరహాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. నేడు ఉదయం 9:45 గంటలకు రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో ఈ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి సిఎంతో పాటు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు హాజరుకానున్నారు. ఈ మేరకు అధికారులు తగిన ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ప్రారంభించడంపై హైదరాబాద్ సిపి సివి ఆనంద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. ఈ మేరకు ఆయన తాజాగా ఒక వీడియో విడుదల చేశారు. పోలీస్ లైఫ్ అనేది చాలా కష్టంతో కూడుకుందని, వారి డ్యూటీల కారణంగా కుటుంబంతో తక్కువ సమయం గడపాల్సి వస్తుందన్నారు. ఇక, ఈ స్కూళ్లలో 50 శాతం అడ్మిషన్స్ అమరుల పిల్లలు, హోంగార్డ్, కానిస్టేబుల్స్ నుంచి ఐపిఎస్ పిల్లల వరకు రిజర్వేషన్ ఉంటుందని ఆయన తెలిపారు. మరో 50 శాతం అడ్మిషన్స్ నాన్ పోలీస్ పిల్లలకు (సివిలియన్) ఉంటాయని ఆయన తెలిపారు. ఈ స్కూల్ ఫీజులు కూడా తక్కువగా ఉంటాయని చెప్పుకొచ్చారు. యంగ్ ఇండియా పోలీస్ స్కూల్లో ఇంటర్నేషనల్ లెవల్ ఎడ్యుకేషన్, సిబిఎస్సీ సిలబస్ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావు పాస్‌పోర్టు రద్దు

**హైదరాబాద్,ఏప్రిల్9:** తెలంగాణలో పెను ప్రకం పనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు పాస్‌పోర్టును పాస్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా రద్దు చేసింది. ఆయనపై రెడ్ కార్నర్ నోటీ సులతో అథారిటీ ఈ నిర్ణయం తీసుకుంది. గత కొంతకాలంగా ప్రభాకర్ రావును ఇండియాకు రప్పించేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. తన ఆరోగ్యం బాగోలేదని.. ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నానని, ఇండియాకు రాలేనని తప్పించుకునే ప్రయత్నిస్తుండటంతో.. తెలంగాణ పోలీసులు, కేంద్ర ప్రభుత్వం, యూఎస్ కాన్సులేట్ సహాయంతో ప్రభాకర్ రావును ఇండియాకు తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.కాగా, ఈ కేసులో ఏ6గా ఉన్న శ్రవణ్ రావు మంగళవారం సిట్ అధికారులు విచారించారు. గత ఎన్నికల సందర్భంగా శ్రవణ్ రావు వాడిన రెండు ఫోన్లను స్వాధీనం చేసుకున్న సిట్ అధికారులు.. సెల్ ఫోన్‌లలోని సమాచారం ఆధారంగా ప్రశ్నించారు.

### రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయం:బూర నర్సయ్య గౌడ్

**హైదరాబాద్,ఏప్రిల్9(ఆర్ఎన్ఎ):** తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయం లో బుధవారం ఆయన తెలం గాణ టైగర్ ఆలే నరేంద్ర వర్ధంతి సందర్భంగా ఆయనకి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దేశం, ధర్మం, డెవలప్మెంట్ అంశాలతో పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. దేశంలో అత్యధిక కుటుంబాలు జీవిస్తున్నది ఎంఎస్ఎంఈ సెక్టార్‌పై ఆధారపడేనని అన్నారు. ఈ రంగమే జీడీపీలో ప్రధానపాత్ర పోషిస్తుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మెన్నుముక లాంటిది ఎంఎస్ఎంఈ సెక్టార్ అని అన్నారు.ఎంఎస్ఎంఈ రంగంలో భాగంగా ఎలాంటి పూచీకత్తు లేకుండా ముద్ర లోన్లను ప్రవేశపెట్టారని అన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వంలో 52 కోట్ల మంది

## ఏదో ఒకరోజు మోడీ దేశాన్ని అమ్మేస్తారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిదానిలో జోక్యం చేసుకుంటూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో.. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఇవిఎంలను వదిలి బ్యాలెట్‌పేపర్స్ వైపు మళ్లాయి. ప్రపంచంలో ఇవిఎంలు ఎక్కడా అందుబాటులో లేవు. దేశంలో 140 కోట్ల మంది ప్రజాస్వామ్యాన్ని నమ్ముతారు. ఇప్పుడో లేక తరువాతో.. ఈ దేశ యువత మనకు ఇవిఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్లు కావాలని నినదిస్తారు అని ఖర్గే అన్నారు.భారత్‌పై అమెరికా 26 శాతం పన్నులను విధించింది. ఈ విషయంపై పార్లమెంటు చర్చించ నీయలేదు. ఈ విషయంపై మేము చర్చించాలని పట్టుబట్టాము. కానీ వారు చర్చకు అనుమతించలేదు. ముఖ్యమైన ప్రజా సమస్యలను చర్చించడానికి బదులుగా.. ప్రభుత్వం పార్లమెంటు-లో మత విభజన గురించి చర్చించింది. దీనికోసం తెల్లవారుజామున 3-4 గంటల వరకు చర్చలు నిర్వహించింది. మణిపూర్ వంటి అంశాలపై ఉదయం 4.40 గంటలకు ప్రారంభమైంది. ఆరోజు మణిపూర్ అంశంపై మేము తరువాతరోజు మాట్లాడతామని అమిత్‌షాకు చెప్పాము. దీంతో ఈ విషయంపై మమ్మల్ని చర్చకే అనుమతించలేదు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ నేతలు ఇలాంటివి చేస్తున్నారు అని ఖర్గే విమర్శించారు. ఈ ప్రభుత్వానికి యువతకు ఉద్యోగాలు ఇచ్చే ఉద్దేశం లేదు. దేశంలో అన్నింటా ప్రభుత్వ ఆధిపత్యమే కొనసాగుతున్నదని, కేంద్ర ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వ నియంత్రణలోనే ఉన్నదని, అందుకే ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

# పెట్రోల ధరలతో కేంద్రం ఆర్థిక దోపిడీ

- సెస్సు వసూళ్లతో సొంత రాజకీయ ప్రచారాలు
- సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న మోడీ
- పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలి
- కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి కెటిఆర్ లేఖ



**హైదరాబాద్,ఏప్రిల్9:** పెట్రోల్ రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోదీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడికి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడు తుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తుందన్నారు. ఆకాశాన్నంటుతున్న పెట్రో ధరలపై కేంద్ర పెట్రోలియం,సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి బహిరంగ లేఖ రాసిన కేటీఆర్, ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని విమర్శించారు. భూటాన్, పాకిస్తాన్, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డిజిల్, ఎల్‌పీజీ ధరలు భారత్‌లో కంటే చౌకగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎల్పీజీ సిలిండర్ ధర రూ. 1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందన్నారు కేటీ-ఆర్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్‌గా మారిందన్నారు. ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారని చెప్పారు. గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులతో పాటు బిజెపి నేతలు అంతా గతంలో పెట్రో ధరలు తగ్గించమని ఆందోళన కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలో ప్రస్తావించారు. కేంద్రం పెంచుతున్న పెట్రోల్ గ్యాస్ ధరల వలన పేద ప్రజల జేబులు ఖాళీ అవుతుండగా ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్లు- పండగ అయిపోగానే పెంచడం ప్రజల్ని వంచించడమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం 'మాక్సిమం టాక్సేషన్, మినిమం రిలీఫ్'గా మారిందని విమర్శించారు. మోడీ చెప్పిన 'అచ్చే దిన్' అంటే ఈఎంఐలు కట్టలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మిడిల్ క్లాస్ సతమతమవడం, సిలిండర్ తెచ్చుకోవాలా? సరుకులు కొనుక్కోవాలా? అన్న మీమాంసలో పేదలు ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా అని కేటీఆర్ పశ్నించారు. దేశంలోని కోట్లాది ప్రజల తరపున రాసిన ఈ లేఖలో, ప్రజల తరపున కొన్ని డిమాండ్లను కేంద్రమంత్రి ముందు కేటీఆర్ ఉంచారు. ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, కేంద్ర ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాలకు ఇవ్వని సెస్‌లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రూడ్ ధరలకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం అమలు చేయాలన్నారు. ఇంధన పన్నులు, సెస్ వినియోగం, ఆదాయ వాటా వివరాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆర్థిక కేంద్రీకరణ విధానాలను విడనాడి, నిజమైన సహకార ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సూచించారు. దేశ ప్రజలు పెట్టు-కున్న నమ్మకాన్ని నిలబెట్టు-కోవాల్సిన సమయం కేందప్రభుత్వానికి వచ్చిందన్నారు కేటీ-ఆర్. ఆకట్టుకునే నినాదాల వెనుక దాక్కోవడం మాని, అసలైన పని చేయాలని కేటీఆర్ ఊచించారు.

## కోలుకుంటున్న మార్క్ శంకర్

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయం తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అప్పటికప్పుడు సింగపూర్‌కి బయలుదేరి వెళ్లగా.. పవన్ తర్వాత మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ కూడా మార్క్‌ని చూడడానికి వెళ్లారు. అయితే తాజాగా మార్క్ శంకర్ ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు ఫొటోను కుటుంబసభ్యులు విడుదల చేశారు. ఈ ఫొటోలో మార్క్ విజయానికి సంకేతం చూపిస్తున్నట్లుగా పోజ్ ఇచ్చాడు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం వైరల్‌గా మారింది. మరోవైపు మార్క్ పూర్తిగా కోలుకోవడానికి మూడు రోజులు పట్టనున్నట్లు సమాచారం. గత రాత్రి హైదరాబాద్ నుంచి సింగపూర్‌కు పవన్ కళ్యాణ్ సహా చిరంజీవి దంపతులు వెళ్లారు. పవన్ నేరుగా ఆసుపత్రికి చేరుకొని మార్క్‌ను కలిశారు. చేతులు, కాళ్లకు కాలిన గాయాలు కావడంతో పాటు, ఊపిరితిత్తులకు పొగ చేరడంతో అత్యవసర వార్డులో చికిత్స అందిస్తున్న ట్లు తెలు స్తోంది. అక్కడ వైద్యులు, అధికారులతో పవన్ కళ్యాణ్ ఇప్పటికే మాట్లాడారు. మార్క్ కోలుకు ంటున్నాడని, ఊపిరితిత్తుల దగ్గర పొగ చేరడంతో ఆ కారణంగా తలెత్తే ఆరోగ్యపరమైన ఇబ్బందుల గురించి పరీక్షలు చేస్తున్నామని వారు పవన్ దృష్టికి తీసుకొచ్చారు. మూడు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలోనే మార్క్‌కు పరీక్షలు చేయాల్సి ఉంటుందని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. అయితే, తాజాగా మార్క్ శంకర్‌కు సంబంధించిన ఒక ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో మార్క్ కాళ్లకు గానీ, చేతులకు గానీ ఇబ్బంది పెట్టే అంత గాయాలు అయితే కనిపించడం లేదు. మోచేతి దగ్గర ఒక కట్టుతో పాటు, ముఖానికి ఆక్సిజన్ సిలిండర్‌తో మార్క్ కనిపిస్తున్నాడు. రెం డు చేతులతో థమ్స్అప్ చూపిస్తూ, తాను బాగానే ఉన్నానని చెప్పే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అటకెక్కించారు

(మొదటి పేజీ తరువాయి)

చేసి రైతులకు నీళ్లు అందించాలని చెప్పేది. రేవంత్ రెడ్డి మాట్లాడితే పేగులు మెడలో వేసుకుంటా, తొక్కుతా చంపుతా తొడలదర కొడతా ఇలాంటి భాష రేవంత్ రెడ్డిది. ఢిల్లీలో కూడా రేవంత్ రెడ్డి పని అయిపోయింది. ఢిల్లీలో బిసి సభకు రాహుల్ గాంధీని తీసుకొని వస్తా పార్లమెంట్‌లో బిల్లు ఆమోదింపజేస్తానని అ న్నాడు. వీళ్ళ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ఢిల్లీలో ఉండి కూడా ధర్నాకు రాలేదు. రాహుల్ గాంధీ, సోనియాగాంధీ మరుసటి రోజు రేవంత్ రెడ్డి లేకుండా పిసిసి అధ్యక్షులతో ఉపముఖ్యమంత్రితో ఫోటోలు దిగారని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మొన్న ఒక స్టేట్‌మెంట్ ఇచ్చాడు. హెచ్‌సీయూ విద్యార్థుల మీద పెట్టిన కేసులు ఎత్తేస్తున్నామని ప్రకటించారు. ఈ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి ఆదేశించిందట ఉపముఖ్యమంత్రి కేసులు ఉపసంహరించుకుంటారంట. ముఖ్యమంత్రి హోంమంత్రి రేవంత్ రెడ్డి కేసులు పెడితే ఉపముఖ్యమంత్రి కేసులు ఉపసంహరించు కుంటాడు అంట. ఇదేమి రాజ్యం. తోక కుక్క నాడిస్తున్నదా కుక్క తోక నాడిస్తున్నదా అర్థం కావడం లేదు. రేవంత్ రెడ్డి పెట్టింది తప్పుడు కేసులని ఉపముఖ్యమంత్రి బట్టి భట్టి విక్రమార్క చెప్పినట్టే కదా..? హెచ్‌సీయూ విద్యార్థులపై అక్రమంగా కేసులు పెట్టారని విడుదల చేసినట్టే కదా..? అక్రమ కేసులో పెట్టినందుకు రాష్ట్ర హోం మంత్రిగా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి హెచ్‌సీయూ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కేసీఆర్ ఈ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలబెడితే.. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను పడగొట్టిండు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్ర జీఎస్టీ ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. కేసీఆర్ ఉన్నప్పుడు ప్రతి సంవత్సరం 12 శాతం జీఎస్టీ వృద్ధిరేటు ఉండేది. దేశ జీఎస్టీ కంటే సగానికి తెలంగాణ జిఎస్టి వృద్ధిరేటు- పడిపోయింది. దేశం 10 శాతం జీఎస్టీ వృద్ధిరేటు సాధిస్తే తెలంగాణ కేవలం 5 శాతం మాత్రమే వృద్ధిరేటు- సాధించింది.మొన్న అగ్రికల్చర్ యూనివర్సిటీలో 100 ఎకరాల భూమి తీసుకొని అక్కడ చెట్లని నరికేసిండు. నిన్న హెచ్ సీయు భూముల్లో 400 ఎకరాల అడవుల్లోనూ నరికి మూగజీవుల పాపం కట్టుకున్నాడు. జీవో 58,59 కింద ఇదే పటాన్‌చెరు నియోజకవర్గంలో వేల మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశాం. ఈరోజు రేవంత్ రెడ్డి వచ్చాక 58, 59 జీవో బంద్ పెట్టిండు. పైసలు కట్టినోళ్లకు కూడా పట్టాలు ఇవ్వడం లేదు. రైతుబంధు ఎగ్గొట్టిండు. రుణమాఫీ కూడా కాలేదు, రైతుబంధు రాలే, 4000 పెన్షన్ రాలే, అక్కచెల్లెళ్లకు మహాలక్ష్మి పెన్షన్

## మంచు కుటుంబంలో ముదురుతున్న వివాదం

(మొదటి పేజీ తరువాయి)

వివాదంతో ముందుకు వచ్చారు. ఇలా తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తన కారు పోయిందని పేర్కొంటూ మనోజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసి,ఇదంతా తన సోదరుడు విష్ణు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం జల్‌పల్లి నివాసం వద్దకు చేరుకున్న మనోజ్.. గేటు బయట భైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లోకి ఇచ్చేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు. నాకు ఈ ఆస్తి వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పాను. ఇది ఆస్తి గొడవ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా. అక్కడే మొదలైంది ఈ గొడవ. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఒక్క ఛార్జ్ షీట్ ఫైల్ చేయలేదు. కత్తులు, గన్‌లతో రౌడీలు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులకు ఇచ్చాను. ఇంట్లో నా పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటికోసమే వచ్చా అని మనోజ్ చెప్పారు. పాప పుట్టినరోజు కోసం మేం జయపుర వెళ్లిన తర్వాత విష్ణు ప్లాన్ చేసి ఇదంతా చేశారు. విష్ణు అనుచరులు ఇంటికి వచ్చి కార్లను తీసుకెళ్లారు. నా సెక్యూరిటీ-పై దాడి చేశారు. కమిషనర్ ఇచ్చిన బైండోవర్‌ను వాళ్లు ఎన్నోసార్లు దాటారు. నేను తప్పు చేశానని, ఆస్తి అడిగానని ఒక్క సాక్ష్యాధారం బయటపెట్టమనండి. అప్పుడు వాళ్లందరి కాళ్లపై పడి క్షమాపణ కోరతా. చోరీ గురించి పోలీసులకు చెబుతున్నా యాక్షన్ తీసుకోవడం లేదు. నా సెక్యూరిటీ- ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవట్లేదు. ఇప్పుడు నా ఇంట్లోకి వెళ్లడానికి ఆర్డర్ కావాలని పోలీసులు అడుగుతున్నారు. మోహన్‌బాబు చెబితేనే లోపలికి పంపిస్తానని అంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి నా విన్నపం ఒక్కటే. కోర్టు నోటీసులతో వచ్చినా లోపలకు పంపించడం లేదు. నా సమస్యను పరిష్కరించండని మనోజ్ విజ్ఞప్తి చేశారు. నా కుటుంబం నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి తీసుకోలేదు. బయట ప్రొడెక్షన్‌లో హిట్ కొడితే తీసుకొచ్చి సొంత నిర్మాణ సంస్థలో సినిమా చేయాల్సిందేనని అనేవారు. విష్ణు కెరీర్ నిలబెట్టడం కోసం లేడీ గెటప్ కూడా వేశా. వాళ్ల కోసం ఎంతో గొడ్డు చాకిరీ చేశా. అయినా ఎందుకింతలా దిగజారుతున్నారో అర్థం కావడం లేదు. 'కన్నప్ప'కు పోటీ-గా 'భైరవం' విడుదల చేద్దాం అనుకున్నాం. టెన్షన్ పడిపోయి కన్నప్ప వాయిదా వేసుకున్నాడు. ఆ కోపాన్ని ఎలా తీర్చుకోవాలో తెలియక ఇదంతా చేస్తున్నాడు. ఇప్పుడు నా తల్లిదండ్రులకు ఈ తలనొప్పులు అవసరమా? విష్ణు ప్రశాంతంగా కూర్చొని మాట్లాడవచ్చు కదా అని మనోజ్ వ్యాఖ్యానించారు.కారు చోరీపై నార్సింగి పోలీసులకు సమాచారం ఇవ్వగా అది విష్ణు ఇంట్లో ఉన్నట్లు- గుర్తించారు. రికవరీకి వెళ్లినప్పుడు దాన్ని మాదాపూర్‌కు పంపించారని మనోజ్ మీడియాతో చెప్పారు. ఈక్రమంలోనే పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు-చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## గృహ వినియోగదారులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

ఫిబ్రవరి నెల ప్రయోజనాన్ని ఇప్పటికీ బ్యాంకులు తగ్గించకపోతే మే నెల నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబో తున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఆర్‌బిఐ వరుసగా రెండోసారి కూడా రెపో రేట్‌ను 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ఇలా వడ్డీ రేట్లను తగ్గించడం ఈ ఏడాది ఇది రెండోసారి. ఫిబ్రవరి 7న కూడా 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అంతేకాదు భవిష్యత్‌లో మరిన్ని కోతలు ఉండే అవకాశం ఉందని సంకేతాలు ఇచ్చింది. ఆర్‌బీఐ తాజా నిర్ణయంతో ఎన్నాళ్లగానో ఈఎంఐ భారం మోస్తున్న గృహరుణ వినియోగదారులకు మరోమారు ఊరట కలిగిందనే చెప్పాలి. ఎవరైతే ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకొని ఉంటారో వారికి ఈఎంఐ తగ్గనుంది. ముఖ్యంగా 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో




## అక్రమ షెడ్ ను

# కూల్చారా.. చూసి వచ్చారా!

## రెండు మూడు రాళ్లను కూల్చి మమ టౌన్ ప్లానింగ్







**కుత్బుల్లాపూర్ : ఏప్రిల్ 9 (పీపుల్స్ న్యూస్)**

అక్రమ షెడ్లపై అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ఇటీవల నిజాంపేట్ జర్నలిస్టు కాలనీ సమీపంలో ఓ అక్రమ షెడ్ పై అనేక ఫిర్యాదులు అందినప్పటికీ దానిపై చర్యలు తీసుకోవడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు “మమ”అన్నట్లు వ్యవహరించారు. అక్రమ షెడ్డు దగ్గరకు వెళ్లిన అధికారులు షెడ్డు ను ఏమాత్రం ముట్టుకోకుండా షెడ్డు ఆవరణంలోకి వెళ్లేటప్పుడు కుడివైపు ప్రహరీ గోడకు ఉన్న నాలుగు రాళ్ళను తొలగించి కూల్చివేత్తలు అయినాయంటూ ఫోటోలు ఫోజులిచ్చారు. కానీ అక్రమంగా వెలసిన షెడ్డును మాత్రం ఏమాత్రం ముట్టుకోకపోవడం సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.


పీపుల్స్ న్యూస్
www.peoplesnews.in
05 Apr 2025 - Page 7

- అక్రమ షెడ్ నిర్మాణం జరిగినా పట్టించుకోని అధికారులు..!?
- నిజాంపేట స్విమ్మింగ్ పూల్ పరిస్థితి ఏంటి..?

అక్రమార్కులకు అండగా

అధికారులు..!

అక్రమ షెడ్డు... అందినది ఎంత..!?

రెసిడెన్షియల్ ప్రాంతంలో స్విమ్మింగ్ పూల్...!?

భారీ ఎత్తున లంచాలు అందాయా..!?

**అధికారులకు డబ్బులు ముట్టాయనే ఆరోపణలు.!**

ప్రభుత్వ అధికారులుగా జీతాలు తీసుకుంటూ ఎంతో హుందాతనంగా, బాధ్యత కలిగి విధులు నిర్వహించాల్సిన అధికారులు డబ్బుకు దాసోహమై పోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై గాని, అక్రమ షెడ్లపై గాని ఫిర్యాదులు వస్తే వాటి నుండి డబ్బులు ఎలా పిండుకోవాలని చూస్తున్నారే తప్ప, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నటువంటి దాఖలాలు ఎక్కడ కనిపించడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. నిజాంపేట జర్నలిస్ట్ కాలనీ సమీపంలో ఉన్న అక్రమ షెడ్ నిర్మాణం కూడా ఈ కోవలోకే వస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు. అక్రమంగా షెడ్ నిర్మాణం చేసి అందులో ఓ భారీ స్విమ్మింగ్ పూల్ ను ఏర్పాటు చేస్తున్నప్పటికీ, సదరు నిర్మాణదారుడు దగ్గర ఏమేమి అనుమతులు ఉన్నాయో కూడా పరిశీలించకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు ఇతర అధికారులు నామమాత్రంగా కూల్చివేతలు చేసి వెళ్లారు. దీని వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారినట్లు ప్రజల భావిస్తున్నారు.




**కొన్ని షెడ్లను నేలమట్టం..!**

పట్టణ ప్రణాళిక విభాగపు అధికారులకు అక్రమ షెడ్ల నిర్మాణం నుండి ముడుపులు అందకపోతే ఎటువంటి ఫిర్యాదులు అందక పోయినప్పటికీ షడ్లపై చర్యలు తీసుకొని నేలమట్టం చేస్తున్న దాఖలాలు చాలా ఉన్నాయి. కానీ అదే అక్రమ షెడ్లు నిర్మాణదారులు అధికారులకు ముడుపులు చెల్లించుకుంటే వేల సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినా కూడా తమకేం పట్టదు అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శ ఉంది. ఈ కోణంలోనే నిజాంపేట జర్నలిస్టు కాలనీ సమీపంలో నియమిస్తున్న షెడ్డును తాత్కాలికంగా కొన్ని రాళ్లు తొలగించినట్లు ప్రజల భావిస్తున్నారు. బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులుగా వారు విధులు సక్రమంగా నిర్వర్తించి అక్కడ నిర్మించిన అక్రమ షెడ్డ్పై చర్యలు తీసుకోవాలని ప్రజల కోరుతున్నారు. వ్యాపార నిమిత్తం ఏర్పాటు చేస్తున్న ఆ షెడ్డులో భవిష్యత్తులో ఏదైనా ప్రమాదాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారు అన్నది ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## అక్రమ నిర్మాణాన్ని అధికారులు

# అడ్డుకోరా. ?



**కుత్బుల్లాపూర్ : ఏప్రిల్ 9 (పీపుల్స్ న్యూస్)** గాజుల రామారావు సర్కిల్ 26 పరిధిలో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. అధికారులు నిర్లక్ష్యం వలన కొద్ది జాగాలోనే అయిదారు అంతస్తులు నిర్మాణం చేస్తున్నారు. దీనివలన భవిష్యత్తులో అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఓ నిర్మాణ దారుడు ఏకంగా ఎలాంటి అనుమతులు లేకుండా %+%ం3 నిర్మాణం చేశాడు. ఈ నిర్మాణపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




## ప్రమాదకరంగా పనులు..!

సదరు నిర్మాణదారుడు నిర్మాణ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఏమాత్రం పాటించకుండా గాలికి వదిలేసాడు. తాపీ మేస్త్రులకు ఎలాంటి రక్షణ లేకుండా పనిచేస్తున్న సంఘటనలు అక్కడ కనిపిస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే కార్మికుల ప్రాణాలు గాలులో కలిసిపోయే ప్రమాదం ఉంది కనుక టౌన్ ప్లానింగ్ అధికారులు దీనిని సందర్శించి నిర్మాణదారుడు కి తగిన ఏర్పాట్లు చేసుకునేలా సూచించడంతోపాటు అక్రమ నిర్మాణం కింద దీనిని గుర్తించి నోటీసులు అందజేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## రక్షణ పేరుతో కర్రెగుట్టపై ప్రెషర్ మైన్స్ ఆమర్చి అమాయక ప్రజల ప్రాణాలు బలికొంటున్న సిపిఐ మావోయిస్టులు

### కర్రెగుట్ట భద్రత పై పటిష్టమైన చర్యలు చేపడుతున్న ములుగు పోలీస్



**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 09(పీపుల్స్ న్యూస్):** ప్రభుత్వ నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ తెలంగాణలోని దాని ప్రాబల్యం పూర్తిగా తుడిచి పెట్టుకొని పోయింది,మావోయిస్టు పార్టీకి ప్రజలలో ఎటు వంటి ఆదరణ లేదు, ఆ పార్టీ సిద్ధాంతాలను ప్రజలు ఎవరు నమ్మడం లేదు, మావోయిస్టు పార్టీ కేవలం తన ఉనికిని చాటుకోవడానికి,ఆ పార్టీ నాయకుల స్వప్రయో జనాల కోసం ములుగు జిల్లాలోని వెంకటా పురం మరియు వాజేడు మండలాల్లోని సరిహద్దు కర్రేగుట్ట ఆటవి ప్రాంతంలో మావోయిస్టుల మతిభ్రమించి రక్షణ పేరుతో ప్రజలు నిత్యం తిరిగే ప్రదేశాలలో ప్రెషర్ మైన్స్ పెట్టి వారి ప్రాణాలు బలిగొంటున్నారు.ఈ విధంగా సిపిఐ మావోయిస్టు పార్టీ నాయకులు తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి వారు పెట్టిన ప్రేషర్ మైన్స్ వల్ల బలి అవుతున్న అమాయక గిరిజన, గిరిజనేతర ప్రజలపై పోలీస్ ఇన్ఫార్మర్ అని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు సిపిఐ మావోయిస్టు పార్టీ అమర్చిన ప్రేషర్ మైన్స్ వలన కర్రేగుట్ట పైకి పశువులను మెపట

## గుత్తి కోయ గ్రామాలను సందర్శించిన చీఫ్ ఇంజనీర్ హైదరాబాద్








**ములుగు ప్రతినిధి ఏప్రిల్ 9(పీపుల్స్ న్యూస్):**ఇందుమూలంగా సమస్త పత్రిక విలేకరులు ములుగు జిల్లా తెలియపరచినది ఏమనగా, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఆదేశాల అనుసారము కే సురేష్ చీఫ్ ఇంజనీర్ హైధారాబాద్ శ్రీ కె మల్లేశం పర్యవేక్షక ఇంజనీరు హనుమకొండ శ్రీ ఎమ్ వెంకటసతీష్ డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజనీరు ఏటూరునాగరము సంబంధిత ఏఈలు ఏటూరునాగరము మండలంలో గల గుత్తి కోయ గ్రామలు అయినటువంటి గంటలకుంట గుండెంగవాయి గ్రామాలను సందర్శించడం జరిగినది.వారి యొక్క త్రాగునీటి వనరులను పరిశీలించినారు ప్రజల యొక్క వినతులను ఆలకించి మంత్రి విన్నవించగలమని హామీ ఇచ్చినారు.

# తగ్గేదేలే అంటున్న పోలీసు అధికారుల సంఘం..
## మాజీ సీఎం జగన్ ను వదిలిపెట్టమంటూ వార్నింగ్



**రామగిరి :**మాజీ సీఎం జగన్ పై రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం సీరియస్ అవుతోంది. మంగళవారం రాప్తాడు నియోజకవర్గంలో పర్యటించిన వైసీపీ అధినేత జగన్ పోలీసులను బట్టలూడదీసి నిలబెడతానంటూ వ్యాఖ్యానించడం వివాదాస్పదంగా మారుతోంది. జగన్ వ్యాఖ్యలపై రామగిరి ఎస్ఐ ఘాటుగా స్పందించగా, మహిళా పోలీసులు సైతం నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు ఇదే అంశంపై స్పందించిన రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని కోర్టుకు ఈడుస్తామంటూ హెచ్చరించింది.రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలంలో వైసీపీ కార్యకర్త లింగమయ్య హత్య నేపథ్యంలో హతుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన మాజీ సీఎం జగన్ పోలీసులపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పెద్దలు, అధికార పార్టీ నేతల మెప్పుకోసం పోలీసులు వారు చెప్పినట్లు నడుచుకుంటున్నారని విమర్శించిన ఆయన తాను మళ్లీ సీఎం అవగానే పోలీసులను బట్టలూడదీసి నిలబెడతానంటూ హెచ్చరించారు. దీంతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ పోలీసు అధికారుల సంఘం నిరసన వ్యక్తం చేస్తోంది. మహారాష్ట్రలోని శివసేన నేత సంజయ్ రౌత్ కూడా గతంలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో కోర్టుకు ఈడ్చామని, ఇప్పుడు జగన్ విషయంలోనూ న్యాయపోరాటం చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని పోలీసు అధికారుల సంఘం ప్రకటించింది.మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసిన పోలీసు అధికారుల సంఘం, ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ రాసింది. దీనిపై స్పందించిన హోంమంత్రి అనిత చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో పోలీసు అధికారుల సంఘం జగన్ పై కోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తుందని అంటున్నారు. పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ పోలీసులపై చేసిన వ్యాఖ్యలను సభ్యసమాజం ఆలోచించాలని అన్నారు. "బట్టలూడదీసి నిలబెట్టడానికి ఇదేమైనా ఫ్యాషన్ షోనా? అంటూ ప్రశ్నించారు. పోలీసు ఉద్యోగులుగా మహిళలూ ఉన్నారన్న విషయాన్ని మాజీ సీఎం మరచిపోయారా? అంటూ నిలదీశారు.

# లీటరుకు రూ.2తో వచ్చే ఆదాయం రూ.32వేల కోట్లు



**హైదరాబాద్:**ఏ చిన్న అవకాశం దొరకాలే కానీ మోడీ మాష్టారు అస్సలు ఊరుకోరు. లెక్కల విషయంలో ఆయన చాలా పక్కా. అన్నింటికి మించి వడ్డింపుల విషయంలో ఎంత కఠినంగా ఉంటారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరమే లేదు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు తగ్గిన నేపథ్యంలో పెట్రోల్.. డీజిల్ భారాన్ని తగ్గిస్తారని అందరూ భావించారు. అలా చేస్తే ఆయన మోడీ మాష్టారు ఎందుకు అవుతారు.ముడిచమురు ధరలు భారీగా తగ్గిన నేపథ్యంలో.. ఆ తగ్గింపును ప్రజలకు ఇచ్చే బదులుగా.. కంపెనీలకు వేసే ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.2 చొప్పున పెంచేయటం తెలిసిందే. కాకుంటే.. ఈ పెంపు ప్రజల మీద నేరుగా ప్రభావం చూపని రీతిలో కంపెనీలకు వాత పెట్టింది మోడీ సర్కారు. ఈ వడ్డనతో కేంద్రానికి వచ్చే ఆదాయం ఎంతో తెలుసా? అక్షరాల రూ.32 వేల కోట్లుగా లెక్క కట్టారు. పెంచిన సుంకం మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో కేంద్ర పెట్రోలియం.. సహజవాయువు మంత్రిత్వ శాఖ కార్యదర్శి.. పెంచిన సుంకంతో కేంద్రానికి వచ్చే అదనపు ఆదాయం ఎంతన్న లెక్క వేశారు.ఇంత లాభం వస్తుందా? అన్న ఆశ్చర్యానికి గురయ్యేలోపు.. ఆయనో మాటను చెప్పుకొచ్చారు. 2024-25లో చమురు మార్కెటింగ్ కంపెనీలు రూ.41 వేల కోట్ల నష్టాన్ని చవిచూశాయని..


తాజాగా పెంచిన సుంకంతో సదరు నష్టాల్ని పూడ్చుకునేందుకు వినియోగిస్తామని చెప్పారు. ప్రస్తుతం పెంచిన సుంకంతో వచ్చే వసూళ్లు.. కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ఇండియాకు వెళ్తాయన్నారు.ఆ తర్వాత వీటిని చమురు మార్కెటింగ్ కంపెనీలకు బదిలీ చేసేలా ఆర్థిక శాఖ చమురుశాఖను సంప్ర దిస్తుందని చెప్పారు. ఇక.. రెండురోజుల క్రితం వంటగ్యాస్ సిలిండర్ మీద రూ.50 చొప్పున పెంపుతో రాయితీ మీద ఇచ్చే ఉజ్వల సిలిండర్లతో వచ్చే నష్టాల్ని చమురు కంపెనీలు పూడ్చుకుంటాయని చెప్పుకొచ్చారు. చూశారా.. మోడీ సర్కారు లెక్కల విషయంలో ఎంత పక్కాగా ఉంటుందో?

# ముజ్రా పార్టీ భగ్నం.. అమ్మాయిలతో అర్ధనగ్నంగా నృత్యాలు



**రంగారెడ్డి జిల్లా :**రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఏతబర్‌పల్లి గ్రామ శివారులోని హాలీడే ఫామ్‌హౌస్‌లో జరుగుతున్న ముజ్రా పార్టీని పోలీసులు భగ్నం చేశారు. పుట్టినరోజు వేడుకల పేరుతో కొందరు యువకులు ముజ్రా పార్టీ ఏర్పాటు చేసినట్టు పోలీసులు గుర్తించారు. పార్టీ కోసం నిర్వాహకుడు ముంబై నుంచి యువతులను రప్పించినట్టు వెల్లడించారు. ఈ క్రమంలోనే అర్ధ నగ్నంగా నృత్యాలు చేస్తున్న అమ్మాయిలు, అబ్బాయిలను అరెస్ట్ చేశారు.అంతే కాకుండా పార్టీలో అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి గంజాయి, హుక్కా పీలుస్తూ ఎంజాయ్ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ముజ్రా పార్టీ జరుగుతుందన్న పక్కా సమాచారంతో ఫామ్‌హౌస్‌పై దాడులు చేశామని ఎస్‌వోటీ పోలీసులు వివరించారు. ముజ్రా పార్టీ నిర్వహించిన నిర్వాహకుడిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అలానే ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్‌తో పాటు పెద్ద మొత్తంలో మద్యంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడి నుంచి మరింత సమాచారం తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో దాడుల్లో భాగంగా.. వారి నుంచి భారీగా మద్యం, హుక్కా, గంజాయి స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడుల్లో ఏడుగురు యువతులు, 14 మంది పురుషులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యువకులు అందరూ పాత బస్తీకి చెందిన వారీగా పోలీసులు గుర్తించారు. యువతుల్లో ముంబై నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఉన్నట్టు సమాచారం.

# విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి శ్యామ్ ప్రసాద్



**జగిత్యాల :** విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల సంస్థ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శ్యాం ప్రసాద్ లాల్ ఆదేశించారు. గురువారం జగిత్యాల జిల్లాలోని అల్లిపూర్ లో రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులను పరిశీలించారు. ప్రతినిత్యం విద్యార్థులకు అందిస్తున్న ఆహారంపై అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను పెంపొందించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు రావాలన్నారు. నాణ్యమైన భోజనం అందించాలని, నాసిరకం సరుకులు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం రెసిడెన్షియల్ పాఠశాలల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు విద్యనునెరవేరుతుందన్నారు.

# ఆగస్టు 15 డెడ్‌లైన్..సీఎన్‌జీ ఆటోలు బంద్.. ప్రభుత్వం సంచలన నిర్ణయం

**ఢిల్లీ :**ఢిల్లీ రోడ్లపై కనిపించే ఆకుపచ్చ, పసుపు రంగు సీఎన్‌జీ ఆటో రిక్షాలు త్వరలోనే కనుమరుగయ్యేలా ఉన్నాయి. ఢిల్లీలోని రేఖా గుప్తా ప్రభుత్వం త్వరలో ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతం కోసం కొత్త ఎలక్ట్రిక్ వెహికల్ పాలసీ 2.0 ఆమోదించనుంది. ఈ పాలసీ డ్రాఫ్ట్ డాక్యుమెంట్‌లో సీఎన్‌జీ ఆటో రిక్షాలను నిలిపివేయడానికి తుది గడువును పేర్కొన్నారు. అంతేకాకుండా, డ్రైవర్లు కొత్త ఆటో రిక్షాలు కొనాల్సిన అవసరం లేకుండా ఒక పరిష్కారాన్ని కూడా సూచించారు. ఈవీ పాలసీ 2.0 డ్రాఫ్ట్ ప్రకారం, ఢిల్లీలో సీఎన్‌జీతో నడిచే ఆటో రిక్షాలను దశలవారీగా తొలగిస్తారు. మొదటి దశలో 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీఎన్‌జీ ఆటో రిక్షాలను నిలిపివేస్తారు. వాటి స్థానంలో ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలను ప్రవేశపెడతారు.పాలసీ డ్రాఫ్ట్ ప్రకారం, ఈ సంవత్సరం ఆగస్టు 15 తర్వాత ఢిల్లీలో ఏ సీఎన్‌జీ ఆటో రిక్షాకు కూడా కొత్తగా పర్మిట్ జారీ చేయబడదు. అంతేకాకుండా, పాత సీఎన్‌జీ ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్‌ను కూడా పునరుద్ధరించరు. ఈ కొత్త ఆటోల స్థానంలో కేవలం ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలకు మాత్రమే పర్మిట్ జారీ చేస్తారు.సీఎన్‌జీ నుంచి ఎలక్ట్రిక్‌కు మార్చుకునే అవకాశం



ఢిల్లీ ఈవీ పాలసీ 2.0 అమలులో ఉన్నంత కాలం, 10 సంవత్సరాల కంటే పాతవైన అన్ని సీఎన్‌జీ ఆటో రిక్షాలను ప్రభుత్వం పూర్తిగా ఎలక్ట్రిక్‌తో భర్తీ చేస్తుంది. అంతేకాకుండా, ఆటో రిక్షా డ్రైవర్లకు వారి సీఎన్‌జీ ఆటో రిక్షాలను ఎలక్ట్రిక్‌గా మార్చుకునే సౌకర్యం కూడా కల్పిస్తారు. వారు తమ సీఎన్‌జీ ఆటోలో ఎలక్ట్రిక్ కిట్‌ను అమర్చుకోవడం ద్వారా వారి ప్రస్తుత ఆటో రిక్షాను బ్యాటరీతో నడిచేలా చేయవచ్చు. ఇది ప్రజలు పెట్రోల్ వాహనాలను సీఎన్‌జీగా మార్చుకున్నట్లే ఉంటుంది.చెత్త బండ్లు కూడా ఎలక్ట్రిక్!

ఢిల్లీలో కేవలం సీఎన్‌జీ ఆటో రిక్షాలను మాత్రమే ఎలక్ట్రిక్‌తో మార్చరు. ప్రభుత్వం చెత్తను తీసుకెళ్లడానికి ఉపయోగించే వాహనాలను కూడా ఎలక్ట్రిక్‌గా మారుస్తుంది. అంతేకాకుండా, ఇకపై ఆర్డర్ చేసే అన్ని కొత్త బస్సులు కేవలం ఎలక్ట్రిక్ బస్సులే ఉంటాయి. పాత క్లస్టర్ బస్సులను కూడా ఎలక్ట్రిక్‌గా మార్చే అవకాశంపై ప్రభుత్వం పనిచేస్తోంది. పాలసీ డ్రాఫ్ట్ సిఫార్సులో ఆగస్టు 15, 2026 నుండి పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీతో నడిచే టూ-వీలర్ వాహనాలకు అనుమతి ఉండదని కూడా పేర్కొన్నారు.అదేవిధంగా, ఆగస్టు 15, 2025 నుండి ఢిల్లీలో నడిచే అన్ని లోడింగ్ వెహికల్స్ లేదా కమర్షియల్ త్రీ-వీలర్స్ కూడా ఎలక్ట్రిక్‌గా మారతాయి.

డీజిల్, పెట్రోల్, సీఎన్‌జీతో నడిచే అలాంటి వాహనాల రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం అనుమతించదు.ఇక ప్రైవేట్ కార్ల యజమానులు కూడా రెండు కార్ల

తర్వాత మూడవ కారు కొనాలంటే, వారు ఎలక్ట్రిక్ కారు మాత్రమే కొనాల్సి ఉంటుంది.

# విస్కీ తాగే అమ్మాయిలు పెరిగారంట..
## 2030లో ఇండియా అంతా మిడిల్ క్లాసే



**హైదరాబాద్:**ఇండియాలో చాలామందిది మధ్యతరగతి కుటుంబాలే. వీళ్లందరి జీవన విధానం, తినే తిండి, ఖర్చు పెట్టే అలవాట్లు దాదాపు ఒకేలా ఉంటాయి. మిడిల్ క్లాస్ అంటేనే ఏదైనా ఆలోచించి, లెక్కలేసుకుని ఖర్చు పెట్టడం. కానీ ఊహించండి.. వచ్చే కొన్నేళ్లలో ఇండియాలో సగం కంటే ఎక్కువ మంది మిడిల్ క్లాస్ వాళ్లే అయితే? అవును, ఓ రిపోర్ట్ ప్రకారం 2030 నాటికి దేశంలో సగానికి పైగా జనాభా మిడిల్ క్లాస్‌లోకి మారిపోతారట.బ్యూటిక్ కల్చరల్ సంస్థ 'ఫోకస్ ఫ్రీక్వెన్సీ' తన రిపోర్ట్‌లో ఈ విషయం చెప్పింది. 2030 నాటికి ఇండియాలో సగానికి పైగా మిడిల్ క్లాస్ కుటుంబాలే ఉంటాయట. వాళ్ల ఖర్చు పెట్టే విధానం కేవలం అవసరాల మీదే కాకుండా అనుభవాల మీద కూడా ఆధారపడి ఉంటుందట. రిపోర్ట్ ప్రకారం క్యాజువల్ డైనింగ్, ఫైన్ డైనింగ్ లాంటి వాటికి డిమాండ్ బాగా పెరుగుతుందట. మిడిల్ క్లాస్‌లో తరతరాలుగా ఉన్న పేదరికం నుంచి చాలామంది బయటపడుతున్నారు. తమ కుటుంబంలో చదువుకున్న మొదటి వ్యక్తిగా కూలి పనికి బదులు మంచి ఉద్యోగాలు చేస్తున్నారు.57 శాతం ఇంటర్నెట్ యూజర్లు పల్లెటూర్ల నుంచేఇండియాలో 57 శాతం ఇంటర్నెట్ యూజర్లు పల్లెటూర్లు, చిన్న పట్టణాల (టీయర్-2o) నుంచే ఉన్నారని రిపోర్ట్‌లో పేర్కొన్నారు. అయినా అడ్వర్టైజ్‌మెంట్ చేసేవాళ్లు మాత్రం మెట్రో సిటీస్, ఇంగ్లీష్ మాట్లాడేవాళ్లకే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. దీనివల్ల అల్గారిథమ్‌లలో ప్రాంతీయ భాషల విషయంలో పక్షపాతం ఉంటోంది. చాలామంది యూజర్లను పట్టించుకోవడం లేదు. ఒకవేళ నిజంగా ఇండియాలోని అందరి హృదయాలను చేరుకోవాలంటే లోకల్ విషయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిజిటల్ మార్కెట్‌లకు ఈ రిపోర్ట్ హెచ్చరిక జారీ చేసింది.

ఖర్చు పెట్టే అలవాట్లలో మార్పుఇప్పుడు కేవలం అవసరమైన వస్తువులు మాత్రమే కొనడం లేదు. ప్రజలు ఎక్స్‌పీరియన్స్ ఉన్న సర్వీసులు, ప్రీమియం లైఫ్‌స్టైల్‌కు అలవాటు పడుతున్నారని రిపోర్ట్‌లో చెప్పారు. అందుకే క్యాజువల్ డైనింగ్‌లో 49శాతం, ఫైన్ డైనింగ్‌లో 55శాతం పెరుగుదల కనిపించింది. ఇప్పుడు ఖర్చు కేవలం అవసరాలు తీర్చడమే కాదు, నెమ్మదిగా ఒక స్టైల్ స్టేట్‌మెంట్‌గా కూడా మారుతోంది.

మహిళల పెరుగుతున్న పాత్ర ఇండియాలో చదువుకున్న వాళ్ల సంఖ్య పెరిగింది. దీనివల్ల పేదరికం కూడా తగ్గింది. 2011లో 22.5 శాతంగా ఉన్న పేదరికం 2019 నాటికి 10.2 శాతానికి పడిపోయింది. ఇండియాలో సగానికి పైగా మెడికల్ స్టూడెంట్స్, చాలామంది మహిళలే ఉన్నారని రిపోర్ట్ సూచిస్తోంది. ఇప్పుడు 14శాతం బిజినెస్‌లు మహిళల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. సింగిల్ మాల్ట్ విస్కీ అమ్మకాలు 64శాతం పెరిగాయి, ఇందులో మహిళల పాత్ర చాలా కీలకం. ఇప్పటి జనరేషన్ ఆల్ఫా జనరేషన్. 25 ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న యువత ఖర్చు పెట్టే విషయంలో చాలా ప్రభావవంతమైన పాత్ర పోషిస్తున్నారు. 2030 నాటికి కొత్త దిశలో ఇండియాకాబట్టి 2030 నాటికి ఇండియా కేవలం టెక్నాలజీ, ఆర్థికంగానే కాదు.. సామాజిక, సాంస్కృతిక, వినియోగదారుల మార్పుల్లోనూ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. పెరుగుతున్న మిడిల్ క్లాస్, మహిళా సాధికారత, డిజిటల్ డిమాండ్, కొత్త ఆలోచనలు, అనుభవాల ఆధారంగా ఖర్చు పెట్టే అలవాట్లు, చైతన్యవంతమైన యువత.. ఇవన్నీ కలిసి ఇండియాను ఒక కొత్త దిశలో ముందుకు తీసుకెళ్లడానికి పనిచేస్తున్నాయి.

# భార్యల ఆటలు ఇక చెల్లవు భర్తల కోసం చట్టంలో స్పెషల్ రూల్స్

**హైదరాబాద్:**సాధారణంగా భార్యలు తమ భర్తలు వేధిస్తున్నారంటూ చట్టాన్ని ఆశ్రయించడం, వారిపై ఫిర్యాదు చేయడం మనం చూస్తుంటాం. కోర్టు కూడా భార్యల మాటలకు ప్రాధాన్యతనిస్తూ తీర్పునిస్తుంది. మహిళలకు చట్టపరమైన హక్కులు ఉన్నాయి, వాటిని వారు ఉపయోగించుకుంటారు. వారికి న్యాయం కూడా లభిస్తుంది. కానీ నేటి కాలంలో చాలా మంది మహిళలు తమకు లభించిన చట్టపరమైన హక్కులను దుర్వినియోగం చేస్తున్నారు. భర్తలను కూడా వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, భర్తలు 'అన్ని హక్కులు మహిళలకే ఉన్నప్పుడు, మాకు ఏ హక్కులున్నాయి?' అని ఆలోచిస్తుండవచ్చు. ఈరోజు మనం భర్తల హక్కుల గురించి ఈ కథనంలో తెలుసుకుందాం.దాదాపు రెండేళ్ల క్రితం మహేష్ కుమార్ తివారీ అనే న్యాయవాది జాతీయ మహిళా కమిషన్ తరహాలో జాతీయ పురుషుల కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గణాంకాలను ఉటంకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ గణాంకాల ప్రకారం 2021లో దేశవ్యాప్తంగా 1,64,033 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో వివాహితులైన పురుషుల సంఖ్య 81,063 కాగా, వివాహితులైన మహిళల సంఖ్య 28,680. ఇలాంటి పరిస్థితుల్లో భర్తలు తమ హక్కులను తెలుసుకోవడం చాలా ముఖ్యం. యూకే, యూఎస్ వంటి దేశాలలో గృహ హింసకు లింగ-తటస్థ చట్టాలు ఉన్నాయి. కానీ భారతదేశంలో ఈ చట్టం కేవలం మహిళల కోసం మాత్రమే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో



భార్యలు భర్తలను వేధిస్తే వారు ఎక్కడికి వెళ్లాలో తెలుసుకుందాం.భర్తల చట్టపరమైన హక్కులు ఏమిటి?నిజానికి భార్యల మాదిరిగా భర్తలకు సాధారణ హక్కులు లేవు, కానీ తమ రక్షణ, గౌరవం కోసం వారికి కొన్ని చట్టపరమైన హక్కులు తప్పకుండా ఇవ్వబడ్డాయి. వాటి గురించి పాయింట్ల వారీగా తెలుసుకుందాం:లి భార్య భర్తపై గృహ హింసకు పాల్పడితే, అతను పోలీసుల సహాయం తీసుకోవచ్చు. భార్య భర్తను ఏదైనా తప్పు పని చేయమని బలవంతం చేస్తే లేదా ఒత్తిడి చేస్తే, అతను 100 నంబర్‌కు లేదా మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 1091కి కాల్ చేసి సహాయం పొందవచ్చు.లి భర్త తన స్వంత సంపాదనతో కొనుగోలు చేసిన ఆస్తి (స్వ-ఆర్జిత ఆస్తి)పై పూర్తి హక్కు భర్తకే ఉంటుంది. భార్య లేదా పిల్లలకు దానిపై ఎలాంటి హక్కు ఉండదు. ఒకవేళ భర్త కోరుకుంటే ఆ ఆస్తిని వారికి ఇవ్వవచ్చు లేదా ఏదైనా ట్రస్ట్‌కు దానం చేయవచ్చు. భార్య భర్తను మానసికంగా వేధిస్తే, ఉదాహరణకు స్నేహితులు-బంధువులను కలవనివ్వకపోవడం, ఇంటి నుండి బయటకు వెళ్లనివ్వకపోవడం, కుటుంబ సభ్యులను కలవనివ్వకపోవడం, పదే పదే నపుంసకుడని తిట్టడం, శారీరకంగా హింసించడం లేదా నష్టం కలిగించడం, ప్రతి పనిలో ఎక్కువగా కలగజేసుకోవడం, అందరి ముందు లేదా ఒంటరిగా తిట్టడం, భావోద్వేగ హింసకు గురిచేయడం లేదా పదే పదే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడం వంటి వాటికి భర్త పోలీసుల, కోర్టు సహాయం తీసుకోవచ్చు. భార్యల మాదిరిగానే భర్తలకు కూడా హిందూ వివాహ చట్టం ప్రకారం భరణం పొందే హక్కు ఉంది. అయితే, కేసు విచారణ తర్వాత భరణం మొత్తాన్ని కోర్టు నిర్ణయిస్తుంది. భర్తలకు కూడా విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసే హక్కు ఉంది. దీని కోసం వారికి భార్య అనుమతి కూడా అవసరం లేదు. వేధింపులు లేదా ప్రాణహాని ఉందని పేర్కొంటూ వారు పిటిషన్ దాఖలు చేయవచ్చు. ఏకపక్షంగా లేదా పరస్పర అంగీకారం లేకుండా కూడా విడాకులు తీసుకునే హక్కు భర్తలకు ఉందని కోర్టు స్పష్టం చేసింది. పిల్లల సంరక్షణపై భర్తకు కూడా సమాన హక్కు ఉంటుంది. అయితే, కోర్టు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆర్థికంగా స్థిరమైన తల్లిదండ్రులకు సంరక్షణ బాధ్యతను అప్పగిస్తుంది. పిల్లలు చాలా చిన్నవారైతే వారి సంరక్షణ బాధ్యత తల్లికి ఉంటుంది. కానీ తల్లి నిర్ణయాన్ని మార్చవచ్చు.

# గాడిద పాల పనీర్ కొనాలంటే బ్యాంకులు లూటీ చేయాల్సిందేనేమో



**హైదరాబాద్:**పనీర్ అంటేనే కొందరికి భలే ఇష్టం. కానీ దాని ధర వింటే 'అబ్బాబోయ్ బంగారం షాపులో దొరుకుతుందేమో' అనుకుంటారు. కానీ ఇప్పుడు మనం చెప్పబోయే పనీర్ సంగతి వింటే మాత్రం నిజంగానే షాక్ అవుతారు. అదే గాడిద పాలతో చేసిన పనీర్! అవును, ఎవరూ పట్టించుకోని గాడిద పాలు ఇంత విలువైనవా, పోషకాలు ఉంటాయా అని ఆశ్చర్యపోతారు. సాధారణ ఆవు, గేదె పాల పనీరే ఎక్కువ అనుకునేవాళ్లకు గాడిద పాల పనీర్ ధర తెలిస్తే దిమ్మతిరిగిపోతుంది.మన దగ్గర కిలో 300-400 రూపాయలకు దొరికే పనీరే సామాన్యుడి ప్లేట్‌లో అప్పుడప్పుడూ కనిపిస్తుంది. కానీ గాడిద పాలతో చేసిన పనీర్ ధర అక్షరాలా లక్ష రూపాయలు కిలో! గాడిద పాలు అంటే డంకీ మిల్క్‌ను ప్రపంచవ్యాప్తంగా లిక్విడ్ గోల్డ్ అని పిలుస్తారు. ఎందుకంటే ఇందులో అద్భుతమైన పోషకాలు ఉంటాయి. ప్రోటీన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్, కాల్షియం ఇంకా ముఖ్యంగా లైసోజైమ్ ఇందులో పుష్కలంగా ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది.గాడిద పాల స్పెషాలిటీ ఇదేఅంతేకాదు, గాడిద పాలలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు కూడా ఉంటాయట. ఇవి రోగాలతో పోరాడటానికి శక్తినిస్తాయి. రోమ్ రాణి క్లియోపాత్రా తన మెరిసే చర్మం కోసం ఈ పాలతోనే స్నానం చేసేదని కూడా చెబుతారు. గాడిద పాలు అంత ఖరీదు కావడానికి కారణం, ఒక గాడిద రోజుకు కేవలం 200 నుండి 300 మిల్లీలీటర్ల పాలు మాత్రమే ఇస్తుంది. కాబట్టి ఒక లీటర్ పాలు కోసం చాలా గాడిదలు కావాలి. దీన్ని పనీర్‌గా మార్చడానికి ప్రాసెసింగ్ ఖర్చు కూడా చాలా ఎక్కువ. అంటే 25లీటర్ల గాడిద పాలు తీస్తే కేవలం మైండ్ బ్లాంక్.

# జగన్ తీరుపై హోంమంత్రి అనితకు అనుమానం



**సత్యసాయి జిల్లా :**మాజీ సీఎం జగన్మోహనరెడ్డి తీరుపై రాష్ట్ర హోంమంత్రి అనిత తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం సత్యసాయి జిల్లా రాప్తాడులో పర్యటించిన మాజీ సీఎం జగన్ పోలీసులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు. జగన్ భద్రతకు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించామని, కానీ, ఆయన భద్రతా లోపాలంటూ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. జగన్ ప్రయాణించిన హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతింటే, ఆయన రోడ్డు మార్గాన వెళ్లిపోయిన 15 నిమిషాలకే హెలికాప్టర్ లో పైలెట్లు ఎలా వెళ్లగలిగారని అనిత సందేహం వ్యక్తం చేశారు.మాజీ సీఎం హోదాలో జగన్మోహనరెడ్డికి ఇవ్వాల్సిన భద్రత కన్నా ఎక్కువే ఇస్తున్నామని హోంమంత్రి అనిత వివరణ ఇచ్చారు. తనకు భద్రత కల్పించడం లేదని మాజీ సీఎం జగన్ తోపాటు, ఆ పార్టీ నేతలు ఆరోపించడంపై హోంమంత్రి విరుచుకుపడ్డారు. ప్రజలు 11 సీట్లతో తీర్పిచ్చినా సిగ్గు రాలేదా? అంటూ ఫైర్ అయ్యారు. గతంలో ఐపీసీ కన్నా వైసీపీ కోడ్ అమలు చేశారని విమర్శించారు. రాప్తాడు నియోజకవర్గంలో పర్యటించిన జగన్మోహనరెడ్డికి 1100 మంది పోలీసులతో రక్షణ ఇచ్చామన్నారు. హెలిపాడ్ వద్ద 250 మంది పోలీసులు బందోబస్తు కాశారని వివరించారు. వీఐపీని తీసుకెళ్లడానికి వీలుకాని హెలికాప్టర్ 15 నిమిషాల్లో ఎలా ఎగిరి వెళ్లిందని ప్రశ్నించారు. ప్లాన్ ప్రకారం ఇదంతా చేశారని అనిపిస్తోందని, వీటిన్నింటిపైన విచారణ జరిపిస్తామని హెచ్చరించారు.చీటికీ మాటికీ లా అండ్ ఆర్డర్ లేదు అంటున్నారని, గతంలో చంద్రబాబు బయటకి రాకుండా అడ్డుకున్నారని, ఎయిర్ పోర్టుల్లో గుండాలను పెట్టి అడ్డుకున్నారని గుర్తుచేశారు. పార్టీ కార్యాలయాల మీద దాడులు చేయించారు, ఇలాంటివన్నీ చేసిన జగన్మోహనరెడ్డి అన్న విషయం మరచిపోకూడదని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు. పులివెందుల ఎమ్మెల్యేగా జగన్ కు వన్ ప్లస్ వన్ సెక్యూరిటీ ఇవ్వాలని కానీ, మాజీ ముఖ్యమంత్రిగా జగన్ కు జడ్ ప్లస్ సెక్యూరిటీ సమకూర్చుతున్నామని హోంమంత్రి అనిత చెప్పుకొచ్చారు. పోలీసుల బట్టలు ఊడదీస్తామంటూ మాట్లాడే పద్ధతి సరైనదేనా? అని అనిత ప్రశ్నించారు. వైసీపీ హయాంలో 2526 హత్యలు జరిగాయని, అక్కడికి వెళ్తామన్నా కూడా తాము భద్రత కల్పిస్తామని చెప్పారు.ఎవరైనా పోలీసు డిపార్ట్మెంట్ మీద శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడినా, పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా వైఫల్యం ఆరోపణలపై హోం మంత్రిగా తాను చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్వయంగా మీటింగ్ పెట్టి.పార్టీ నిర్ణయాన్ని, ప్రభుత్వం నిర్ణయాన్ని గౌరవించాలని.. ఎవరు బయటకు రావద్దని పిలుపునిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా హోంమంత్రి అనిత గుర్తుచేశారు.

# అసెంబ్లీలో కొట్టుకున్న ఎమ్మెల్యేలు.. ఏం మెసేజ్ ఇస్తున్నట్టు



**జమ్మూకశ్మీర్ :**జమ్మూకశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీలో బుధవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. వక్ఫ్ బిల్లుపై చర్చ చేపట్టాలన్న డిమాండ్‌తో గత మూడు రోజులుగా వాయిదాల పర్వం కొనసాగుతున్న సభలో, కొందరు ఎమ్మెల్యేలు ఏకంగా కొట్టుకున్నారు. ఈ ఘటనతో స్పీకర్ సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాయిదా వేశారు.అసెంబ్లీ ప్రాంగణంలో ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఎమ్మెల్యే మెహరాజ్ మాలిక్, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) ఎమ్మెల్యే వహీద్ పారా మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదం కాస్తా ముదిరి ఇరు వర్గాల ఎమ్మెల్యేలు ఒకరిపై మరొకరు దూషణలకు దిగారు. ఈ ఘటన సభలో తీవ్ర గందరగోళానికి దారితీసింది.అయితే ఈరోజు ఒక్కనాడే కాకుండా గత రెండు రోజులుగా కూడా స్పీకర్ అబ్దుల్ రహీమ్ సభను వాయిదా వేస్తూ వస్తున్నారు. అధికార నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ (ఎన్‌సీ) సభ్యులు సభ ప్రారంభం కాగానే వెల్‌లోకి దూసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ బిల్లుపై చర్చ చేపట్టాలని నినాదాలు చేస్తున్నారు. దీనికి ప్రతిగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ)కి చెందిన ప్రతిపక్ష నేత సునీల్ శర్మ కూడా స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి ఎన్‌సీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరికొందరు ఎమ్మెల్యేలు కూడా తమ నిరసన వ్యక్తం చేయడంతో సభలో తీవ్రమైన ప్రతిష్టంభన నెలకొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే స్పీకర్ హౌజ్‌ను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.అసెంబ్లీలో ఎమ్మెల్యేలు కొట్టుకోవడం అనేది అత్యంత బాధాకరమైన విషయం. ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కారాలు కనుగొనాల్సిన శాసనసభలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం ప్రజాస్వామ్యానికే అవమానకరం. తమ సమస్యలను చెప్పుకోవడానికి ఎన్నుకున్న ప్రజాప్రతినిధులే ఇలా ప్రవర్తిస్తే, ప్రజలకు ఎలాంటి సందేశం వెళ్తుంది?ఈ ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. వక్ఫ్ బిల్లుపై చర్చ జరపాలని ఎన్‌సీ పట్టుబట్టడానికి కారణాలేంటి? బీజేపీ ఎందుకు వ్యతిరేకిస్తోంది? ఆమ్ ఆద్మీ పార్టీ, పీడీపీ ఎమ్మెల్యేల మధ్య ఘర్షణ ఎందుకు జరిగింది? ఈ రాజకీయ పార్టీల మధ్య సమన్వయం లోపించిందా? లేక వ్యక్తిగత విభేదాలే ఈ స్థాయికి చేరాయా? అని ఎమ్మెల్యేలంతా నిలదీసిన పరిస్థితి నెలకొంది.అసెంబ్లీలో చోటు చేసుకున్న ఈ ఘటన రాజకీయ నాయకులు తమ బాధ్యతను విస్మరిస్తున్నారనే సంకేతాలను ఇస్తోంది. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన వారే ఇలాంటి చర్యలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరం. ఇకనైనా ఎమ్మెల్యేలు సంయమనం పాటించి, సభలో నిర్మాణాత్మకమైన చర్చలు జరిపి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని ఆశిద్దాం. లేదంటే, ఇలాంటి ఘటనలు రాజకీయ వ్యవస్థపై ప్రజలకున్న నమ్మకాన్ని మరింత దిగజార్చే ప్రమాదం ఉంది.

# పిఠాపురం వర్మ కొత్త డిమాండ్... బాబుని ఇరకాటంలో పెట్టేలా



**పిఠాపురం :**తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎపుడు ఏమి చేయాలో తెలుసు. ఆయన పార్టీ పరంగా కానీ ప్రభుత్వ పరంగా కానీ నిర్ణయాలను ఎంతో ఆలోచించి తీసుకుంటారు. బాబుకు సలహాలు ఇచ్చే పని ఎవరు చేసినా అది తప్పే అవుతుంది. పైగా టీడీపీ వంటి క్రమశిక్షణ కలిగిన పార్టీలో అలాంటివి కుదరవు. ఇదిలా ఉంటే పిఠాపురం వర్మ అటు తిరిగి ఇటు తిరిగి ఒక కొత్త డిమాండ్ ని అందుకున్నారు.లోకేష్ కి టీడీపీ సారధిగా నియమించాలని ఆయన కోరుతున్నారు. అంటే బాబు టీడీపీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకుని తనయుడికి బాధ్యతలు అప్పగించడం అన్న మాట. నిజానికి చూస్తే తెలుగుదేశం పార్టీలో జాతీయ కార్యదర్శిగా ఉన్నా లోకేష్ నే మొత్తం పర్యవేక్షణ చేస్తున్నారు అన్నది ప్రచారంలో ఉంది. అంతే కాదు లోకేష్ పలుకుబడి పార్టీలో చాలానే పెరిగింది అని అంటున్నారు.ఈ నేపథ్యంలో లోకేష్ కి ఆ పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఎపుడు ఇవ్వాలన్నది చంద్రబాబుకు తెలియనిది కాదు అని అంటున్నారు. అయితే పిఠాపురం వర్మ సడెన్ గా లోకేష్ ని పార్టీ సారధిగా చేయాలని డిమాండ్ చేశారు. ఆయన యువగళం పాదయాత్ర చేయడం వల్లనే ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిందని చెప్పారు.టీడీపీకి నారా లోకేష్ నాయకత్వం అవసరం అని కూడా వర్మ గట్టిగా చెబుతున్నారు లోకేష్ నాయకత్వంలో టీడీపీ మరిన్ని విజయాలు సాధిస్తుందని కూడా ఆయన నమ్మకంగా చెబుతున్నారు. టీడీపీకి భవిష్యత్తు నాయకులు ఉండాలని వర్మ కోరారు. 2047 అన్నది ఏపీ ప్రగతికి మాత్రమే కాకుండా తెలుగుదేశం పార్టీకి కూడా ఉండాలని ఆయన కోరుతున్నారులోకేష్ భావి తరాలకు నాయకుడని ఆయన వల్ల యువత టీడీపీ వైపు పెద్ద ఎత్తున టర్న్ అయింది అని అన్నారు. అంతే కాదు అన్ని వర్గాల ప్రజలూ టీడీపీ వైపు చూసేలా లోకేష్ నాయకత్వం ఉందని చెప్పారు. మొత్తానికి వర్మ డిమాండ్ ఏంటి అంటే అర్జెంటుగా లోకేష్ కి పార్టీ పగ్గాలు ఇవ్వాలని.ఇక పిఠాపురంలో చూస్తే వర్మ వర్సెస్ జనసేనగా రాజకీయం సాగుతోంది. ఆయనకు ఎమ్మెల్సీ పదవి కూడా దక్కలేదు. ఇటీవల ఎమ్మెల్సీ జనసేన నేత నాగబాబు పర్యటన కూడా రచ్చగా సాగింది. ఈ సమయంలో ఉన్నట్లుండి వర్మ లోకేష్ నినాదాన్ని అందుకోవడం వెనక ఏమై ఉంటుంది అంతా చర్చిస్తున్నారు.గతంలో ఇదే వర్మ లోకేష్ ని కాబోయే సీఎం గా పేర్కొంటూ డిమాండ్ చేశారు. దాని మీద కూడా తర్వాత చాలా మంది నాయకులు మాట్లాడడంతో అది రచ్చగా మారింది. చివరికి టీడీపీ అధినాయకత్వం కలుగచేసుకుని ఈ సమయంలో ఈ తరహా డిమాండ్లు వద్దని వారించింది దాంతో దానికి బ్రేక్ పడిపోయింది.అయితే ఇపుడు మరో రూట్ లో వర్మ వచ్చారని అంటున్నారు. టీడీపీ ప్రెసిడెంట్ లోకేష్ అని ఆయన కోరుతున్నారు. మిగిలిన వారు కూడా ఈ నినాదం అందుకుంటే కనుక బాబుకు ఇరకాటమే అని అంటున్నారు. అయితే ఇలాంటి డిమాండ్లతో వర్మ ఏమి సాధిస్తున్నారు అన్న చర్చ కూడా ఉంది.లోకేష్ అయితే తనకు మరింత పార్టీలో ప్రభుత్వంలో వెసులుబాటు దొరుకుతుందని ఆయన భావిస్తున్నారా అన్న చర్చ కూడా ఉంది. లోకేష్ టీం లో చేరడం ద్వారానే పిఠాపురంలో తన హవా నిలబెట్టుకోవడంతో పాటు జనసేనను తట్టుకుని నిలబడగలను అని ఆయన భావిస్తున్నారా అన్న చర్చ కూడా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో. మొత్తానికి వర్మ ప్రశాంతగా ఉన్న టీడీపీలో ఒక రాయి వేసి కెలికారు. దాని పర్యవసానాలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది.

# హైదరాబాద్ లోని ఏక్కడెక్కడ రిటెయిల్ స్పేస్ కు గిరాకీనో చెప్పిన రిపోర్టు



**హైదరాబాద్ :**ఇటీవల కాలంలో హైదరాబాద్ మహానగర మార్కెట్ అస్సలు బాగోలేదని.. రియల్ ఎస్టేట్ పడిపోయిందని.. దీంతో మిగిలిన వ్యాపారాలు సైతం డల్ గా ఉన్నట్లుగా అదే పనిగా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అలాంటి వాటికి చెక్ చెప్పేలా తాజాగా ఒక రిపోర్టు వెల్లడైంది. స్థిరాస్తి సేవల సంస్థ కుష్ మన్ అండ్ వేక్ ఫీల్డ్ వెల్లడించిన రిపోర్టు ప్రకారం దేశ వ్యాప్తంగా రిటెయిల్ లీజింగ్ లావాదేవీల్లో వృద్ధి కనిపిస్తోందని పేర్కొంది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో అద్దె లావాదేవీల వివరాల్ని వెల్లడించింది.అందులో హైదరాబాద్ కు సంబంధించి పేర్కొన్న వివరాలు ఆసక్తికరంగా మారాయి. దేశంలోని మొత్తం లీజింగ్ లావాదేవీల్లో హైదరాబాద్ వాటా 34 శాతంగా పేర్కొంది. చదరపు అడుగుల్లో చెప్పాల్సి వస్తే 8 లక్షల చదరపు అడుగులుగా పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా 8 ప్రధాన నగరాల్లో అద్దె లావాదేవీలు 55 శాతం పెరిగి 24.08 లక్షల చదరపు అడుగులకు చేరినట్లుగా రిపోర్టు వెల్లడించింది. మిగిలిన నగరాల్ని పక్కన పెట్టి హైదరాబాద్ విషయానికి వస్తే అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే 106 శాతం వృద్ధిని నమోదు చేసినట్లుగా పేర్కొనటం గమనార్హం.ఈ వృద్ధిలో ప్రధాన మార్గాల్లో 90 శాతం స్థలాలు అద్దెకు వెళ్లగా.. కొత్తపేట, నల్లగండ్ల, కొంపల్లి ప్రాంతాలు ఉన్నట్లుగా పేర్కొంది. మొత్తం లావాదేవీల్లో 24 శాతం వాటాతో జూబ్లీహిల్స్ అగ్రస్థానంలో ఉన్నట్లుగా తెలిపింది. ఫ్యాషన్.. ఆరోగ్య సంరక్షణ..ఆహారం పానీయాల విభాగాల్లో అత్యధిక డిమాండ్ ఉన్నట్లుగా పేర్కొంది.లీజింగ్ లావాదేవీల్లో 98 శాతం దేశీయ బ్రాండ్ లకు సంబంధించే ఉన్నాయని.. గిరాకీ పెరిగినప్పటికి షాపింగ్ మాల్స్ లో ఖాళీల రేటు మాత్రం 1.8 శాతంతో స్థిరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రేడ్ ఏ మాల్ సరఫరా పెద్దగా లేదని.. సాధారణ మాల్స్ లో ఖాళీలు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. గచ్చిబౌలి.. నానక్ రామ్ గూడ.. టోలిచౌకిలలో ఫ్లైఓవర్లు.. రోడ్ల విస్తరణ లాంటి ఇతర మౌలిక సదుపాయాల కారణంగా రిటెయిల్ ఎక్కువ అవుతోందని పేర్కొంది.

# మందుబాబులకు ఇక పండుగే ఆ బ్రాండ్లు ఎంట్రీ

**హైదరాబాద్ :**మద్యం ప్రియులకు పండుగ లాంటి వార్త. రెగ్యులర్ బ్రాండ్లతో పాటుగా కొత్త బ్రాండ్ల మద్యం అందుబాటులోకి రానుంది. తెలుగు రాష్ట్రాల్లో 2024-25 కాలానికి మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో జరిగాయి. ఈ ఏడాది అదే స్థాయిలో అమ్మకాలు పెంచుకునేందుకు ఎక్సైజ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా కొత్త బ్రాండ్లను మార్కెట్ లోకి తీసుకొస్తున్నారు. ఇందు కోసం మద్యం కంపెనీల నుంచి దరఖాస్తుల స్వీకరణ కు అనూహ్య స్పందన వచ్చింది. ఫలితంగా కొత్తగా 604 మద్యం బ్రాండ్లను తీసుకొచ్చేందుకు రంగం సిద్దం అవుతోంది. అందులో 273 విదేశీ మద్యం బ్రాండ్లు ఉన్నాయి.కొత్త మద్యం బ్రాండ్లుకొత్త మద్యం బ్రాండ్లు ఎంట్రీకి రంగం సిద్దమైంది. కొత్త బ్రాండ్ల మద్యం సరఫరా కోసం కంపెనీలు పెద్ద ఎత్తున పోటీ పడుతున్నాయి. తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్ల కోసం తెలంగాణ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తయారీ, సరఫరాదారులను ఆహ్వానించింది. ఈ మేరకు ఫిబ్రవరి 24న నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తులకు మార్చి 15 తుదిగడువు వి?ధించినా ఏప్రిల్ 2వ తేదీ వరకు పొడిగించింది. నోటిఫికేషన్ కు అనూహ్య స్పందన కనిపించింది. రాష్ట్రంలో 604 రకాలైన కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల అనుమతి కోసం 92 మద్యం తయారీ, సరఫరా కంపెనీలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో విదేశీ బ్రాండ్లు 273 వరకు ఉండగా స్వదేశీ బ్రాండ్లు 331 ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో వివిధ రకాలైన మద్యం సరఫరా చేస్తున్న 45 పాత కంపెనీలు 218 కొత్త రకాల మద్యం బ్రాండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. రాష్ట్రంలో తొలిసారిగా కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాల కోసం 47 కొత్త కంపెనీలు 386 రకాల కొత్త మద్యం బ్రాండ్లు తెచ్చేందుకు దరఖాస్తు చేసుకున్నాయి.



రాష్ట్రంలో మద్యం అమ్మకాలతో 2023-24లో రూ. 34,800 కోట్లు, 2024-25లో రూ.34,600 కోట్ల ఆదాయం వచ్చింది. ఎక్సైజ్ శాఖ అధికారుల లెక్కల మేరకు గత ఆర్థిక సంవత్సరంలో కొత్త మద్యం దుకాణాలకు దరఖాస్తులు, లైసెన్సు ఫీజు కలిపి దాదాపు రూ.264 కోట్లు వచ్చాయి. గతంలో 548 లక్షల కాటన్లు, ఈ సారి 531లక్షల కాటన్ల బీర్ల అమ్మకాలు జరిగాయి. ఇక 362 లక్షల కేసులు మద్యం గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించగా ఈసారి 369 లక్షల కేసుల మద్యం విక్రయించారు. గతం కంటే 2 శాతం మద్యం విక్రయాల పెరిగాయి. ఆదాయం నిరుటి కంటే 7శాతం పెరిగింది. రాష్ట్రంలో 2025-26లో రూ.27,623.36 కోట్లు రాబట్టాలని ఎక్సైజ్‌శాఖ లక్ష్యంగా నిర్ణయించింది.

ఆర్థికంగా లక్ష్య సాధన కోసం ఎక్సైజ్ శాఖ ఇప్పటికే బీర్ల ధర పెంచడంతో పాటు కొత్తగా 25 బార్ల ఏర్పాటుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అలాగే కొత్త బ్రాండ్లకు అవకాశం కల్పించారు. ఇప్పటికే సరఫరా చేస్తున్న 32 దేశీయ కంపెనీలు 149 రకాలైన మద్యం సరఫరాకు దరఖాస్తు చేసుకోగా.. 13 విదేశీ కంపెనీలు 69 రకాల ఫారిన్‌లిక్కర్ బ్రాండ్ల సరఫరాకు దరఖాస్తు చేసుకున్నాయి. కొత్తగా 204 రకాల ఫారిన్ లిక్కర్ బ్రాండ్లకు దరఖాస్తులు రాగా.. 182 రకాల కొత్త మద్యం ఇండియన్ మేడ్ లిక్కర్ బ్రాండ్లు ఉన్నాయి. ఇక.. ఇప్పుడు ఎక్సైజ్ శాఖ వచ్చిన దరఖాస్తుల పరిశీలన.. అర్హతలను చూసిన తరువాత వీటికి ఆమోదం తెలిపే అవకాశం కనిపిస్తోంది. ఇదే సమయంలో ధరల విషయంలోనూ ఆచి తూచి నిర్ణయం తీసుకుంటున్నారు.

# తిరుమల, శ్రీకాళహస్తి భక్తుల కోసం కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం



**తిరుపతి:**కేంద్ర మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. మూడో సారి అధికారం లోకి వచ్చిన తరువాత మోదీ ప్రభుత్వం ఏపీకి సంబంధించి పలు ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. తాజాగా జరిగిన మంత్రివర్గ భేటీలో సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్న తిరుపతి - కాట్పాడి లైన్ డబ్లింగ్ కు ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా తిరుపతి, శ్రీ కాళహస్తికి వచ్చే ప్రయాణీకులతో పాటుగా విద్య, వైద్య సంస్థలు ఎక్కువగా ఉండటంతో ఈ ప్రాంతానికి లబ్ది కలగనుంది.కేంద్రం మంత్రివర్గ భేటీలో తిరుపతి నుంచి కాట్పాడి వరకు రూ.1,332 కోట్లతో డబ్లింగ్ పనులకు ఆమోదం లభించింది. ఇందుకు సంబంధించిన వివరాలను కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి కోట క్షేత్రాలకు లక్షల్లో భక్తులు తరలి వస్తారని చెప్పారు. తిరుపతి, వెల్లూరు ప్రాంతాలు వైద్య, విద్య హబ్‌లుగా ఉన్నా యని అన్నారు. దీనితో రాయలసీమ రీజియన్‌కు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. అదే విధం గా ఎలక్ట్రానిక్స్, సిమెంట్, స్టీల్ తయారీ కంపెనీలకు కూడా లబ్ధి పొందుతాయని అశ్వినీ వైష్ణవ్ వివరించారు.గా ఆమోదం పొందిన ఈ ప్రాజెక్టు ద్వారా చిత్తూరు, తిరుపతి, వెల్లూరు జిల్లాకు లబ్ధి చేకూరు తుందని అశ్వినీ వైష్ణవ్ చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్టులో 17 మేజర్, 327 మైనర్ వంతెనలు వస్తున్నాయని చెప్పారు. అదేవిధంగా 7 పైవంతెనలు, 30 అండర్ పాస్ బ్రిడ్జులు రానున్నట్లు తెలిపారు. 104 కి.మీ మార్గం రోడ్డుకు బదులు రైలు మార్గానికి రద్దీ మళ్లుతుందని వివరించారు. తద్వారా 20 కోట్ల కిలోల కార్బన్‌డయాక్సైడ్ తగ్గుతుందని తెలిపారు.

అదేవిధంగా 4 కోట్ల లీటర్ల డీజిల్ పొదుపు అవుతుందని వెల్లడించారు. ఇప్పటికే సర్వే రిపోర్టులు పూర్తి కావటం..ఇక, ఇప్పుడు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర పడటంతో త్వరలోనే డబ్లింగ్ కు సంబంధించిన ప్రక్రియ మొదలు పెట్టే అవకాశం కనిపిస్తోంది.

# వైసీపీ క్యాడర్ నాశనం చేయటమే వారి లక్ష్యం

**అమరావతి :కడప:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతుంది. మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా సోదరుడు అహ్మద్ బాషాను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని వైసీపీ నేతలు ఏపీ ప్రభుత్వ తీరు పైన తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తాజాగా మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా ను పరామర్శించిన అవినాష్ రెడ్డి కూటమి ప్రభుత్వం రాక్షసానందం పొందుతుందని మండిపడ్డారు.కూటమి ప్రభుత్వంపై ఎంపీ అవినాష్ రెడ్డి ఆగ్రహంవైసిపి క్యాడర్ ను నాశనం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ఏపీ అధికారులు పనిచేస్తున్నారని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెట్టి వైసిపి నేతలను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. కానీ అన్ని గుర్తు పెట్టుకుం టామని మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా చెల్లిస్తామని ఆయన పేర్కొన్నారు.మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషాను కడపలో పరామర్శించిన ఆయన ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం పైన విరుచుకుపడ్డారు. అక్రమ కేసులు పెడుతూ వేధింపులకు గురిచేస్తున్న ఎవరిని ఎట్టి పరిస్థితులలోను వదిలిపెట్టేది లేదని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.టీడీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారుతీవ్రవాది తరహాలో అహ్మద్ బాషాను ముంబైకి వెళ్లి తీసుకువచ్చారని ఆయన మండిపడ్డారు. అహ్మద్ బాషాను అరెస్ట్ చేసిన తర్వాత టిడిపి నేతలు సంబరాలు చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. తప్పుడు కేసులు పెట్టి అహ్మద్ ను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. టిడిపి నేతలు కడపలో కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు ఎంపీ అవినాష్ రెడ్డి.కాగా, కడపలో మాజీ డిప్యూటీ సీఎం సోదరుడు అహ్మద్ బాషా పై అవుట్ లుక్ నోటీసులు ఉన్న నేపథ్యంలో ఇటీవల ముంబై ఎయిర్పోర్ట్ లో ఇమిగ్రేషన్ అధికారులు ఆయనను అరెస్ట్ చేశారు. కువైట్ కి వెళుతున్న క్రమంలో అతనిని అడ్డుకొని అరెస్ట్ చేశారు. వినాయక నగర్ లోని ఒక స్థలం విషయంలో దాడి చేశారని కడప పోలీస్ స్టేషన్లో అతని పైన కేసు నమోదు కావడంతో కడప తరలించారు.



## అదృష్టం కలిసొచ్చినా.. పెళ్లి కార్డ్ కొంపముంచింది.. అసలు ఏంటా స్టోరీ



**గోరంట్ల :** ఇక్కడ ఇంకో పెద్ద విషయం ఏంటంటే ఇద్దరు అమ్మాయిలు సొంత అక్కాచెల్లెళ్లు కావడం. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక అబ్బా యికి.. ఒక అమ్మాయితో పెళ్లి సంబంధం కుదరడమే గగనం అయి పోతున్న తరుణంలో ఇద్దర్ని చేసుకోవడం హాట్ టాపిక్ అయ్యింది.శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం గుమ్మయ్య గారి పల్లికి చెందిన గంగరాజుకు కర్ణాటక రాష్ట్రం చిక్బల్లాపూర్ కు చెందిన ఇద్దరు యువతులతో నిశ్చితార్థం జరిగింది. ఈనెల 10వ తేదీన గోరంట్లలో పెళ్లికి ముహూర్తం కూడా ఫిక్స్ చేశారు. వారి వివాహానికి సంబంధించిన పెళ్లి కార్డు సైతం సోషల్ మీడియాలో గత కొన్ని రోజులుగా వైరల్ గా మారింది. ఇద్దరమ్మాయిలతో పెళ్లి, లక్కీ ఛాన్స్ కొట్టేశాడు అంటూ కామెంట్స్ కూడా చేశారు.పెళ్లి ఏర్పాట్లు చేయడం అన్నీ చక చక జరుగుతున్న తరుణంలో జరిగిపోతున్నాయి.. ఈ క్రమంలోనే వైరల్ గా మారిన పెళ్లి కార్డు పోలీసుల దృష్టికి రావడంతో వివరాలు సేకరించారు. దాంతో వధువులు ఇద్దరు అక్కాచెల్లెళ్లు అని.. అంతే కాకుండా వారు మైనర్లు అని పోలీసులు గుర్తించారు. దాంతో యువకుడిని, అతడి కుటుంబ సభ్యులను పిలిపించి పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చారు.మైనర్లను వివాహం చేసుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. దాంతో పెళ్లి కూడా క్యాన్సిల్ అవ్వడంతో ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## జగన్ పై రామగిరి ఎస్ఐ సుధాకర్ విమర్శల వెనుక కారణమిదే

**సత్యసాయి జిల్లా :** సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని పాపిరెడ్డి పల్లి లో దారుణ హత్యకు గురైన పార్టీ కార్యకర్త కురుబ లింగమయ్య కుటుంబాన్ని జగన్ పరామర్శించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన చంద్రబాబు పవన్ కళ్యాణ్ తో పాటు, కూటమి ప్రభుత్వ పాలన పైన, పోలీసుల వైఖరి పైన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చంద్రబాబు మెప్పు కోసం పోలీసులు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు.పోలీసులపై జగన్ తీవ్ర వ్యాఖ్యలకు రామగిరి ఎస్సై ఆగ్రహంపోలీసులు తమ టోపీల పై ఉన్న సింహాలకు సెల్యూట్ కొట్టకుండా చంద్రబాబు చెప్పినట్లు చేస్తున్నారని, తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అలాంటి పోలీసుల బట్టలూడదీసి ప్రజల ముందు దోషిగా నిలబెడతాం అంటూ వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఇక ఈ క్రమంలో జగన్ వ్యాఖ్యలకు రామగిరి ఎస్సై సుధాకర్ ఘాటుగా స్పందించారు.సెల్ఫీ వీడియో విడుదల చేసిన ఆయన పోలీసుల బట్టలూడదీసి కొడతాను అంటూ జగన్ హెచ్చరించడానికి తప్పుపట్టారు.ఖాకీ బట్టలు జగన్ ఇస్తే వేసుకునేవి కాదని కష్టపడి చదివి వేల మంది పోటీపడ్డ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి వేసుకునేవి అని ఆయన పేర్కొన్నారు. ఎవరో వచ్చి ఊడదీస్తా అంటే ఊడదీయటానికి అరటి తొక్క కాదని, తాము నిజాయితీగా ప్రజల పక్షాన నిలబడతామని, అడ్డదారులు తొక్కబోమని, జగన్ జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరిం చారు.జగన్ పై ఎస్ఐ చేసిన వ్యాఖ్యలకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కౌంటర్ఇక తాజాగా ఎస్ఐ జగన్ పై చేసిన వ్యాఖ్యలకు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఉద్దేశించి ఎస్సై చేసిన వ్యాఖ్యల పైన ఆయన మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మెప్పు కోసమే రామగిరి ఎస్సై సుధాకర్ యాదవ్ ఈ తరహా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత స్వార్థం కోసమే ఆయన పని చేస్తున్నారన్నారు.జగన్ ను విమర్శించే స్థాయి నీది కాదుఎస్ఐ సుధాకర్ యాదవ్ ఖాకీ షర్టును టిడిపికి తాకట్టు పెట్టాడని వ్యాఖ్యలు చేశారు. జగన్ ను విమర్శించే స్థాయి ఎస్సై సుధాకర్ యాదవ్ కు లేదని, ఆయన జగన్ పైన చేసిన వ్యాఖ్యలు సరికాదని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి వ్యాఖ్యానించారు. అసలు ఎస్ఐ సుధాకర్ సరిగా పని చేసి ఉంటే లింగమయ్య హత్య జరిగేదా చెప్పమని ఆయన ప్రశ్నించారు. సుధాకర్ వ్యవహార శైలి మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉందని పేర్కొన్నారు.పరిటాల సునీత కోసం పని చేస్తున్నాడుసుధాకర్ యాదవ్ ప్రోద్బలంతోనే టిడిపి నేతలు బరితెగిస్తున్నారు అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. రామగిరి లో వైఎస్ఆర్సిపి కార్యకర్త కురుబ లింగమయ్య హత్యకు ఎస్ఐ సుధాకర్ కారణమని ఆరోపించారు. అతను పరిటాల సునీతకు అనుగుణంగా పనిచేస్తున్నారని విమర్శించారు. గతంలో దళితులను కూడా ఆయన కించపరిచారని పేర్కొన్నారు. రాజకీయాల్లోకి రావడం కోసం ఎస్సై ఈ తరహా ప్రయత్నాలు చేస్తున్నాడని అనుమానం వ్యక్తం చేశారు.



## ఆన్‌లైన్ ప్రియుడి కోసం అమెరికా నుంచి ఏపీకి వచ్చిన యువతి.. చివరకు ఏం జరిగిందంటే

**అమెరికా:** ప్రస్తుత కాలంలో ప్రేమ పెళ్ళిళ్ళు ఎక్కువే జరుగుతున్నాయి. ప్రేమ కోసం దేశాలు దాటి మరీ వెళ్ళి పెళ్లి చేసుకుంటున్న ఘటనలను గమనించవచ్చు. పబ్జీ గేమ్‌లో మొదలైన పరిచయంతో.. మన దేశ యువకుడిని ప్రేమించి పాకిస్థాన్ నుంచి వచ్చేసిన సీమా హైదర్ కేసు వ్యవహారం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. ఇప్పుడు దేశమే కాదు ఏకంగా ఖండాలు దాటుకొని మరి ప్రేమించిన యువకుడి కోసం ఇండియాకి వచ్చేసింది ఓ యువతి.ఆన్‌లైన్ లవ్ స్టోరీ..చందన్.. ఏపీలోని ఒక పల్లెటూరుకు చెందిన యువకుడు. ప్రస్తుతం ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఇన్‌స్టాగ్రామ్‌లో చందన్ ప్రొఫైల్ చూసి అమెరికాకు చెందిన జాక్లిన్ ఫోరెరో అనే యువతి ప్రేమలో పడింది. ముందుగా ఆమె అతనికి హాయ్ అని మెసేజ్ చేసింది. అలా మొదలైన సంభాషణ.. 8 నెలల ఆన్‌లైన్ డేటింగ్ తర్వాత.. ఒక కొత్త అధ్యాయానికి



తెర లేపింది. చివరికి ఇద్దరు ఒకరిని విడిచి మరొకరు ఉండలేనంత గాడమైన ప్రేమను అనుభూతి చెందారు.దాంతో చందన్‌తో పెళ్లికి తన తల్లి అంగీకారం తీసుకుంది. జీవిత భాగస్వామి కోసం తన తల్లితో కలిసి భారత్‌కు వచ్చేసింది ఫోరెరో. వీరిద్దరి లవ్ జర్నీని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. త్వరలోనే ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం చందన్ వీసా కోసం ప్రయత్నిస్తున్నామని.. త్వరలోనే అమెరికాలో ఇద్దరం కొత్త జీవితాన్ని ప్రారంభిస్తామని ఫోరెరో చెబుతుంది.వీరిద్దరి లవ్ విషయం తెలిసిన వారంతా సోషల్ మీడియా వేదికగా అభినందిస్తూ కామెంట్స్ చేస్తున్నారు.

# 26/11 ముంబయి దాడుల బాధితులకు ఊరట..

## ఆ క్రిమినల్ ను భారత్ కు అప్పగించిన అమెరికా



**ముంబయి :** 2008లో దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన 26/11 ముంబయి ఉగ్రదాడుల కేసులో కీలక సూత్రధారి అయిన తహవూర్ రాణాను అమెరికా ఎట్టకేలకు భారత్‌కు అప్పగించింది. రాణా అమెరికాలో అందుబాటులో ఉన్న అన్ని చట్టపరమైన అవకా శాలను వినియోగించుకున్నప్పటికీ, అవి ఫలించకపో వడంతో ఈ చర్య తీసుకున్నారు. భారతీయ అధికారుల ప్రత్యేక బృందం రాణాను తీసుకుని ప్రత్యేక విమానంలో ఇండియాకు బయ లుదేరింది. ఈ విమానం ఈ రాత్రికి లేదా రేపు తెల్లవారుజామున భారత గడ్డపై దిగే అవకాశం ఉంది. ఈ పరిణామం 26/11 బాధితులకు.., యావత్ దేశానికి ఒక పెద్ద ఊరటని చ్చింది.తహవూర్ రాణా తనను భారత్‌కు అప్పగించవద్దంటూ చివరి ప్రయత్నంగా అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. భారత్‌లో తనను చిత్రహింసలకు గురిచేస్తారని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, తన అప్పగింతను అత్యవసరంగా నిలిపివే యాలని కోరాడు. అయితే, అమెరికా కోర్టు రాణా పిటిషన్‌ను పూర్తిగా తిరస్కరించింది. దీంతో అతడిని భారత్‌కు అప్పగిం చేందుకు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. వెంటనే భారత అధికారులు అమెరికాకు చేరుకుని అవసరమైన పత్రాలను సమర్పించి, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేశారు. అనంతరం అమెరికా అధికారులు రాణాను భారత అధికారులకు అప్పగించారు.ఈ పరిణామంపై భారత ప్రభుత్వం హర్షం వ్యక్తం చేసింది. దశాబ్దాలుగా సాగుతున్న న్యాయ పోరాటానికి ఇది ఒక ముఖ్యమైన విజయం అని పేర్కొంది. 26/11 దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఇది కొంతైనా సాంత్వన చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.– అమెరికా సహకారం: గతంలో ట్రంప్ ప్రకటనతహవూర్ రాణా అప్పగింత విషయంలో అమెరికా ప్రభుత్వం గత కొంతకాలంగా సానుకూలంగా స్పందిస్తోంది. గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న డొనాల్డ్ ట్రంప్ కూడా రాణా అప్పగింతపై స్పష్టమైన ప్రకటన చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా మాట్లాడుతూ.. ముంబయి దాడుల్లో నిందితుడైన అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిని భారత్‌కు అప్పగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ నెరవేరడం గమనార్హం.– తహవూర్ రాణా: 26/11 దాడుల్లో కీలక పాత్రపాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడైన తహవూర్ రాణా 26/11 ముంబయి దాడుల ప్రధాన సూత్రధారుల్లో ఒకడు. లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థతో అతడికి సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ముంబయిలో దాడులు చేయడానికి ముందు రెక్కీ నిర్వహించిన డేవిడ్ కోల్‌మన్ హెడ్లీకి రాణా సహకరించాడని ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం రాణా లాస్ ఏంజిల్స్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అతడిని తమకు అప్పగించాలని భారత్ చాలా కాలంగా ప్రయత్నిస్తోంది.– ఇండియా నిరంతర ప్రయత్నాలుతహవూర్ రాణాను భారత్‌కు అప్పగించాలని భారత ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రాణా తన అప్పగింతను సవాలు చేస్తూ పలు అమెరికా కోర్టులను ఆశ్రయించాడు. అయితే ప్రతిసారి అతడి ప్రయత్నాలు విఫలమయ్యాయి. చివరిగా అమెరికా సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ కూడా తిరస్కరణకు గురికావడంతో భారత్‌కు అతడిని అప్పగించే ప్రక్రియకు ఎట్టకేలకు శుభం కార్డు పడింది.– 26/11 ముంబయి దాడులు: దేశం మరవలేని విషాదం2008 నవంబర్ 26న ముంబయిలో జరిగిన ఉగ్రదాడులు దేశ చరిత్రలో ఒక చీకటి రోజు. లష్కరే తోయిబాకు చెందిన పది మంది ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారా ముంబయిలోకి ప్రవేశించి మూడు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో దాడులు చేశారు. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. ఛత్రపతి శివాజీ టెర్మినస్ రైల్వే స్టేషన్, తాజ్ మహల్ ప్యాలెస్ హొటల్, ఒబెరాయ్ ట్రైడెంట్ హొటల్, లియోపోల్డ్ కేఫ్, కామా హాస్పిటల్, నారిమన్ హౌస్ వంటి ప్రాంతాల్లో ఉగ్రవాదులు విధ్వంసం సృష్టించారు. ఈ దాడులు యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయి.తహవూర్ రాణా అప్పగింతతో 26/11 దాడుల కేసులో న్యాయం జరిగే దిశగా ఒక ముఖ్యమైన అడుగు పడింది. రాణా భారతదేశానికి చేరుకున్న తర్వాత, అతడిపై ఇక్కడ చట్ట ప్రకారం విచారణ జరుగుతుంది. ఈ పరిణామం భవిష్యత్తులో ఉగ్రవాదులకు ఒక బలమైన సందేశాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. నేరానికి పాల్పడిన వారు ఎక్కడున్నా తప్పించుకోలేరని ఇది నిరూపిస్తుంది. దశాబ్దాల నిరీక్షణ తర్వాత తహవూర్ రాణా భారత్‌కు రావడం 26/11 బాధితుల కుటుంబాలకు కలిగిస్తుందని ఆశిద్దాం.

# షాకింగ్.. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా తరఫున ఆ దేశ సైన్యం..

**రష్యా :** మూడు సంవత్సరాల రెండు నెలలు.. ఉక్రెయిన్ పై రష్యా యుద్ధం మొదలుపెట్టి.. ఈ టైమ్ లో ప్రపంచంలో ఎన్నో మార్పులు జరిగాయి. కానీ, ఈ యుద్ధం మాత్రం ఆగడం లేదు. కేవలం వారం రోజుల్లో ఉక్రెయిన్ ను ఓడిస్తామని రంగంలోకి దిగిన రష్యా ఇప్పటికీ కిందామీద అవుతోంది.కొన్నివేల మంది సైనికులను ఉక్రెయిన్ యుద్ధంలో పోగొట్టుకుంది రష్యా. లక్షల కోట్ల రూపాయిలను వ్యయం చేసింది. అయినా యుద్ధం ఇంకా ముగియరాలేదు. ఈలోగా డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కావడంతో పరిస్థితులు పూర్తిగా రష్యాకు అనుకూలంగా మారాయి.భారత్, ఉ.కొరియా...కాగా ఉక్రెయిన్ పై యుద్ధంలో తాము భారీగా సైనికులను నష్టపోవడం రష్యాకు తీవ్ర ఇబ్బందిగా మారింది. దీంతో ఇతర దేశాల నుంచి సైనికులను తీసుకుని యుద్ధ రంగంలోకి దింపుతోంది.భారత్ నుంచి ఉద్యోగాల పేరిట కొందరిని తీసుకెళ్లి యుద్ధంలో దింపడం.. వారు అక్కడ పనిచేయలేక తీవ్ర సంఘర్షణతో వీడియోలు పంపిన సంగతి తెలిసిందే. ఇదే సమయంలో రష్యా తరఫున ఉత్తర కొరియా సైనికులు కూడా పోరాడారు. తాజాగా మరో కీలక విషయం బయటకు వచ్చింది.ఉక్రెయిన్ పై రష్యా తరఫున



యుద్ధంలో చైనా సైనికులు కూడా పాల్గొంటున్నట్లు తేలింది. ఈ మేరకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఆరోపణలు చేశారు. తమ సైనికులు ఇద్దరు చైనా జాతీయలను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.డాన్ బాస్ లోని డొనెట్స్క్ ప్రాంతంలో రష్యా సైనికులతో తమ బలగాలు యుద్ధం చేస్తుండగా.. చైనీయులు పట్టుబడ్డట్లు పేర్కొన్నారు. చైనీయు తమవాళ్లు వీడియో తీశారని వెల్లడించారు. వారి పర్సనల్ డేటా, బ్యాంకు కార్డుతో సహా ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.పోరాడింది ఆరుగురు.. దొరికింది ఇద్దరు..డొనెట్స్క్ ప్రాంతంలో ఆరుగురు చైనీయులతో పోరాడామని, ఇద్దరు పట్టుబడ్డారని జెలెన్ స్కీ తెలిపారు. అంతేకాదు.. రష్యా సైన్యంలో చైనా వారు ఎందరు ఉన్నారో తమకు తెలుసని చెప్పారు. ఇదంతా చూస్తుంటే యుద్ధం మరింత కాలం కొనసాగించే ఉద్దేశం పుతిన్ లో ఉందని తెలుస్తోందన్నారు. శాంతిని కోరుకునే దేశాలన్నీ దీనిపై స్పందించాలని కోరారు.సొంతంగా వెళ్లారాభారతీయులు ఉద్యోగాల ఆశతో వెళ్లి రష్యా సైన్యంలో చిక్కుకున్నట్లే.. చైనావారూ యుద్ధ రంగంలో చిక్కుకున్నారని భావిస్తున్నట్లు ఉక్రెయిన్ భావిస్తోంది. దీనిపై చైనా స్పందించాని ఉక్రెయిన్ ప్రభుత్వం కోరుతోంది. తమ దేశీయులు ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న విషయమై చైనా స్పందించలేదు. కానీ, అమెరికా మాత్రం నోరు విప్పింది. తాము కలవరపాటుకు గురయ్యామని, రష్యాకు చైనా మద్దతు ఉన్న సంగతి తేలిపోయిందని పేర్కొంది.గతంలో ఇరాన్ యుద్ధంలో రష్యాకు సాయం చేసింది. బెలారస్ కూడా సైన్యాన్ని పంపింది. భారత్, ఉత్తర కొరియా, చైనా ప్రజలూ ఆ యుద్ధంలో పాల్గొన్నారని తేలింది.


# సిట్ విచారణకు కసిరెడ్డి.. ఏం అడుగుతారు ఏం చెబుతాడు



**అమరావతి :** వైసీపీ నేత, మాజీ సీఎం జగన్ బంధువు రాజ్ కసిరెడ్డిని లిక్కర్ స్కాంలో సిట్ విచారించనుంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఆయన బుధవారం ఎట్టి పరిస్థితుల్లోనూ సిట్ ఎదుట హాజరుకా వాల్సివుంది. దీంతో విచారణలో సిట్ ఏ ప్రశ్నలు అడగనుంది? రాజ్ కసిరెడ్డి ఏ సమాధానాలు చెబుతారనేది ఉత్కంఠ రేపుతోంది. గత ప్రభుత్వంలో లిక్కర్ పాలసీ ద్వారా సుమారు మూడు వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే పలువురు అధికారుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన సిట్ అధికారులు తొలిసారి ఓ వైసీపీ నేతను విచారించనున్నారు. దీంతో వైసీపీ శ్రేణుల్లో టెన్షన్ కనిపిస్తోందని అంటున్నారు.ఏపీ లిక్కర్ స్కాంలో బుధవారం కీలక పరిణామం జరగనుంది. ఈ కేసులో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ ఐటీ శాఖ మాజీ సలహాదారు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డిని సిట్ పోలీసులు విచారించనున్నారు. అయితే లిక్కర్ స్కాంలో కర్త, కర్మ, క్రియ అన్నీ రాజ్ కసిరెడ్డేనంటూ వైసీపీ మాజీ నేత వి.విజయసాయిరెడ్డి ఆరోపించినా, సిట్ అధికారులు మాత్రం ఆయనను సాక్షిగా విచారించేందుకు పిలిచారు. దీంతో రాజ్ కసిరెడ్డి విచారణలో ఏ ప్రశ్నలు వేస్తారు? అందుకు ఆయన ఎలాంటి సమాధానాలు చెబుతారనే ఆసక్తి పెరుగుతోంది.రాజ్ కసిరెడ్డిని విచారణకు రమ్మంటూ పోలీసులు మూడు నోటీసులు జారీ చేశారు. తొలి రెండు నోటీసులను లెక్కచేయని ఆయన తొలుత హైకోర్టును ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే రెండు చోట్లా ఆయనకు ఎదురుదెబ్బే తగలడంతో బుధవారం విచారణకు రావాల్సిన పరిస్థితి ఎదురైందని అంటున్నారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీ అధినేత జగన్ తో కలిసి పనిచేసిన రాజ్ కసిరెడ్డి, ఎన్నికల అనంతరం ఏపీ ఐటీ సలహాదారుగా నియమితులయ్యారు. అయితే ఆయన ఆ విధులు కన్నా, ప్రభుత్వ మద్యం కొనుగోలు, అమ్మకాలనే ఎక్కువ పర్యవే క్షించేవారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.మద్యం ఉత్పత్తి దా రుల నుంచి కమీషన్లు తీసుకోవడం, వాటిని వైసీపీ పెద్దలకు అం దజేయడంలో రాజ్ కసిరెడ్డి పాత్ర ఉందని పోలీసులకు విశ్వ సనీ య సమాచారం ఉందని చెబుతున్నారు. దీనికి మద్దతుగా వైసీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా రాజ్ కసిరెడ్డి మాత్రమే లిక్కర్ స్కాం కర్త, కర్మ, క్రియ అంటూ వ్యాఖ్యానించడం సం చల నం రేపింది. దీంతో ఈ రోజు విచారణ హైటెన్షన్ పుట్టిస్తోంది.

# మరో సంచలనం :పనామా కాలువను స్వాధీనానికి రెడీ అవుతున్న అమెరికా


**అమెరికా:** పనామా కాలువపై అమెరికా తన పట్టును తిరిగి సాధించేందుకు సిద్ధమవుతోందా? అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చేసిన తాజా వ్యాఖ్యలు ఈ దిశగా సూచనలు ఇస్తున్నాయి. పనామా కాలువను కచ్చితంగా స్వాధీనం చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అంతేకాకుండా, ఈ కీలకమైన జలమార్గంపై చైనా యొక్క పెరుగుతున్న ప్రభావాన్ని నిర్మూలించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.మధ్య అమెరికా పర్యటనలో ఉన్న హెగ్సెత్, పనామా అధ్యక్షుడు జోస్ రౌల్ ములినోతో రహస్యంగా సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సంచలన ప్రకటన చేశారు. "పనామా–అమెరికా కలిసి పనామా కాలువపై చైనా ప్రభావాన్ని తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. చైనా ఈ కాలువను నిర్మించలేదు, నిర్వహించదు. పనామా నాయకత్వంలోనే ఈ కాలువను సురక్షితంగా ఉంచుతాం. అన్ని దేశాలకు అందుబాటులో ఉండేలా చూస్తాం," అని హెగ్సెత్ అన్నారు.ఈ సందర్భంగా పనామా భద్రతా దళాలకు అమెరికా తన సైనిక సహకారాన్ని మరింతగా పెంచుతుందని హెగ్సెత్ తెలిపారు. చైనా నుండి పొంచి ఉన్న ముప్పును తమ ప్రభుత్వం పూర్తిగా అర్థం చేసుకుందని ఆయన అన్నారు. కాలువ యొక్క భద్రతా సమస్యలను పరిష్కరించడంలో పనామా తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రశంసించారు.ఇటీవల అమెరికా హాంగ్‌కాంగ్‌కు చెందిన ఒక సంస్థతో ఒక ముఖ్యమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో అమెరికా కూడా భాగస్వామిగా ఉంటుంది. దీని ద్వారా పనామా కాలువకు ఇరువైపులా ఉన్న ఓడరేవుల్లో ఒకదానిపై అమెరికాకు నియంత్రణ



లభిస్తుంది. అయితే, ఈ ఒప్పందాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. చారిత్రకంగా చూస్తే, పనామా కాలువను 1914లో అమెరికా నిర్మించింది. ఆ తరువాత, ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం 1999 డిసెంబర్‌లో దీనిని పనామాకు అప్పగించింది. అయితే, అమెరికా వాణిజ్య – నావికాదళ నౌకల నుండి పనామా అధిక మొత్తంలో రుసుము వసూలు చేస్తోందని అప్పటి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. ఈ రుసుములను తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే కాలువను తిరిగి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య కొంత వివాదానికి దారితీశాయి. ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసే సమయంలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారు.అయితే, పనామా అధ్యక్షుడు ములినో ట్రంప్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

# కేసీఆర్ ది సాగు భాష.. రేవంత్ రెడ్డిది చావు భాష





**- కేసీఆర్ తెలంగాణను నిలబెట్టిండు, రేవంత్ రెడ్డి తెలంగాణను పడగొట్టిండు - ఢిల్లీలో కూడా రేవంత్ రెడ్డి పని అయిపోయింది - రేవంత్ రెడ్డి పెట్టింది తప్పుడు కేసులని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పినట్టే కదా..- ఈనెల 27న బీఆర్ఎస్ పార్టీ వరంగల్ సభను విజయవంతం చేయండి - మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు**

**పటాన్ చెరు :** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ది సాగు భాష అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది చావు భాష అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు విమర్శించారు. బుధవారం భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్ రెడ్డి మొక్కులో భాగంగా ఆదర్శ్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ తరపున పటాన్ చెరు నియోజకవర్గం కో ఆర్డినేటర్ గా నియమించిన సందర్బంగా బీరంగూడ స్వగృహం నుండి రుద్రారం గణేష్ గడ్డ సిద్ధి గణపతి దేవాలయం వరకు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు, సింధు ఆదర్శ్ రెడ్డిలతో కలిసి సిద్ధి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదల స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ... ఈరోజు రాష్ట్రమంతా కేసీఆర్ వైపు చూస్తున్నదని అన్నారు. ఏడాది పాలనలో ప్రజలకు పాలేవో నీళ్ళేవో అర్థం అయిపోయిందని చెప్పారు. రేవంత్ రెడ్డివి మాటలు తప్ప చేతలు లేవు అన్నది ప్రజలకు అర్థమయిపోయిందని అన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అయినా నెరవేర్చారా అని ప్రశ్నించారు. మేము వస్తే ఫార్మాసిటీ భూములన్ని రైతులకు వాపసిస్తామని అన్నారు. ఇప్పుడేమో 16 వేల ఎకరాలు ఫార్మా సిటీ కోసం స్వీకరిస్తామని ప్రకటించారని తెలిపారు. జీవో 58, 59 కింద ఇదే పటాన్ చెరు నియోజకవర్గంలో వేల మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. రేవంత్ రెడ్డి వచ్చినాక 58, 59 జీవో బందు పెట్టిండు, పైసలు కట్టినోళ్లకు కూడా పట్టాలు ఇవ్వడం లేదని అన్నారు. రుణమాఫీ అసలు ఇయ్యాల్సింది 49 వేల కోట్లు, అసెంబ్లీలో చెప్పింది 31 వేల కోట్లు, ఇచ్చింది 15, 16 వేల కోట్లు కూడా లేదన్నారు. వానకాలం యాసంగికి ఎగ్గొట్టిన రైతుబంధు డబ్బులు 14,000 కోట్లు రుణమాఫీకి పెట్టిండని అన్నారు. 50% రుణమాఫీ కూడా కాలేదు, రైతుబంధు రాలే, 4000 పెన్షన్ రాలే, అక్కచెల్లెళ్లకు మహాలక్ష్మి పెన్షన్ రాలేదన్నారు. కేసీఆర్ ఎన్నికల హామీ ఇవ్వకపోయినా 13 లక్షల పేదింటి ఆడపిల్లల కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించారని తెలిపారు. కేసీఆర్ ఉన్నప్పుడు దేశ జీఎస్టి వృద్ధి రేటు కంటే ఎప్పుడూ ఎక్కువగానే ఉన్నాం తప్ప తక్కువగా లేమన్నారు. కేసీఆర్ చెట్లు పెడితే రేవంత్ రెడ్డి వాటిని నరుకుతున్నాడని అన్నారు. మొన్న అగ్రికల్చర్ యూనివర్సిటీలో 100 ఎకరాల భూమి తీసుకొని అక్కడ చెట్లని నరికేసిండు, నిన్న హెచ్ సీయు భూముల్లో 400 ఎకరాల అడవుల్లోనూ నరికి మూగజీవుల పాపం కట్టుకున్నాడు. ఏం పాపం చేశాయని మూగజీవాల ఉసురు పోసుకుంటున్నావు రేవంత్ రెడ్డి అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కులగొడుతున్నారని, ఒక చిన్న పిల్ల వాళ్ళ నాన్న కొనిచ్చిన వాటర్ బాటిల్ తీసుకొని వస్తాను అన్నా వినకుండా ఇల్లును కూలగొట్టారని చెప్పారు. రేవంత్ రెడ్డి మాట్లాడితే పేగులు మెడలో వేసుకుంటా, తొక్కుతా, చంపుతా, తొడలదర కొడతా ఇలాంటి భాష రేవంత్ రెడ్డిది అన్నారు. ఢిల్లీలో కూడా రేవంత్ రెడ్డి పని అయిపోయిందని అన్నారు. ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్ రెడ్డి కేసులు పెడితే ఉపముఖ్యమంత్రి కేసులు ఉపసంహరించుకుంటాడు అంట, ఇదేమి రాజ్యం, తోక కుక్క నాడిస్తున్నదా, కుక్క తోక నాడిస్తున్నదా అర్థం కావడం లేదన్నారు. హైడ్రా హైడ్రా అని ఆర్నెల్లు ఉరికిండు, ఎల్లంకలపడ్డాడు అన్నారు. పటాన్ చెరు ఇండస్ట్రియల్ ఏరియాలో వారానికి రెండు రోజులు పవర్ హాలిడే ఇచ్చేదాన్ని, కేసీఆర్ వచ్చాక పవర్ హాలిడేలు ఎత్తేసి 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చామన్నారు. దేశానికి నెంబర్ వన్ గా తెలంగాణ తీర్చిదిద్దింది కేసీఆర్ అన్నారు. మళ్ళీ బీఆర్ఎస్ రావాలి కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పార్టీ కొరకు కష్టపడిన నాయకులకు తగిన గుర్తింపు, గౌరవం లభించే విధంగా ఆ బాధ్యత నేను తీసుకుంటాను, కష్టపడ్డ ప్రతి కార్యకర్తను పార్టీ కాపాడుకుంటుందని తెలిపారు. ఏప్రిల్ 27 వరంగల్ మీటింగ్ ను విజయవంతం చేయాలని, పటాన్ చెరు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు కదిలి రావాలని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కొరకు నియోజకవర్గంలోని సీనియర్ నాయకులు అందరూ కలిసి పని చేయాలని మాజీ మంత్రి సూచించారు. ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో పటాన్ చెరు నియోజకవర్గం కోఆర్డినేటర్ గా నియమించినందుకుగాను కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పార్టీ అభివృద్ధి కొరకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకులు మధుసూదన చారి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెన్నవరం రాజేశ్వర్ రెడ్డి, మల్లేపల్లి సోమిరెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకటేశం గౌడ్, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, జగన్నాథ్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హావేలి ఘనపూర్ మండలములో చిరుత పులి సంచారం





**మెదక్ ఏప్రిల్ 9** హావేలి ఘనపూర్ మండలంలోని బ్యాతుల్ తిమ్మాయిపల్లి గ్రామ మధ్యలో గుట్టు క్రింద వున్న బుధవారం వేకువజామున పశు వులకొట్టుములో వున్న లేగదూడపై దాడి చేసింది. పశువుల కొట్టం రాజయ్యదీని ఫారెస్ట్ బిట్ ఆఫీసర్ సయ్యద్ అసుర్క్ మీడియాకు తెలిపారు. రెండు గ్రామాలలో చిరుత సంచరి స్తున్నట్లు గమనించమని చెప్పారు పశువుల గొర్ల మేకల కాపరులు అప్రమత్తంగా ఉం డాల ని సూచించారు. గ్రామస్తులు గుంపులు గుంపు లుగా ఉండాలని చెప్పారు వ్యవసాయ పనులకు గుంపులుగా వెళ్లాలని చెప్పారు. ఫారెస్ట్ లోసీసీ కెమెరాలని ఘావుందనితెలియజేశారు.

## జిల్లా కేంద్ర ములో అన్ని సదుపాయాలతో ప్రవేట్ హాస్పిటల్స్ ఏర్పాటు కావడం శుభ సూచకమని ప్రజల ఆరోగ్యంపై ప్రవేట్ హాస్పిటల్స్ మెరుగైన చికిత్స ఇవ్వాలని మెదక్ ఎమ్మెల్యేమైనంపల్లి రోహిత్ అన్నారు.




**మెదక్ ఏప్రిల్ 9** బుధవారం రోజున మెదక్ పట్టణ ములోని నూతన శ్రీ బాలాజీ హాస్పిటల్ రిబ్బన్ కాట్ చేసి ప్రారంభించరు. డాక్టర్ కిరణ్ ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన ల్యాబ్ ను కూడా ఎమ్మెల్యే రోహిత్ రావు అడిషనల్ కలెక్టర్ నగేష్ ప్రారంభించరు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు పార్టీ నాయకులు కిసాన్ సెల్ అధ్యక్షుడు పబ్బతి ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు మెడి మధుసూదన్ రావు దుర్గ ప్రసాద్ గోవింద్ నాయక్ మాజీ జడ్పీటీసీ సభ్యులు మల్లప్ప దుర్గా గౌడ్ పలువురు రాజకీయ నేతలు హాస్పిటల్ యాజమాన్యం తో సిబ్బంది పాల్గొన్నారు.

## బూరుగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రేషన్ దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ



**మెదక్ జిల్లా :** హవేలీ ఘనపూర్ మండలం ఏప్రిల్ 9 మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి బూరుగుపల్లి గ్రామంలో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు లక్కర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజానీకానికి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమానికి ప్రజలు మద్దతు తెలుపు తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే అభివృద్ధి అని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల సిద్ధగిరి గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు మరికల్ వెంకటి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిట్యాల శ్రీనివాస్, సిద్ధగిరి గౌడ్, శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ రాములు, వెంకట రాములు, కప్పల భాస్కర్, కృష్ణ, అరవింద్, టిల్లు, కిష్టయ్య, రాజరత్నం, భూపతి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ 27వ తేదీన వరంగల్

**ఎల్కతుర్తి వద్ద జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు**



**మెదక్ ఏప్రిల్ 9 :** మెదక్ జిల్లా కేంద్రంలోని బిఆర్ ఎస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో యం. పద్మ దేవేందర్ రెడ్డి మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల. మల్లికార్జున్ గౌడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకిరెడ్డి.కృష్ణారెడ్డి పట్టణ కన్వీనర్ తాజా మాజీ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, నాయకులతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2001 సంవత్సరంలో గులాబీ పార్టీ జెండా పట్టి 14 సంవత్సరాలు పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించి తెలంగాణలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దక్కుతుందన్నారు. ఏప్రిల్ 27వ తేదీన ప్రతి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి వరంగల్ భారీ బహిరంగ సభకు పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు బయలుదేరాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్లో జరిగే భారీ బహిరంగ సభకు పార్టీ తరపున వాహనాలు ఏర్పాటు చేస్తామన్న కార్యకర్తలు వద్దన్నారని వారే స్వయంగా తామే వాహనాలు ఏర్పాటు చేసుకొని వరంగల్‌బి ఎల్కతుర్తి లో జరిగే బహిరంగ సభకు హాజరు అవుతామని కార్యకర్తలు చెప్తా ఉన్నారని తెలిపారు. వరంగల్ ఎలుకతుర్తి లో జరిగే భారీ బహిరంగ సభ విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ తాజా మాజీ ఉపాధ్యక్షురాలు ఎం లావణ్య రెడ్డి , మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షులు యం. అంజ గౌడ్,పట్టణ కన్వీనర్ మామిళ్ళ ఆంజనేయులు, మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ జయరాజ్, పట్టణ కొ కన్వీనర్ జుబేర్ అహ్మద్,మెదక్ పిఏసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, నాయకులు కిష్టయ్య, మేకల సాయిలు, నిజ్జని. లింగం,చెన్న గౌడ్, శ్రీహరి,రామచంద్ర రెడ్డి, సతీష్ రావు, సాప. సాయిలు,యాదగిరి, సుబ్బారావు,శ్రీనివాస్,రాజు,రంజిత్ చంద్ పాషా, లడ్డు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# దేశీయంగా సంస్కరణలకు ఇదే సమయం

**ట్రంప్-చైనా సుంకాల నేపత్యంలోజాగ్రత్తగా ఉండాలి**
**పెట్టుబడులు ఆకర్శంచేలా వ్యవహరించాలి**
**మాజీ ఆర్‌బిఐ గవర్నర్ రఘురామ రాజన్**

**న్యూఢిల్లీ,ఏప్రిల్9:** ప్రస్తుతం అమెరికా-చైనా మధ్య తీవ్రస్థాయిలో జరుగుతున్న వాణిజ్యయుద్ధం భారత్‌కు మంచి అవకాశాలు సృష్టిస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త, ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు తలపడినప్పుడు వాణిజ్యంలో కొంత అస్థిరత ఉంటుందని చెప్పారు. ఈ సమయంలో భారత్ సరైన నిర్ణయాలు తీసుకొంటే లబ్ధి పొందుతుందన్నారు. అయితే ట్రంప్ నిర్ణయాలతో అమెరికా సెల్ఫ్‌గోల్ చేసుకొందని రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. భారత్ చురుగ్గా వ్యవహరించి పెట్టుబడులు పెరిగేలా.. ఎగుమతులకు ప్రోత్సాహం లభించేలా అమెరికాతో వాణిజ్య చర్చలు జరపాలని అన్నారు. భారత్ ఇప్పుడు ఒక్క అమెరికాపైనే కాకుండా .. టారిఫ్‌ల విధానాన్నే పూర్తిగా సరళీకరించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. భారత్ ఇప్పుడు ఆర్థిక రక్షణాత్మక వైఖరి నుంచి దూరంగా జరిగి.. వాణిజ్య, పెట్టుబడుల వాతావరణాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉందని రాజన్ అభిప్రాయపడ్డారు. ఈ పరిస్థితులను అవకాశాలుగా భావించి భారత్ నిర్ణయం తీసుకోవాలన్నారు. పెట్టుబడులను ఆకర్షించేలా దేశీయంగా సంస్కరణలను చేపట్టాలని చెప్పారు. తూర్పు, ఉత్తర దేశాలతోపాటు- ఆర్సీఈపీ, ఆసియాన్ వంటి గ్రూపులు, చైనా, జపాన్ వంటి దేశాలతో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేసుకోవాలన్నారు. బీజింగ్‌తో న్యూదిల్లీ వాణిజ్య లోటు- ఉన్నా.. బ్యాలెన్స్‌గా వ్యవహరించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ట్రంప్ నిర్ణయాలు స్వల్పకాలానికి అమెరికాకు సెల్ఫ్‌గోల్‌లా పనిచేస్తాయని రాజన్ హెచ్చరించారు. ఆ దేశంలో నిరుద్యోగిత, ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టి.. ఫెడ్ వడ్డీరేట్లు- తగ్గించేందుకు సౌకర్యవంతంగా ఉన్న సమయంలో.. సొంత ఆర్థికవ్యవస్థనే ఆయన పట్టాలు తప్పిస్తున్నారన్నారు. అమెరికాకు ఎగుమతులు చేయడంపై ఆధారపడిన వియత్నాం వంటి దేశాలు ఈ నిర్ణయాలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాయని చెప్పారు. వీటితో పోలిస్తే భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం పరిమితిగా ఉంటుందని చెప్పారు. మన జీడీపీతో పోలిస్తే ఎగుమతులు తక్కువగా ఉండటమే ఇందుకు కారణమని రాజన్ అభిప్రాయపడ్డారు. మన వృద్ధిరేటు పైనా పెద్దగా ప్రతికూల ప్రభావం ఉండదన్నారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బను తప్పించుకోవడానికి చైనా నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకొన్న కంపెనీలకు భారత్ ఓ ఆకర్షణీయమైన ప్రదేశమని రాజన్ వెల్లడించారు. మనం సరైన నిర్ణయాలు తీసుకొంటే.. అమెరికా తక్కువ టారిఫ్‌లు విధించిన దేశాల్లో భారత్ ఉండటం, దేశీయంగా ఉన్న బలమైన మార్కెట్ వంటి భారీగా పెట్టు-బడులను తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించే నిర్ణయాలు తీసుకోవడంతోపాటు-.. పన్ను చట్టాలను మరింత సరళీకరించాలి.భారత్‌కు సేవారంగ ఎగుమతులకు మాత్రం టారిఫ్‌ల సెగ తాకలేదని చెప్పాలని రాజన్ వివరించారు. ఇటీ-వల కాలంలో దేశంలో సేవారంగ ఎగుమతులు తయారీ రంగాన్ని దాటేశాయన్నారు. ఇక అమెరికా టారిఫ్‌లు భారత్‌లో ద్రవ్యోల్బణ నియంత్రణకు కూడా ఉపయోగపడే అవకాశాలున్నాయని చెప్పారు. భారత ఎగుమతులు తూర్పు ఆసియా వంటి మార్కెట్ల వైపు చూస్తాయని.. అదే సమయంలో దేశీయ మార్కెట్లు- కూడా వాటిని ఆకర్షిస్తాయని చెప్పారు. ఇక చైనా ఉత్పత్తులకు అమెరికాలో ప్రవేశం కష్టం కావడంతో.. భారత్ వైపు మళ్లే అవకాశం ఉన్నట్లు- వెల్లడించారు. ఇక టారిఫ్‌లు ఇలానే కొనసాగితే మాత్రం ప్రపంచంలో ఆర్థిక మాంద్యం ఏర్పడే ప్రమాదం ఉందని రాజన్ అంచనా వేశారు.

# బెట్టింగ్ మరియు ఆన్లైన్ గేమింగ్ లకు అలవాటు పడి యువత ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

**బెట్టింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు**
**జిల్లా ఎస్పీడి. ఉదయ్ కుమార్ రెడ్డి**



**మెదక్ ఏప్రిల్ 9** జిల్లాలో ఎవరైన క్రికెట్, మరే ఇతర బెట్టింగ్‌లకు పాల్పడిన ప్రోత్సహించిన వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ డి. ఉదయ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఇటీవల కాలంగా రాష్ట్రంలో సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో యువత అధికంగా క్రికెట్ బెట్టింగ్ యాప్‌ల మోజులో పడి వారి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవడమే కాకుండా అప్పుల పాల్కె ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి సాధించడంతో ప్రతి ఒక్కరికి ఇంటర్‌నెట్ అందుబాటులోకి రావడంతో పాటు, సోషల్ మీడియా సైతం యువతకు మరింత చేరువ అయింది. తద్వారా మోసగాళ్ళ మోసపూరితమైన ప్రకటనలు, సందేశాలకు యువత ఆకర్షితుల్కె సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంగా ఆన్‌ల్కెన్ బెట్టింగ్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ పాటు, ఇతరత్రా బెట్టింగ్‌ల వైపు యువత తొంగిచూడమే కాకుండా ఇంటి సభ్యులకు తెలియకుండా వీటిల్లో పెట్టుబడులు పెట్టి ఆర్థికంగా పూర్తిగా నష్టపోవడంతో పాటు కొన్ని సందర్భాల్లో యువత బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ బెట్టింగ్ భూతాన్ని కట్టడి చేయాల్సిన బాధ్యత మనందరిపై వుందని. ముఖ్యంగా ప్రస్తుతం దేశంలో ఐపియల్ సిజన్ ప్రారంభం అయింది. ఇది దృష్టిలో వుంచుకోని తల్లిదండ్రులు సైతం తమ పిల్లలపై నిఘా పెట్టాలని, ముఖ్యంగా వారు క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారం అయ్యే సమయాల్లో వారి ప్రవర్తతో పాటు, వారు సెల్‌ఫోన్లలో మాట్లాడే సంభాషణపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని, పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని సూచించారు.జిల్లా పరిధిలో బెట్టింగ్‌లను కట్టడి చేసేందుకు గాను పెద్దఎత్తున చర్యలు చేపట్టడం జరిగిందని, ఇందుకోసం ప్రస్తుతం పోలీసులకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు, టాస్క్‌ఫోర్స్‌తో పాటు ఇతర ప్రత్యేక బృందాలను వినియోగించుకొవడం జరుగుతోందని తెలిపారు.జిల్లాలో ఎవరైన బెట్టింగ్‌లను పాల్పడిన, పోత్సహించిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని ఎవరైన బెట్టింగ్‌లకు పాల్పడినట్లుగా సమాచారం అందితే తక్షణమే స్థానిక పోలీసులకుగాని లేదా డయల్ 100కు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888 సమాచారం అందించాలని సూచించారు సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

## ట్రంప్ నిర్ణయాలతో మార్కెట్లపై ప్రభావం

**ట్రంప్ సుంకాలపై చైనా ఎదురుదాడి - ప్రతీకార సుంకాలతో బదులు తీర్చుకున్న డ్రాగన్**

**న్యూఢిల్లీ,ఏప్రిల్9:** అగ్రరాజ్యం అమెరికా, డ్రాగన్ దేశం చైనా మధ్య టారిఫ్ వార్ మరింత ముదిరింది. ఈ వ్యవహారం ఆసియా మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీంతో మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతున్నాయి. ట్రంప్ సుంకాల నిర్ణయంతో లక్షల కోట్లు మదుపురుల పెట్టబడి ఆవిరవుతోంది. దేశంలో వ్యతిరేకత వస్తున్నా..అనేక దేశాలు హెచ్చరిస్తున్నా ట్రంప్ మూర్ఖంగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ట్రంప్ బెరింపులను చైనా కూడా పట్టించుకోవడం లేదు. అమెరికా ఇటీవల ప్రతీకార సుంకాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సుంకాలపై చైనా గట్టిగానే బదులిచ్చింది. డ్రాగన్ దేశం సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించింది. అయితే, సుంకాలను వెనక్కి తీసుకోవాలని.. లేకపోతే మరింత సుంకాలను ప్రకటించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. చైనా వెనక్కి తగ్గకపోవడంతో ట్రంప్ అన్నంత పని చేశారు. చైనా వస్తువులపై భారీగా సుంకాలను ప్రకటించారు. తాజా సుంకాలతో 104శాతానికి సుంకాలు చేరాయి. కొత్తగా ప్రకటించిన సుంకాలు వెంటనే అమలులోకి వస్తాయని వైట్‌హౌస్ వెల్లడించింది. ఏప్రిల్ 2న అమెరికా చైనాపై 34శాతం సుంకాలను విధించింది. దీనికి స్పందనగా డ్రాగన్ దేశం సైతం అగ్రరాజ్యంపై 34శాతం సుంకాలు విధించింది. చైనా కొత్తగా ప్రకటించిన 34శాతం సుంకాలను ఉపసంహరించుకోకపోతే 50శాతం అదనంగా సుంకాలను ప్రకటిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఏప్రిల్ 9 నుంచి అమలులోకి వస్తాయని.. దాంతో పాటు చైనాతో అన్ని చర్చలు సైతం రద్దు చేస్తామని స్పష్టంచేశారు. దీనికి అమెరికా ప్రతీకార సుంకాలు ఏకపక్షమని.. రెచ్చగొట్టడమేనంటూ చైనా స్పందించింది. తాము సైతం ప్రతీకార సుంకాలను ప్రకటించామని.. భవిష్యత్‌లోనూ మరిన్ని సుంకాలు పెంచుతామని ఘాటు-గా బదులిచ్చింది. సార్వభౌమాధికారం, భద్రతా, అభివృద్ధి తదితర ప్రయోజనాలు కాపాడు కునేందుకు ప్రతీకార చర్యలు తీసుకుంటామని చైనా వాణిజ్యమంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 2న ట్రంప్ భారత్‌పై 26శాతం సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# రూ.4 లక్షల ఎల్ఓసి అంద జేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



**పటాన్ చెరు :** ఆపత్కాల సమయంలో నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన హంసమ్మ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నారు. మెరుగైన వైద్యం కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన 4 లక్షల రూపాయల విలువైన ఎల్ఓసినీ ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జీఎంఆర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

# సముద్ర తరంగాల అస్థిరతలపై అధ్యయనం

**- గీతం ఆతిథ్య ఉపన్యాసంలో పరిశోధనాంశాలను వెల్లడించిన బ్రిటన్ నిపుణుడు డాక్టర్ అనిర్బన్ గుహ**



**పటాన్ చెరు :** సముద్ర తరంగాల అస్థిరతలపై చేసిన పరిశోధన, అధ్యయనాం శాలను బ్రిటల్ డండీ విశ్వవిద్యాలయంలో పర్యావరణ ద్రవ మెకానిక్స్ లో సీనియర్ అధ్యా పకుడు డాక్టర్ అనిర్బన్ గుహ వెల్లడించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని గణిత శాస్త్ర విభా గం ఆధ్వర్యంలో 'సముద్ర తరంగాల అస్థిర తల'పై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. సముద్ర పొరలలో పదునైన సాంద్రత పొరలు, వాటి సుదూర అనువర్తనాల లోతైన అన్వేషణను సదస్యులతో పంచుకున్నారు. ప్రప ంచ సముద్ర నమూనాలను మెరుగుపరచడ ంలో, వాతావరణ అంచనాలను మెరుగుపరచ డంలో, జలాంతర్గామి నావిగేషన్, ఆఫ్ షోర్ నిర్మాణాల కోసం వేవ్ లోడింగ్ విశ్లేషణలో వాటి ఔచిత్యాన్ని ఆయన నొక్కి చెప్పారు. డాక్టర్ గుహ క్లాసికల్ లీనియర్ స్టెబిలిటీ సిద్ధాంతాన్ని విమర్శ నాత్మకంగా పరిశీలించారు. సాంప్రదాయ సాధ నాలు కొన్ని సందర్భాలలో ఎందుకు లోపభూయిష్టంగా ఉండవచ్చో ఆయన వివరించారు. ప్రవాహం ప్రారంభంలో కొన్ని పరిస్థితులలో స్థిరంగా కనిపించినప్పటికీ, అది ఘాతాంక పెరుగుదల ద్వారా అస్థిరతలోకి మారగలదని డాక్టర్ గుహ పేర్కొన్నారు. అయితే దీనిని ఇప్పుడు మెరుగైన ఖచ్చితత్వంతో అంచనా వేయవచ్చన్నారు. తరంగ-ఆధారిత అస్థిరతలు ఎక్కువగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న క్లిష్టమైన పొడవు ప్రమాణాలను గుర్తించడంలో ఆయన పరిశోధన కొత్త అంతర్దృష్టులను అందిస్తోంది. తొలుత, ప్రొఫెసర్ బి.ఎం.నాయుడు అతిథిని స్వాగతించి, సదస్యులకు పరిచయం చేశారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, ఇతర అధ్యాపకులతో కలిసి డాక్టర్ గుహను దుశ్శాలువ, సత్కరించారు. కాగా, ఈ అతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని డాక్టర్ లిమా బిశ్వాస్, డాక్టర్ వి.కామేశ్వర శ్రీధర్ సమన్వయం చేశారు. ఈ ఉపన్యాసం అధ్యాపకులను ద్రవ డైనమిక్స్, పర్యావరణ శాస్త్రంలోఅత్యాధునికపరిశోధనలకుపురిగొలిపింది.

# ఏకాత్మత మానవతావాదం, అంత్యోదయ స్ఫూర్తితో బిజెపి కొనసాగుతుంది.


**దేశ హితం కోసం పనిచేసే ఏకైక పార్టీ బిజెపి.**

**జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల పల్లి శ్రీనివాస్ గౌడ్.**



**కరీంనగర్** ఏకాత్మత మానవత వాదం, అంత్యోదయ స్ఫూర్తితో బిజెపి కొనసాగుతుందని, దేశంలో ఏ పార్టీకి లేని విధానం, సిద్ధాంతం బిజెపికే ఉన్నాయని, ఆ పార్టీ అనుసరించిన విధానాలు మార్గాలతోనే ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన నెంబర్ వన్ పార్టీగా భారతీయ జనతా పార్టీ అవతరించిందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం రోజున గంగాధర బిజెపి క్రియాశీలక సభ్యుల సమావేశం మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ హితం కోసం పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనన్నారు. ఏకాత్మత మానవతావాదం , అంత్యోదయ భావనతో ప్రేరణ పొందిన బిజెపి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో వివిధ రాష్ట్రాల్లోని సంకీర్ణ ప్రభుత్వాలతో కలిసి అంత్యోదయ మార్గంలో నిరంతరం ముందు కొనసాగుతుందన్నారు. చిట్ట చివరి పేదల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా అంత్యోదయ విధానం తో ఏకత్మత మానవతావాదం ఆచరణగా , జాతీయ వాదమే సిద్ధాంతంగా కొనసాగుతున్న ఏకైక పార్టీ బిజెపి యే అన్నారు. 44 ఏళ్ల కటోర సినిమా పోరాటం త్యాగాలతో పార్టీ స్థాయికి ఎదిగిందని, ఈ స్థాయికి పార్టీని తీసుకురావడానికి ఎంతోమంది మహానుభావులు విశేష కృషి చేశారని, వారు పార్టీకి చేసిన సేవలు మరువలేనివన్నారు. సబ్ కా సాత్ , సబ్ కా వికాస్ ధ్యేయంగా పనిచేస్తున్న మోడీ ప్రభుత్వ పాలనపై దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరికీ ఎంతో విశ్వాసం ఉందని, అందుకే వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో బిజెపి ప్రభుత్వాలు , ఆరు రాష్ట్రాల్లో భాగస్వామ్య పక్షాలతో కలిపి (ఎన్ డి ఏ) ప్రభుత్వాలు కొనసాగుతున్నాయని ఆయన ఈ సందర్భంగా తెలిపారు... ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు కోల అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీపతి చంద్రశేఖర్, ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ సదల భాస్కర్, కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు సుద్దాల రవీందర్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ ఆకుల మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి రెండ్ల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు బొమ్మ కంట రాజిరెడ్డి, ఒడ్నాల రాజు, ఎస్సీ మోర్ష మండల అధ్యక్షులు తాళ్ల రాజశేఖర్, మండల అధికార ప్రతినిధి సరువు శ్రీనివాస్, దాసరి ఆంజనేయులు, రేగుల భార్గవ్, పెద్దపెల్లి కొమురయ్య, భయం మండల అధ్యక్షులు దెయ్యాల ప్రణయ్, ఉపాధ్యక్షులు అనిల్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, నరసింహారెడ్డి, కోళ్ల శ్రీనివాస్, విజయేందర్ రెడ్డి, కట్ల శ్రీను, మహేష్, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.....

# నిఫా, దుర్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్





**కరీంనగర్** సంవేదన టు అంతర్జాతీయ రక్తదాన మహోత్సవంలో భాగంగా నిఫా , దుర్గ యూత్ అసోసియేషన్ రేకుర్తి కరీంనగర్ వారి ఆధ్వర్యంలో బుధవారం రోజున కరీంనగర్ ప్రభుత్వ సివిల్ ఆసుపత్రిలో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ ను చేపట్టారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా నీఫా అధ్యక్షులు గోల్లెతిరుపతి , ఫౌండర్ ప్రెసిడెంట్ దుర్గా యూత్ అసోసియేషన్ నిర్వహణలో జరిగిన ఈ మెగా బ్లడ్ డొనేషన్ ప్రోగ్రామ్ కి రాష్ట్ర నిఫా అధ్యక్షులు కన్నవేణి యాదవ్ రాజు ముఖ్య అతిథిగా హాజరై రక్తదానంలో పాల్గొన్న 40 మంది యువకులను ప్రశంసించి, వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదాన శిబిరాల వల్ల ఆపదలు ఉన్నటువంటి వ్యక్తులను ఆదుకోవడానికి ఎంతో దోహదపడతాయన్నారు. యువత తమ వంతు సామాజిక బాధ్యతగా ఈ రక్తదాన శిబిరంలో స్వయంగా పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. నీఫా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గొల్లె తిరుపతి మాట్లాడుతూ నిస్వార్థంతో ఎప్పుడైతే యువత ముందుకు వచ్చి ఈ సమాజాన్ని ఆదుకోవాలని ఆలోచన చేస్తుందో అప్పుడు సమాజం ఎంతోబాగుపడుతుందన్నారు. సమాజానికి చేయతనివ్వడానికి యువత ఎప్పుడు ముందుండాలన్నారు. యువత సమాజానికి చేసే సేవ ఎప్పుడు వృధా కాదని , మంచి పనులు ఎప్పుడూ కూడా యువత చేయడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ఫ్రీడమ్ ఫైటర్స్ రాజ్ గురు, భగత్ సింగ్ ,సుఖదేవుల యొక్క ఆనాటి స్వాతంత్ర సంగ్రామ స్ఫూర్తిని త్యాగాలను యువత గుర్తుంచుకోవాలన్నారు.. నీఫా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కరీంనగర్ ఒకటవ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ ఈ సందర్భంగా యువతకు ప్రేరణ కల్పించే అంశాలపైవిలువైనసందేశాన్ని తెలియజేశారు. ఇట్టి మెగా బ్లడ్ డొనేషన్ పాల్గొన్నక్యాంపులో పాల్గొన్న యువతకు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ కన్వీనర్ వెంకటేశ్వరరావు ప్రభుత్వం తరపున అందించే సర్టిఫికెట్ ను ప్రధానం చేశారు. ఇట్టి ప్రోగ్రాంలో నిఫా, దుర్గ యూత్ అసోసియేషన్ అసోసియేషన్ ప్రతినిధులు గోల్లే రాజశేఖర్, గొల్లె అరుణ్, దుర్గా యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గడల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి దుర్గం శేఖర్,గోల్లె ప్రవీణ్ ,దుర్గం శ్యామ్ బండారి వంశీ ,ఎం కుమార్ఐలయ్య,యూత్సభ్యులు,ఎన్వైసీ వాలంటీర్లు పాల్గొన్నారు

# దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచాలి

## ప్రతీకార సుంకాలను అవకాశంగా తీసుకోవాలి

## దేశీయంగా వాడకం పెంచేలా చర్యలు చేపట్టాలి

**ఏలూరు,ఏప్రిల్9:** మన దేశ ఆక్వా ఎగుమతులపై అమెరికా 26 శాతం సుంకం విధించడంతో రొయ్యల సాగు రైతులు బేజారవుతున్న వేళ,చంద్రబాబు ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.రొయ్యలను దేశంలోని మార్కెట్లకు ఎగుమతి చేసి, నష్టాలను పూడ్చుకునేలా ఆక్వా రైతులకు తోడ్పాటు ఇవ్వాలి. దీంతో మాంసం ప్రియులకు రొయ్యలు అందుబాటులోకి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఈ సంక్షోభాన్ని వ్యాపార అవసరంగా మార్చుకోగలిగితే మంచిది. ట్రంప్ టారిఫ్‌లతో మన ఆక్వా రంగం కుదేలవుతున్న వేళ దేశీయంగా మార్కెట్‌ను పెంచితే మంచిది. దేశంలో 60శాతం మంది మాంసం ప్రియులకు రొయ్యలు దక్కడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భరోసా ధర కల్పించి రైతులకు ఊరట కల్పించేలా చర్యలు తీసుకోవాలి.సవాలక్ష సమస్యతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు అమెరికా విధించిన 26 శాతం సుంకం కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ఆక్వా రైతులు సమావేశాలు ఏర్పాటు- చేసుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటి, రెండు రోజుల్లో స్పందించి తమ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే మూకుమ్మడిగా క్రాప్‌హాలిడే ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరిస్తున్నారు. అయితేఇం÷-దుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. వంద కౌంట్‌ను రూ.220కు కొనుగోలు చేయాలని ఎగుమతి వ్యాపారులకు చంద్రబాబు సూచించారు. అయితే, ఈ ధర తమకు గిట్టుబాటు- కాదని రైతులు అంటున్నారు. మిర్చి రైతుల పరిస్థితి మాదిరిగానే తమ పరిస్థితీ మారనుందని, భవిష్యత్తులో ఈ ధర పెరగకపోగా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, విద్యుత్ కోతలను అధిగమించి రైతులు ఈ ఏడాది రొయ్యలను సాగు చేశారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో రొయ్యలకు మంచి ధర లభించింది. 30 కౌంట్‌కు రూ.610 చొప్పున అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఏర్పడింది. అదే సమయంలో 100 కౌంట్ ధర రూ.260 నుంచి రూ.270 వరకూ పలికింది. దీంతో, వేసవిలో కూడా లాభాల పంట పండిస్తుందనే ఆశతో మార్చిలో రైతులు ఉత్సాహంగా సాగు ప్రారంభించారు. అయితే, అమెరికా ప్రతీకార సుంకం ప్రభావం ఆక్వా రంగంపై తీవ్రంగా పడింది. రొయ్యల ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. 100 కౌంట్ రూ.200కు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరపై రైతులు పెదవి విరుస్తున్నారు. కౌంట్ ఒక్కంటికీ రూ.20 నష్టం ప్రస్తుతం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద రైతుల వద్ద రూ.10 వ్యత్యాసంలో ఆ ధరకు కొనుగోలు చేస్తున్నారు, చిన్న రైతులను దళారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధరకు రూ.20 నుంచి రూ.30 వరకూ కోత విధిస్తున్నారు. చెరువు నుంచి పట్టిన తర్వాత నిల్వ చేసుకునే అవకాశాలు లేకపోవడంతో తెగనమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా వైఖరిలో మార్పులేకపోతే భవిష్యత్తులో ధర మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 50 కౌంట్ రూ.320కు మించడంలేదు. 80 కౌంట్ రూ.240 మాత్రమే ఉంది. అత్యధిక మంది రైతుల వద్ద 100 కౌంట్ పంట ఉంది. ఎకరా విస్తీర్ణంలో రొయ్యల సాగుకు రూ.90 వేల నుంచి రూ.1.25 లక్షలకు వరకూ పెట్టుబడి అవుతోంది. ఎకరాకు 3 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుంది. పంట బాగా ఉంటే ఒక్కోసారి 5 టన్నుల వరకూ కూడా వచ్చే అవకాశం ఉంది. .ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన ధరకు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకూ నష్టం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1.10 లక్షలు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 80 వేల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది.

# పోరండ్ల రాజేశం కవిత్వంలో సామాజికత, మానవీయతలు!



పోరండ్ల రాసిన రెండు పుస్తకాల ఆవిష్కరణలు!






**కరీంనగర్, ఏప్రిల్ 9:** యువకవి, తెలుగు అధ్యాపకులు పోరండ్ల రాజేశం కవిత్వంలొ సామాజిక , మానవీయతలు విలువలు నిండుగా ఉన్నాయని, అలతి అలతి పదాలతో అనల్ప భావాలతో సామాజిక స్పృహతో చక్కటి కవితలు రాశారని ప్రముఖ విద్యావేత్త, ఎస్. ఆర్. డిజి. విద్యాలయం ప్రిన్సిపల్ కె. రాజిరెడ్డి, ప్రముఖ జాతీయ చిత్రకారులు అబ్దుల్ మన్నాన్ లు అన్నారు. యువకవి పోరండ్ల రాజేశం రాసిన భావతరంగాలు కవిత్వాన్ని అబ్దుల్ ,మన్నాన్ ఆవిష్కరించగా, ఆంగ్లంలో రాసిన పెరల్ ఆఫ విస్ డం కవిత్వాన్ని రాజిరెడ్డి గారు బుధవారం మధ్యాహ్నం జరిగిన సాహిత్య సభలో ఆవిష్కరించారు. నగరంలోని శరత్ సాహితీ కళాస్రవంతి, విద్యాలయం సౌజన్యంతో ఈ రెండు పుస్తకాల అవిష్కరణోత్సవాలు జ్యోతినగర్ లోని ఎస్. ఆర్. డిజీ విద్యాలయం సమావేశ మందిరంలో జరిగాయి. ప్రముఖ సాహితీ వేత్త, కీర్తి పురస్కార గ్రహీత, శరత్ సాహితీ కళాస్రవంతి అధ్యక్షుడు డా. సబ్బని లక్ష్మీనారాయణ ఈ రెండు పుస్తకాలకు ముందు మాటలు రాస్తూ, జీవన విలువలు, మానవతా విలువలు, పల్లె అందాలు, నగర జీవన విశేషాలు, తన చుట్టూ ఉన్న పరిసరాలు, పండుగలు, కష్ట సుఖాలపై యువకవి పోరండ్ల రాజేశం అల్లిన కవితల్లో అబివ్యక్తి, చక్కటి భాషాపాటవం సంతరించుకొన్నాయని ప్రశంసించారు. శరత్ సాహితీ కళాస్రవంతి ప్రధాన కార్యదర్శి సంకేపల్లి నాగేంద్రశర్మ సభకు అధ్యక్షత వహిస్తూ, యువకవి పోరండ్ల తన జీవితంలోని ఎత్తుపల్లాలను, అనుభవాలను కవిత్వరూపంలో పరావర్తనం గావించిన తీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. కవిత్వమే జీవిత గమనానికి దారి చూపే ఒక రహదారిగానిలుస్తుందని అన్నారు. ప్రముఖ సాహితీ వేత్త గజేందర్ రెడ్డి భావతరంగాలు కవితాసంకలనాన్ని సమీక్షిస్తు, మానవీయ విలువలతో కూడిన కవిత్వాన్ని పాటకుడి హృదయాలకు హత్తుకొనె రీతిలో, గేయరీతిలో నవ్యత్వంతో రాశారని ప్రశంసించారు. నగర ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీకళాశాల రిటైర్డ్ ఉపన్యాసకులు, ఆంగ్ల సాహితీ వేత్త జి. పరశురామారావు ఆంగ్ల కవిత్వ పుస్తకాన్ని సమీక్షించారు. వ్యాఖ్యాతగా ప్రముఖ సాహితీ వేత్త మాడిశెట్టి గోపాల్ లు హాజరై, పోరండ్ల కవిత్వంలో బాల సాహిత్య ప్రభావం మిక్కిలిగా ఉందని, సరళమైన భాషలో చక్కటి కవితలు రాశారని వీరు ప్రశంసించారు. అతిథులుగా ప్రముఖ కవులు దేవీ యాదగిరి, భాషాభాయి, న్యాయవాది రఘువీర్ తదితరులు హాజరై ప్రసంగాలు చేశారు. సభకు అధ్యక్షత వహించిన సీనియర్ కవి నాగేంద్రశర్మను రచయిత పోరండ్ల రాజేశం దంపతులు సన్మాన పత్రం సమర్పించి, ఘనంగా సన్మానించారు. శరత్ సాహితీ కళా స్రవంతి సంస్థ పక్షాన కవి దంపతులు పోరండ్ల రాజేశం-స్వప్నలను నాగేంద్రశర్మ, అతిథులు ఘనంగా సన్మానించారు. - డా.సబ్బని లక్ష్మీనారాయణ, అధ్యక్షులు, సంకేపల్లి నాగేంద్రశర్మ, ప్రధాన కార్యదర్శి.

# రైతు సంక్షేమం లక్ష్యంగా కెసిఆర్ పాలన

**కాళేశ్వరం వృధా ప్రాజెక్ట్ అంటూ దుష్ప్రచారం - కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో నష్టపోతున్న రైతులు**

**మాజీమంత్రి వేముల ప్రశాంత రెడ్డి విమర్శలుధ**

**నిజామాబాద్,ఏప్రిల్9:** రైతు సంక్షేమం కోసం కేసీఆర్ అధికారంలో ఉండగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసారని నిజామాబాద్ జిల్లాకు చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు అమలు చేసిన ఘతన కెసిఆర్‌కు దక్కుతుందన్నారు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా కాంగ్రెస్ ముందుకు సాగడంతో దౌర్భాగ్యం నెలకొందని అన్నారు. బుధవారం నాడిక్కడ మాట్లాడుతూ..రైతులను ఆదుకునేందుకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని అన్నారు. ధాన్యం పండించిన రైతులను ఆదుకోని ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణలో చేపట్టిన రైతు సంక్షేమకార్యక్రమాల వల్ల ధాన్యం దిగుబడులు పెరిగాయన్నారు. కానీ ఇప్పుడు పంటలు ఎండుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరంను వృథా ప్రాజెక్టుగా చూపి పబ్బం గడుపుకోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. గొల్ల కుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ గొర్రెలు పంపిణీ చేశారన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులను ఆదుకున్నామని అన్నారు. ఇలా కులవృత్తులను ఆదుకున్న ఘనత బిఆర్ఎస్‌దని అన్నారు.అన్ని వర్గల సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు సరఫరా చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రణాళికలు చేసి అమలు చేశారని వివరించారు. గోదావరి నీటిని కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మల్లన్న సాగర్ లో నింపి అక్కడి నుంచి వివిధ ప్రాంతాల రైతులకు సాగునీరు అందించారని అన్నారు. ఇలా చేయడం వల్లనే ధాన్యం దిగుబులు పెరిగాయన్నారు.

బిఆర్ఎస్ ఆందోళనలతో కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరాక తప్పదని అన్నారు. ఇప్పటికే తమ ఆందోళనతలో రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. కెసిఆర్ ప్రభుత్వం వేల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టిందన్నారు. ఈ క్రమంలో ప్రాజెక్టులను నిర్మించడంతో ధాన్యం దిగుబడులు పెరిగాయని అన్నారు. రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతీ వరి గింజను తక్షణం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

# మహాత్మ జ్యోతి బా పూలే తెలంగాణ బిసి సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి సందర్శించారు.





**సిద్దిపేట జిల్లా దుబ్బాక :** బుధవారం దుబ్బాక మండలం లోని హబ్సీపూర్ గ్రామ పరిధిలో గల మహాత్మ జ్యోతి బా పూలే తెలంగాణ బిసి సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి సందర్శించారు. ఈ గురుకులంలో 391 మంది విద్యార్థులు ఉంటున్నారని, డార్మెంటరీ గదులు, మరుగుదొడ్లు రిపేర్లు, కిటికీలు తలుపులు రిపేర్లు మరియు డైనింగ్ హాల్ కావాలని ప్రిన్సిపల్ భూపాల్ రెడ్డి కలెక్టర్కు తెలిపారు. వంట గదిలో వండిన అన్నం కూరలను పరిశీలించి రుచి చూసి కూరల్లో ఉప్పు సరి సమానంగా వేయాలని, తాజా కూరగాయలు వాడాలని, వంటగది పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేలా చూసుకోవాలని, కొత్త డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని వంట సిబ్బందికి తెలిపారు. స్టోర్ గదిని పరిశీలించి పసుపు, కారం, నూనె ఇతరత్రా వస్తువులు నాణ్యత పరమైన మాత్రమే వాడాలని కాలం చెల్లిన సరుకులు వాడకూడదని ఎల్లప్పుడూ స్టాక్ రిజిస్టర్ మెయింటైన్ చేయాలని తెలిపారు. మరుగుదొడ్లను పరిశీలించి ఎల్లప్పుడూ రన్నింగ్ వాటర్ వచ్చే విధంగా మరియు బ్లీచింగ్ చేయాలని తెలిపారు. 8వ తరగదిలలోకి వెళ్లి పిల్లలతో అప్యాయంగా పలకరించారు. అన్ని సదుపాయాలు బాగున్నాయా అని విద్యార్థులను అడగ్గా బాగానే ఉన్నాయని తెలిపారు. స్టడీ అవర్స్ లో గణిత సమస్యలను ఎక్కువగా ప్రాక్టీస్ చెయ్యాలని సూచించారు. మీకు కావాల్సిన ప్రస్తుతం దర్మటరి 2 గదులు, మరుగుదొడ్ల డోర్స్, తరగతి గదులకు కిటికీలు తలుపులు, మైదానంలో కూర్చొని తినే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ డబ్ల్యూ ఐ డి సి ఏఈ వచ్చి మీకు కావాల్సిన అన్ని పనుల్లో వారికి తెలిపి ఎస్టిమేట్ సిద్ధం చేస్తాడని ప్రాధాన్యత ప్రకారం అన్ని సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. పనులు పూర్తి అయ్యకా మళ్లీ వస్తానని తరగతిలో చదువులో వెనకబడిన విద్యార్థుల దృష్టి సారించాలన్నారు. పాఠశాల మంచి స్వేచ్ఛ వాతవరణం బాగుందని పట్టుదలతో చదివి జీవితం బంగారు బాటలు వేసుకోవాలి విద్యార్థులకు తెలిపారు. కలెక్టర్ వెంట ఎంఈఓ ప్రభుదాస్, తహసీల్దార్ సంజీవ్, ఎంపీడీవో భాస్కర శర్మ, గురుకుల సిబ్బంది తదితరులు ఉన్నారు.

# జైనమత వ్యవస్థాపకులు భగవాన్ మహావీర్

(10 ఏప్రిల్ "మహావీర్ జయంతి" శుభ సందర్భంగా) క్రీ: పూ: 599లో పాట్నా సమీప కుండల గ్రామంలో (నాటి వైశాలి, నేటి బీహార్ రాష్ట్రంలో) చైత్ర మాసం 13వ క్షీణిస్తున్న చంద్రుడి రోజున రాణి త్రిశూల, రాజు సిద్ధార్థ దంపతులకు వర్ధమాన్ లేదా మహావీర్ జన్మించాడు. భగవాన్ మహావీర్ చివరి తీర్థంకరుడు లేదా రుషి లేదా రక్షకుడుగా నిలిచారు. యుక్త వయస్సుకు చేరుకోగానే రాజ్య పగ్గాలు చేత పట్టి మూడు దశాబ్దాల పాటు పరిపాలన చేశాడు. తర్వాత విలాసవంతమును జీవన విధానానికి స్వస్తి పలికి సత్యాన్ని వెతుక్కుంటూ తన సింహాసనాన్ని, కుటుంబాన్ని విడిచి ఆధ్యాత్మిక ప్రయాణం ప్రారంభించి, 12 ఏండ్ల పాటు సన్యాసిగా ప్రవాసంలో గడిపి జ్ఞానోదయం పొంది జైనమత స్థాపకుడిగా పరివర్తన చెందడానికి నాంది పలికారు. ఆధ్యాత్మిక గురువుగా ధర్మ మార్గానికి 24వ వాడుకగానే కాకుండా చివరి తీర్థంకరుడిగా పేరు తెచ్చుకున్నారు. ఏప్రిల్ 10, 2025న 2623వ భగవాన్ మహావీర్ జయంతిని జైన సమాజం పెద్ద ఎత్తున ఉత్సాహభరితంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. భగవాన్ మహావీర్ 2623వ జయంతి వేడుకలు: అన్ని జీవుల పట్ల శాంతియుతంగా అహింస, కరుణ కలిగి ఉండాలని ప్రచారం చేశారు. చిట్టి సూక్ష్మజీవుల నుంచి అతి పెద్ద జంతువుల వరకు అన్ని జీవులను సమానంగా ప్రేమించడం అలవర్చుకోవాలని బోధించారు. ఈ సూత్రాలే చివరకు జైనమత పుట్టుకకు పునాదులుగా నిలిచాయి. అనేక ఏండ్ల పాటు కఠిన తపస్సు, ధ్యానం చేసిన పిదప అత్యున్నత స్థాయి ఆధ్యాత్మిక జ్ఞానోదయం కలిగిన భగవానుడిగా పిలువబడుతూ ఆధ్యాత్మిక గురువుగా రూపాంతరం చెందాడు. జైన దేవాలయాల సందర్శన, ప్రార్థనలు, సంకీర్తనాలు, భజనలు, మహావీర్ ఉత్సవ విగ్రహంతో రథ యాత్ర ఊరేగింపులు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, దాన ధర్మాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుంది. ఇంద్రియాలను నియంత్రించడంలో అసాధారణ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ "మహావీరుడు" అనే పేరు తెచ్చుకున్నారు. జైన మత స్థాపన తర్వాత తన 72వ ఏట క్రీ. పూ. 527లో మోక్షం పొందిన మహావీరుడు తన వర్గ ప్రజలకు భగవానుడిగా నిలుస్తూ పూజలు అందుకుంటున్నాడు. మహావీర్ జయంతి సందర్భంగా జైనుల దైవికా గమ్య స్థలం మధుబన్, గుజరాత్‌లోకి ముంగి తుంగి, మహారాష్ట్ర గజపంథ, గోమతేశ్వర ప్రదేశాలను సందర్శించడం జరుగుతున్నది. అహింస, సత్యం, అపరిగ్రహం, నిజాయితీ, పవిత్రత, స్వీయ-క్రమశిక్షణ లాంటి సూత్రాలకు కట్టుబడి దొంగతనాన్ని నిషేధించాలని బోధనలు చేశారు. భగవాన్ మహావీర్ బోధనలను కులమతాలకు అతీతంగా అర్థం చేసుకొని, వారు చూపిన విలువలను ఆచరిస్తూ, సన్మార్గంలో నడిచే ప్రయత్నాలు చేద్దాం, మానవీయ విలువలకు పట్టం కడదాం. డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# తోబుట్టువులు - దేవుడిచ్చిన ఆత్మీయ రక్త సంబంధీకులు


(10 ఏప్రిల్ "అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం" సందర్భంగా) డిజిటల్ యుగంలో మానవ సంబంధాలు పునర్నిర్వహించబడుతున్నాయి. న్యూక్లియర్ ఫ్యామిలీ కల్చర్ పెరుగుతున్నది. నాడు "ఇద్దరు లేదా ముగ్గురు బిడ్డలను కనండి" అన్న కుటుంబ నియంత్రణ నినాదం నేడు "ఒక్కరు లేదా అసలే వద్దు" అనే దుస్థితికి చేరడం చూస్తున్నాం. వివాహ బంధం, మంగళ సూత్రం భారమని తలిచి డేటింగ్, సహజీవన సంసారులు, సిచువేషన్‌షిప్ సంబంధాలు పెరిగాయి. సింగిల్ పేరెంట్ సంస్కృతి ఫ్యాషన్ అయిపోతున్నది. ఒక్క సంతానమే తల్లితండ్రులకు భారం అయిపోతున్నది. కుటుంబం అంటే అమ్మ నాన్నతో పాటు ఒక అబ్బాయి లేదా అమ్మాయి మాత్రమే అయిపోతున్నారు. ఈ ఏఐ యుగపు కుటుంబాల్లో ఇద్దరు లేదా అంత కన్న ఎక్కువ సంతానం ఉండడం అరుదైపోతున్నది. నేడు తోబుట్టువులు ఉన్న కుటుంబాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. తోబుట్టువులు ఉన్న కుటుంబాలు పిల్లల ఆటపాటలతో ఉల్లాసంగా ఉండడం, తోబుట్టువుల మధ్య రక్త సంబంధం పెనవేసుకుపోవడం, ఒకరినొకరు ప్రాణాలకు మిన్నగా త్యాగగుణంతో జీవించడం చూస్తున్నాం. అదే విధంగా ఒక వయస్సు దాటిన పిదప తోబుట్టువుల మధ్య రక్త సంబంధాలు రక్తపాతం వరకు కూడా వెళ్లడం చూస్తున్నాం. అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవ ప్రాధాన్యం: తోబుట్టువుల మధ్య పవిత్ర రక్త సంబంధం ఉండడం, ఒకరికొకరు ప్రేమగా చూసుకోవడం, సోదరికి సోదరుడు జీవిత కాల రక్షకుడిగా ఉండడం లాంటి విషయాలను అవగాహన పర్చడానికి ప్రతి ఏట 10 ఏప్రిల్‌లన "అంతర్జాతీయ లేదా ప్రపంచ లేదా జాతీయ తోబుట్టువుల దినం (నేషనల్ లేదా వరల్డ్ సిబ్లింగ్స్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ నాన్న తర్వాత అతి ప్రేమ కలిగిన ఆత్మీయ బంధువులుగా తోబుట్టువులు నిలుస్తున్నారు. హిందూ సమాజం సోదరసోదరీమణుల మధ్య రక్త సంబంధ విలువను తెలుపులకు "రక్షాబంధన్" లేదా "రాఖీ పండుగ"ను తోబుట్టువుల దినం మరో రూపంలో పవిత్రంగా నిర్వహించుకుంటున్నాం. చిన్నతనంలో సోదరి సున్నితమైన ప్రేమను రుచి చూడని సోదరుడు, నేనున్నాననే అనంత ధైర్య రక్షణ గొడుగు పట్టే సోదరుడి తెగువ చూడని సోదరి ఉండదు అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవ చరిత్ర: 1995లో తన సోదరుడు, సోదరిని చిన్న వయస్సులోనే కోల్పోయిన అమెరికన్ "క్లాడియా ఇవర్ట్" తన సోదరి లిసెట్టె పుట్టిన రోజున 10 ఏప్రిల్‌న "తోబుట్టువుల దినం ఫేండేషన్" ఏర్పరిచి తోబుట్టువుల దినం జరుపుకోవడం ప్రారంభించాడు. అనంతరం అమెరికాలో ఒబామా చొరవతో "జాతీయ తోబుట్టువుల దినం", తర్వాత 1998 నుంచి ఐరాస నేతృత్వంలో "అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం" పాటించుట కొనసాగుతున్నది. వయస్సు పెరగడంతో పాటు ప్రాధాన్యాలు, చదువుల మార్గాలు, వివాహాలు జరగడం, ఉద్యోగ ఉపాధుల పేరుతో విడివిడిగా వేరు వేరు ప్రాంతాల్లో జీవించడం కొనసాగుతూనే అనువంశిక ఆస్తి తగాదాలతో గొడవలు పడడం లాంటి అవాంఛనీయ విభేదాలు కూడా పొడచూపడం తరుచుగా గమనిస్తున్నాం. తోబుట్టువుల అపురూప రక్త సంబంధం: శరీరంలో కాళ్లు సోదరులను, చేతులు సోదరీమణులను పోలి ఉంటాయి. అమితమైన ప్రేమలు కలిగిన తోబుట్టువులు ఉన్న ఇల్లు బలమైన మానవ రక్త సంబంధాలు కొలువైన కోవెలగా నిలుస్తున్నది. మన మనస్తత్వం అణువణువున తెలిసిన వ్యక్తులుగా తోబుట్టువులు నిలుస్తారు. భార్యాభర్తల బంధాలను పోలిన బంధాలుగా తోబుట్టువుల సంబంధాలు నిలుస్తున్నాయి. మనం ఏ వయస్సులో ఉన్నా చిన్నతనపు రోజులను గుర్తు చేసే వారు తోబుట్టువులు మాత్రమే. సోదరి లేని సోదరుడి జీవితం ప్రేమలు కొరవడిన యాంత్రిక జీవితంగా నిలుస్తుంది. సోదరికి జీవితకాల హీరో సోదరుడు మాత్రమే. జీవితాంతం మన గురించి మంచిని ఆలోచించే వ్యక్తులుగా తోబుట్టువులు మాత్రమే నిలుస్తారు. సోదరుడికి చిన్న నొప్పి తగిలినా సోదరి కళ్లు కుళాయి వలె కన్నీళ్ల వరదలు పారిస్తుంది. తోబుట్టువులు అత్యుత్తమ స్నేహితులుగా లేదా శత్రువులుగా ఉండడం చూస్తున్నాం. అంతర్జాతీయ తోబుట్టువుల దినం వేడుకలు: అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల్లో ప్రతి కుటుంబంలో సోదరసోదరీమణులు కలిసి సంతోషంగా గడపడం, వారి మధ్య పవిత్ర బంధాన్ని వ్యక్తం చేసుకోవడం, స్వల్ప విభేధాలను పరిష్కరించుకోవడం, రక్త సంబంధాల విలువను అవగాహన పర్చడం, తోబుట్టువులు అందరు కలిసి తమ వయస్సును మరిచి బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో సరదాగా గడపడం, కుటుంబ సభ్యులు పిక్నిక్ రూపంలో బయటకు వెళ్లి గడపడం, ఆటపట్టించిన సందర్భాలను నెమరు వేసుకోవడం, తమ పవిత్ర బంధాన్ని జీవితాంతం కొనసాగించడానికి ప్రతిన బూనడం, తోబుట్టువులు కలిసి తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ సన్మానించుకోవడం, తోబుట్టువులు తమ విభేదాలను మరిచి తిరిగి ఏకం అయ్యే రోజుగా మార్చుకోవడం లాంటి పవిత్ర కార్యక్రమాలు నిర్వహించవచ్చు. జన్యువులను పంచుకొని పుట్టిన తోబుట్టువులు జీవితకాల ప్రేమలను పంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. పొడ చూపిన స్వల్ప విభేదాలను పరిష్కరించుకుంటూ రక్త సంబంధ బలాన్ని ప్రదర్శించాలి. తోబుట్టువుల దినం ఆనందాల విందులు పంచి పెట్టే వేడుకలుగా మారాలి. డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## భారత్‌లో హెూమియోపతి
# వైద్యానికి అధిక ఆదరణ

(10 ఏప్రిల్ "ప్రపంచ హెూమియోపతి దినోత్సవం" సందర్భంగా) ప్రజారోగ్య పరిరక్షణలో హెూమియోపతి వైద్య విధానాలను వ్యాప్తి చేయడానికి, హెూమియో వైద్య అభివృద్ధికి, సవాళ్లను అధిగమించడానికి, సాధారణం ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 10 ఏప్రిల్‌న "ప్రపంచ హెూమియోపతి దినోత్సవం" నిర్వహించకపోవడం ఆనవాయితీగా మారింది. హెూమియో వైద్య వ్యవస్థాపకుడు, పితామహుడు అయిన డా క్రిస్టియన్ శామ్యూల్ హానిమాన్ జన్మదినం 10 ఏప్రిల్ 1755 సందర్భంగా ప్రపంచ హెూమియోపతి దినోత్సవం నిర్వహించడం కొనసాగుతున్నది. ప్రకృతి ప్రసాదించే మొక్కలు, ఖనిజాలు, జంతువుల నుంచి సేకరించిన ఔషధాలతో వ్యాధులకు హెూమియో చికిత్సలు చేస్తారు. హెూమియోపతి వైద్య విధానానికి ప్రధాన సూత్రంగా "లైక్ లౌస్ లైక్" అనే భావాన్ని తీసుకుంటారు. హెూమియోపతి అనగా హెూమియో (ఒకే రకమైన), పతోస్ (వ్యాధి) అనే గ్రీక్ భాష అర్థాలు ఉన్నాయి. భారతంలో హెూమియోపతికి ప్రజాదరణ: హెూమియోపతి వైద్య విధానం భారతంలో 1973లో ప్రభుత్వ గుర్తింపుతో బహుళ ప్రచారం పొందడం, 2014 తర్వాత అల్లోపతి వైద్యంతో పాటు "ఆయుష్ (ఆయుర్వేద, యోగా, యునానీ, సిద్ధ యోగా, నాచురోపతి, హెూమియోపతి)" అంత్రికడత్వ శాఖను జరిగింది. శరీర వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తూ వ్యాధి మూలాలను కనుగొని ఔషధ చికిత్సను చేయడం, ఎలాంటి ఔషధ దుష్ప్రభావాలు లేకుండా ఉండడం హెూమియో ప్రత్యేకతగా తీసుకోవాలి. మన దేశంలో అనేక అనేక హెూమియో వైద్య కళాశాలలు, హెూమియో ఆసుపత్రులు ప్రారంభించడం జరుగుతున్నది. హెూమియోపతి వైద్యం ద్వారా చర్మ, జీర్ణకోశ, ఎలర్జీ, మైగ్రెయిన్, మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పులు, నీరసం, రుతుస్రావం ముందు అనారోగ్యం, దీర్ఘకాలిక అలసట, అస్తమా, వినికిడి రోగాలు, బిపీ, జలుబు లాంటి వ్యాధులకు సమర్థవంతంగా చికిత్సలు చేస్తారు. దేశవ్యాప్తంగా 100 మిలియన్ల ప్రజలు హెూమియో చికిత్సలు పొందుతుండగా, 2 లక్షల హెూమియో డాక్టర్లు సేవలు అందిస్తూ, ప్రతి ఏట 12,000 మంది వైద్యులు హెూమియో రంగంలోకి అడుగిడుతున్నారు. ప్రపంచ హెూమియో దినం రోజుల హెూమియో వైద్య శిబిరాలు, సెమినార్లు, సింపోజియాలు, కార్యశాలలు, హెూమియో వైద్యులను సన్మానించడం లాంటి కార్యక్రమాలు చేయడం జరుగుతుంది. ప్రపంచ హెూమియోపతి దినోత్సవం-2025 ఇతివృత్తంగా "హెూమియో విద్య, బోధన, పరిశోధన" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. సహజమైన, సరళమైన, సురక్షితమైన, ప్రభావితమైన హెూమియోపతితో ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా రోగం మూలలను కనుగొని స్వస్థత చేకూర్చుతున్న ప్రపంచ హెూమియోపతి వైద్యులకు, హెూమియో వైద్యం పొందుతున్న రోగులకు ప్రపంచ హెూమియోపతి దినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేద్దాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# హనుమాన్ పూజా
## కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్





**రాజన్న సిరిసిల్ల** సిరిసిల్ల పట్టణంలో హనుమాన్ మాలదారులకు ( స్వాముల )స్థానిక ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం (తెలంగాణ భవన్)లో నిర్వహించిన హనుమాన్ పూజ కార్యక్రమంలో పాల్గొనీ హనుమాన్ మాలదారులతో (స్వాములతో ) పాటుగా భిక్షా చేయడం జరిగింది.

# బసవేశ్వర స్వామి జయంతిని అధికారికంగా నిర్వహించాలి

### వీర శైవ సమాజం నేత శివప్ప




**సిద్దిపేట జిల్లా , :** ఈ నెల 30న వీర శైవ సమాజం ఆరాధ్య దైవం బసవేశ్వర స్వామి జయంతి నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు శివప్ప తెలిపారు. సిద్ధిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వీరశైవ సమాజం నాయకులు మాట్లాడారు. బసవేశ్వర స్వామి జయంతి సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసి ఆయన జయంతి నీ అధికారికంగా జరపాలని కోరారు. బసవేశ్వర స్వామి జయంతి నీ కుల మత సంబంధం లేకుండా అందరూ పాల్గొని విజయవంతం చేయాలనీ కోరారు. గత ప్రభుత్వంలో ఆయన జయంతి నీ గత ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ంలో ఆకుల బద్రప్ప, ప్రశాంత్, కర్నె నాగరాజు, బావు పల్లి యాదగిరి, గందే శివకుమార్, బావుపల్లి వీరేశం, గరుగుపల్లి పల్లి రాజమౌళి, శంకరశెట్టిశివలింగం,బద్రినాగరాజుపాల్గొన్నారు

# ఆరోగ్యశాఖ మంత్రి దామన్న ఆదేశాల మేరకు సీఎం ఆర్ఎఫ్ చెక్ ల పంపిణి



**పంపిణి చేసిన డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్,కౌన్సలర్ రియాజ్**

**సిద్దిపేట :** మంత్రి దామోదర్ రాజన ర్సింహ ఆదేశాలు మేరకు నారాయణరావు పేట మండలా గోపులాపూర్ గ్రామానికి చెందిన భుస్సవేనీ మౌనిక అనారోగ్యం బాగాలేక ఆపరేషన్ చేయించుకుంటే మంత్రి దామోదర్ రాజనర్సింహా దృష్టికి తీసుకెళ్లగా ముఖ్యమంత్రి సహాయనిధి నుండి చెక్ మంజూరు చేయించగా ,మంత్రి ఆదేశాల మేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులూ ,కౌన్సలర్ రియాజ్ లు కలిసి సిఎంఆర్ చెక్కును అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని పేదల కాంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ద్వేయం అన్నారు. పేదల ఆరోగ్యం విషయంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుం దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులూ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి కురటి రాజయ్య ,నాయకులూ చేల్లోజు కనకాచారి పాల్గొన్నారు..

## గోల్డెన్ జూబ్లీ వైపుకు
# ఐక్యతగా కొనసాగుదాం



**- ఈ నెల 13న కర్దనూర్ జెపి కన్వెన్షన్ లో ఘనంగా 40వ వార్షికోత్సవ ముగింపు సభను జయప్రదం చెయ్యండి - శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షికోత్సవ సభలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు పిలుపు**

**పటాన్ చెరు :** గత చారిత్రిక విజయాల పునాదిగా గోల్డెన్ జూబ్లీ వైపుకు ఐక్యతగా ముందుకు కొనసాగుదామని శాండ్విక్ ఎం ప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు కార్మికులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పారిశ్రామిక ప్రాంతంలో 1985 ఏప్రిల్ 9వ తేదీన సీఐటీయూ అనుబంధంగా స్థాపించిన శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ 40వ వార్షి కోత్సవాన్ని బుధవారం పరిశ్రమలో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ ఫౌండర్ సభ్యులు, యూనియన్ అధ్యక్షులు చుక్కా రాములు హాజరై యూనియన్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 09.04. 1985లో సీఐటీయూ అనుబంధంగా స్థాపించిన శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ (పూర్వపు విడియా ఎంప్లాయిస్ యూనియన్)ను 40 సంవత్సరాల పాటు ఐక్యంగా నిలబెట్టుకుంటూ అనేక అద్భుత విజయాలు సాదించి 14 వేతన ఒప్పందాలు ద్వారా కార్మిక సంక్షేమానికి అహర్నిశలు కృషి చేసిందని, అనేక ఒడిదుడుకులు ఎదురైనా చైతన్యవంతులైన కార్మిక వర్గం యూనియన్ ఐక్యతను 40 సంవత్సరాలపాటు కాపాడుకుం టూ నేడు 40వ వార్షికోత్సవం నిర్వహించుకోవ డం ఎంతో అభినందనీయమన్నారు. ఒక సామాజిక స్పృహ ఉన్న కార్మిక సంఘంగా ఎస్ఈయు చరిత్ర సృష్టించిందని అన్నారు. ఈ నెల 13వ తేదీ ఆదివారం కర్దనూర్ జెపి కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించే 40వ వార్షికోత్సవ ముగింపు సభను జయప్రదం చెయ్యాలని ఈ సందర్భంగా కార్మికులకు పిలుపునిచ్చారు. సీనియర్ కార్మికులు ఒక్కొక్కరు రిటైర్మెంట్ అవుతూ కొత్తతరం కార్మికులు వస్తున్న నేడు మారిన పరిస్థితులలో గత విజయాల పునాదిగా మరింత ఐక్యతతో 50వ వార్షికోత్సవం (గోల్డెన్ జూబ్లీ) వైపుకు మన ప్రయాణం సాగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# ఆంద్రీ రస్సెల్ ను రఫ్ఫాడించిన నికోలస్ పూరన్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025లో నికోలస్ పూరన్ అద్భుతమైన ఫామ్ కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో పరుగులు సునామీ తెచ్చింది. లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆడుతున్న నికోలస్ పూరన్ గత సీజన్ లో దుమ్మురేపే ఇన్నింగ్స్ లను ఆడాడు.ఐపీఎల్ 2025లో కూడా ఆరంభం నుంచే అదరిపోయే ఇన్నింగ్స్ లతో పరుగుల వరదపారిస్తున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌పై మరో సునామీ ఇన్నింగ్స్ ఆడాడు. పురాన్ కేవలం 36 బంతుల్లో 87 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అద్భుతమైన సిక్సర్లతో కేకేఆర్ బౌలింగ్ ను దంచికొట్టాడు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన తర్వాత కోల్‌కతా బౌలింగ్ ఎంచుకోగా, లక్నో 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ తో పాటు మిచెల్ మార్ష్, ఐడెన్ మార్క్రామ్ అద్భుతమైన ఇన్నింగ్స్ లు ఆడారు. మార్ష్ 48 బంతుల్లో 81 పరుగుల తన ఇన్నింగ్స్ లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు కొట్టాడు. మార్క్రామ్ తన 28 బంతుల ఇన్నింగ్స్‌లో 47 పరుగులు చేశాడు. వీరిద్దరూ మొదటి వికెట్‌కు 10.2 ఓవర్లలో 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ విధ్వంస సృష్టించాడు. తన వెస్టిండీస్ జట్టు ప్లేయర్ ఆంద్రీ రస్సెల్ బౌలింగ్ ను చీల్చిచెండాడాడు. ఈ ఆల్ రౌండర్ వేసిన ఒక ఓవర్లో పూరన్ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించాడు. కోల్‌కతా తరఫున లక్నో ఇన్నింగ్స్‌లోని 18వ ఓవర్‌ను రస్సెల్ బౌలింగ్ చేశాడు.

పురాన్ తన మొదటి బంతిని బౌండరీ మీదుగా ఫోర్ కొట్టాడు. రెండో బంతికి పరుగు రాలేదు.. కానీ, మూడవ బంతిని అద్భుతమైన ఫోర్ కొట్టాడు పూరన్. తర్వాతి బంతిని సిక్సర్ గా మలిచాడు. ఐదో బంతికి ఫోర్ వచ్చింది. ఈ ఓవర్ చివరి బంతిని మరో బిగ్ సిక్సర్ గా మలిచాడు. దీంతో రస్సెల్ వేసిన ఈ ఓవర్ లో మొత్తం 24 పరుగులు సాధించాడు నికోలస్ పూరన్.రస్సెల్ బౌలింగ్ లో అదిరిపోయే సిక్సర్లు కొట్టిన నికోలస్ పూరన్ వీడియో ఇక్కడ చూడండిఈ ఐపీఎల్ సీజన్‌లో పూరన్ సూపర్ ఫామ్ లో ఉన్నాడు. వరుసగా తుఫాను ఇన్నింగ్స్ లు ఆడుతున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో అతను 75 పరుగులు చేశాడు. ఆ తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 70 పరుగులతో దుమ్మురేపాడు. పంజాబ్ కింగ్స్‌పై 44, ముంబై ఇండియన్స్‌పై 12 పరుగులు చేశాడు.

ఇప్పుడు కోల్‌కతా బౌలర్లను చెడుగుడు ఆడుకుంటూ 87 పరుగులు ఇన్నింగ్స్ ఆడాడు.

# ఓవర్ లో 11 బంతులు వేసిన శార్దూల్ ఠాకూర్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఉత్కంఠభరితంగా ముందుకు సాగుతోంది. పలువురు బ్యాటర్లు సూపర్ బ్యాటింగ్ తో అదరగొడుతున్నారు. బౌలర్లు సైతం తాము తక్కువ కాదంటూ మెరుపు బంతులు, స్పిన్ మాయాజాలంతో బ్యాటర్లను పెవిలియన్ కు పంపుతున్న సందర్భాలు ఉన్నాయి. అయితే, మొత్తంగా చూస్తే ఐపీఎల్ లో ఇప్పటివరకు కొద్దిగా బ్యాటర్లదే పై చేయిగా ఉంది. కోల్ కతా నైట్ రైడర్స్-లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్ తో మరోసారి ఇది రుజువైంది. ఇరుజట్లు కలిపి 40 ఓవర్లలో ఏకంగా 450o పరుగులు కొట్టాయి. అయితే, ఈ ఐపీఎల్ 2025 21వ మ్యాచ్‌లో కోల్‌కతాను లక్నో టీమ్ ఓడించింది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో లక్నో 4 పరుగుల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో రెండు జట్ల బ్యాట్స్‌మెన్ చాలా పరుగులు సాధించారు. ఈడెన్ గార్డెన్స్ బౌలర్లకు చుక్కలు చూపించింది. ఈ మ్యాచ్‌లో మొత్తం 472 పరుగులు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే లక్నో బౌలర్ శార్దూల్ ఠాకూర్ మరోసారి హాట్ టాపిక్ గా మారాడు. అతను తన బౌలింగ్ లో ఏకంగా 11 బంతులు వేశాడు. ఒక ఓవర్ కు సాధారణంగా 6 బంతులు వుంటాయి. కానీ, శార్దూల్ ఠాకూర్ ఒకే ఓవర్లో ఐదు వైడ్ బంతులతో కలిపి మొత్తం 11 బంతులు వేశాడు. మ్యాచ్ 13వ ఓవర్లో శార్దూల్ మొదటి ఐదు బంతుల్లో వరుసగా ఐదు వైడ్లు వేశాడు, కెప్టెన్ రిషబ్ పంత్ స్పష్టంగా నిరాశ చెందాడు. ఐపీఎల్ 2025 లో ఇప్పటివరకు గొప్ప ఫామ్‌లో ఉన్న ఈ ఫాస్ట్ బౌలర్, ఆ ఓవర్‌లో తన బౌలింగ్ లయను కోల్పోయాడు. కానీ, ఓవర్ లో బంతులు పెరుగుతున్న నిరుత్సాహపడకుండా ఈ 11 బంతుల ఓవర్ లో చివరలో అద్భుతమైన డెలివరీతో కేకేఆర్ కెప్టెన్ ను పెవిలియన్ కు పంపాడు. ఈ వికెట్ మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చివేసింది.ఈ మ్యాచ్‌లో శార్దూల్ ఠాకూర్ 4 ఓవర్లలో 52 పరుగులు ఇచ్చాడు కానీ, రెండు కీలకమైన బిగ్ వికెట్లు కూడా తీసుకున్నాడు. పరుగుల సునామీ వచ్చిన ఈ మ్యాచ్‌లో అజింక్య రహానే, ఆంద్రీ రస్సెల్ వికెట్లు పడగొట్టి శార్దూల్ మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 5 మ్యాచ్‌ల్లో అతను 9 వికెట్లు పడగొట్టాడు.ఐపీఎల్ వేలంలో శార్దూల్‌ను ఎవరూ కొనుగోలు చేయలేదు. మొహ్సిన్ ఖాన్ గాయపడిన తర్వాత అతను లక్నో జట్టులో ప్రత్యామ్నాయంగా చేరాడు. తన బౌలింగ్ ఏవేవో చేసినా మొత్తంగా ఒక్కటైనా అద్భుతమైన డేలివరీ వేసి వికెట్లు తీసుకుంటూ జట్టు విజయంలో కీలకపాత్ర పోషిస్తూనే ఉన్నాడు. ఈడెన్ గార్డెన్స్ లో జరిగిన ఈ మ్యాచ్ లో కోల్ కతా కెప్టెన్ అజింక్య రహానే టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో లక్నో 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా 20 ఓవర్లలో 7 వికెట్లకు 234 పరుగులు చేసింది. కేవలం 4 పరుగులు తేడాతో ఓడిపోయింది. ఈ సీజన్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో కోల్‌కతాకు ఇది మూడో ఓటమి. లక్నో టీమ్ మూడో విజయాన్ని అందుకుంది.

# ధోనీ జడేజా మళ్ళీ గెలిపించలేకపోయారు..

# చెన్నైకి 4వ ఓటమి



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025లో ధోని టీమ్ చెన్నై సూపర్ కింగ్స్ మరో ఓటమిని చవిచూసింది. ఐపీఎల్ 2025 22వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ - పంజాబ్ కింగ్స్ తలపడ్డాయి. బ్యాటింగ్ లో దుమ్మురేపే ప్రదర్శనతో పంజాబ్ సూపర్ విక్టరీ అందుకుంది. చివరి ఓవర్ వరకు సాగిన ఈ మ్యాచ్‌లో 18 పరుగుల తేడాతో చెన్నై సూపర్ కింగ్స్ ఓడిపోయింది. విన్నింగ్ పరుగులు కావాల్సిన సమయంలో క్రీజులో ఎంఎస్ ధోని, రవీంద్ర జడేజాలు ఉన్నారు. కానీ, మళ్లీ ఈ జోడీ చెన్నైకి విజయాన్ని అందించడంలో సక్సెస్ కాలేకపోయింది. చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు మాత్రమే చేయగలిగింది.

ఈ సీజన్‌లో పంజాబ్‌కు ఇది మూడో విజయం. ఐదు మ్యాచ్‌ల్లో చెన్నైకి ఇది వరుసగా నాలుగో ఓటమి. దీంతో పాయింట్ల పట్టికలో పంజాబ్ కింగ్స్ 4వ స్థానంలోకి చేరగా, చెన్నై సూపర్ కింగ్స్ 9వ స్థానంలోకి పడిపోయింది. మొదటి రెండు స్థానాల్లో ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ ఉన్నాయి.చివరి ఓవర్లో చెన్నై గెలవాలంటే 28 పరుగులు కావాలి. అయితే, క్రీజులో ఉన్నధోని, జడేజాలు మ్యాచ్ ను గెలిపించలేకపోయారు. ధోని 11 బంతుల్లో 27 పరుగులు చేశాడు. 20వ ఓవర్ తొలి బంతికే ధోనీ ఔటయ్యాడు. యష్ ఠాకూర్ వేసిన బంతికి యుజ్వేంద్ర చాహల్ కు క్యాచ్ రూపంలో దొరికిపోయాడు. ధోని 12 బంతులు ఆడి ఒక ఫోర్, 3 సిక్సర్లు బాదాడు. ఆ తర్వాత విజయ్ శంకర్ సింగిల్ తీసుకున్నాడు. మూడో బంతికి రవీంద్ర జడేజా సిక్స్ కొట్టాడు. తరువాతి బంతికి ఒక్క పరుగు కూడా రాలేదు. ఐదవ బంతికి ఒక పరుగు వచ్చింది. చివరి బాల్ కు విజయ్ శంకర్ ఒక పరుగులు తీశాడు.220 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చెన్నై జట్టు శుభారంభం చేసింది. పవర్‌ప్లేలో రచిన్ రవీంద్ర, డెవాన్ కాన్వే కలిసి 59 పరుగులు చేశారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. రాచిన్ 23 బంతుల్లో 36 పరుగులు చేసి ఔటయ్యాడు. తర్వాత వచ్చిన రుతురాజ్ గైక్వాడ్ ఒకే ఒక్క పరుగు చేసి అవుట్ అయ్యాడు. డెవాన్ కాన్వే, శివం దూబే మూడో వికెట్‌కు 51 బంతుల్లో 89 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దూబే 27 బంతుల్లో 42 పరుగులు చేసి ఔటయ్యాడు. అతను 3 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టాడు. కాన్వే 49 బంతుల్లో 69 పరుగులు చేశాడు. అతను 6 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టాడు. బ్యాటింగ్ నెమ్మదిగా ఉండటం వల్ల, అతను 18వ ఓవర్ ఐదవ బంతికి రిటైర్ అవుట్ అయ్యాడు. అతని స్థానంలో జడేజా క్రీజులోకి వచ్చాడు. అయితే, ఆ వ్యూహం పనిచేలేదు. జడేజా 5 బంతుల్లో ఒక సిక్సర్ తో 9 పరుగులతో నాటౌట్ గా ఉన్నాడు. విజయ్ శంకర్ 2 బంతుల్లో 2 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ యంగ్ ప్లేయర్ ప్రియాంష్ ఆర్య పంజాబ్ తరఫున సెంచరీ చేసి సంచలనం సృష్టించాడు. ప్రియాంష్ చెన్నై బౌలర్లందరినీ దంచికొట్టాడు. కేవలం 39 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. తన 103 పరుగుల ఇన్నింగ్స్ లో ప్రియాంష్ 7 ఫోర్లు, 8 సిక్సర్లు కొట్టాడు. 245.24 స్ట్రైక్ రేట్ తో అతని బ్యాటింగ్ సాగింది. అతనితో పాటు, శశాంక్ సింగ్ 36 బంతుల్లో 52, మార్కో జాన్సెన్ 19 బంతుల్లో 34 పరుగులతో అజేయంగా నిలిచారు. ఖలీల్ అహ్మద్, రవిచంద్రన్ అశ్విన్ లు తలా రెండు వికెట్లు పడగొట్టారు.

# ప్రియాంష్ ఆర్య సెంచరీ రికార్డులు ఇవే



ఐపీఎల్ 2025లో యంగ్ ప్లేయర్లు దంచికొడుతున్నారు. సునామీ బ్యాటింగ్ అదిరిపోయే ఇన్నింగ్స్ లను ఆడుతున్నారు. అలాంటి ప్లేయర్ల లిస్టులోకి ఢిల్లీ యంగ్ ప్లేయర్, పంజాబ్ తరఫున ఐపీఎల్ ఆడుతున్న ప్రియాంష్ ఆర్య కూడా వచ్చి చేరాడు. తన తొలి ఐపీఎల్ సీజన్ లోనే అదరిపోయే నాక్ ఆడాడు. తుఫాను సెంచరీతో ఐపీఎల్ లో రికార్డుల మోత మోగించాడు. ఐఎల్ 2025 22వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ - పంజాబ్ కింగ్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ ఓపెనర్ బ్యాట్స్‌మన్ ప్రియాంష్ ఆర్య తన తొలి సెంచరీని సాధించాడు. అలాగే, ఇది ఐపీఎల్ 2025లో నమోదైన రెండో సెంచరీ. చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్‌పై ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించాడు ప్రియాంష్ ఆర్య. ఈ క్రమంలోనే తన సెంచరీ ఇన్నింగ్స్ తో పలు రికార్డులు సాధించాడు.ప్రియాంష్ చెన్నై బౌలర్లందరినీ దంచికొట్టాడు. కేవలం 39 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. ప్రియాంష్ తన ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 8 సిక్సర్లు బాదాడు. అతని బ్యాటింగ్ 245.24 స్ట్రైక్ రేట్ తో సాగింది. మరో బిగ్ షాట్ కొట్టబోయి నూర్ అహ్మద్ బౌలింగ్‌లో విజయ్ శంకర్ కు క్యాచ్ రూపంలో దొరికిపోయాడు.

మతీషా పతిరానా ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లు బాదిన ప్రియాంష్ ఆర్య ప్రియాంష్ ఆర్య చెన్నై స్టార్ బౌలర్ మతిషా పతిరానా బౌలింగ్ ను దంచికొట్టాడు. గ్రేట్ లసిత్ మలింగ లాంటి యాక్షన్ తో బౌలింగ్ చేసే పతిరాన 13వ ఓవర్ లో బౌలింగ్ వేయడానికి వచ్చాడు. ఆ ఓవర్లో ప్రియాంష్ మూడు సిక్సర్లు కొట్టాడు. రెండవ, మూడవ, నాల్గవ బంతులను భారీ సిక్సర్లుగా మలిచాడు. ఐదవ బంతికి ఫోర్ కొట్టి తన సెంచరీని పూర్తి చేశాడు.


# మీకు లోన్ ఉందా అయితే గుడ్ న్యూస్



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. తాజాగా నిర్వహించిన ద్రవ్య విధాన కమిటీ సమీక్షలో కీలక రెపో రేటును తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లకు తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ఈ నిర్ణయంతో రెపో రేట్ ప్రస్తుతం ఉన్న 6.25 శాతం నుంచి ఇప్పుడు 6.00 శాతానికి దిగి వస్తుంది. దీంతో హౌజ్ లోన్స్, కారు లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్, పర్సనల్ లోన్స్‌పై వడ్డీ రేట్లు తగ్గుతాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ నిర్వహించిన తొలి మానిటరీ పాలసీ కమిటీ సమావేశం ఇదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలను అమల్లోకి తీసుకొచ్చిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ మేరకు రెపో రేటు తగ్గించడం ఆసక్తిగా మారింది. ట్రంప్ నిర్ణయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశాలున్న నేపథ్యంలోనే ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఆర్బీఐ తీసుకున్న ఈ నిర్ణయంతో రుణాలు తీసుకున్న వారికి లబ్ధి చేకూరుతుంది. కానీ డబ్బు పొదుపు చేసుకునే వారికి మాత్రం ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. దీనికి కారణం వడ్డీ రేట్లు తగ్గడమే. వడ్డీ రేట్ల తగ్గింపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కూడా పడే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో బ్యాంకుల్లో డబ్బులు దాచుకున్న వారికి లాభాలు తగ్గుతాయి. ఇదిలా ఉంటే రెపోరేటు తగ్గడం వల్ల లోన్ తీసుకున్న వారికి మేలు జరగనుంది. ఈఎమ్ఐ టెన్యూర్ లేదా ఈఎంఐ మొత్తం తగ్గే అవకాశం ఉంటుంది.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలోని వాణిజ్య బ్యాంకులకు ఇచ్చే తాత్కాలిక రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటునే రెపో రేటు అంటారు. సింపుల్‌గా చెప్పాలంటే దేశంలోని బ్యాంకులకు ఆర్బీఐ అప్పు ఇవ్వడం అని చెప్పొచ్చు. ఆర్బీఐ నుంచి అప్పుగా తీసుకున్న బ్యాంకులు చెల్లించే వడ్డీ రెపోరేటుపై ఆధారపడి ఉంటుంది. రెపో రేటు పెరిగితే/తగ్గితే ఏం జరుగుతుంది.? ఒకవేళ రెపో రేటు పెరిగితే బ్యాంకులు ఆర్బీఐకి ఎక్కువ వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పరోక్షంగా ఇది ఖాతాదారులపై ప్రభావం చూపుతుంది. ఒకవేళ రెపో రేటు తగ్గితే బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తాయి. మార్కెట్లో డబ్బు ప్రవాహం పెరుగుతుంది. ఆర్థిక వ్యాపారం ఊపందుకుంటుంది. అందుకే ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతున్నాయని అనుకునే సమయాల్లో ఆర్బీఐ రెపోరేటును తగ్గిస్తాయి. రెపోరేటును ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ ప్రతి రెండు నెలలకోసారి భేటీ అయ్యి రేటును నిర్ణయిస్తుంది.

# రోజురోజుకీ పతనమవుతోన్న బంగారం ధర..

## నిజంగానే తులం రూ. 50 వేలు కానుందా



గత కొన్ని రోజులుగా బంగారం ధర క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. బుధవారం కూడా బంగారం ధర బాగా తగ్గింది. గుడ్ రిటర్న్స్ రిపోర్ట్ ప్రకారం, ఇండియాలో గత ఏడు రోజుల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.3,450 తగ్గింది. అందుకే బంగారం కొనడానికి ఇది మంచి అవకాశమని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉంటే రానున్న రెండు నుంచి మూడేళ్లలో 10 గ్రాముల బంగారం ధర రూ. 55 వేలకు పడిపోనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర ఇలా ఉంది. చెన్నై: రూ.82,240, ముంబై: రూ.82,240, ఢిల్లీ: రూ.82,390, కోల్‌కతా: రూ.82,240, బెంగళూరు: రూ.82,240, హైదరాబాద్: రూ.82,240, పూణే: రూ.82,240 వద్ద కొనసాగుతోంది. బుధవారం దేశంలో బంగారం, వెండి ధరలు కూడా తగ్గాయి. ఇండియాలో వెండి ధర అంతర్జాతీయంగా వచ్చే మార్పులు, డాలర్‌తో రూపాయి మారకం విలువపై ఆధారపడి ఉంటుంది. దీని వల్ల దేశీయ బంగారం, వెండి ధరలపై ప్రభావం పడుతుంది. స్టాక్ మార్కెట్ పతనమైనా బంగారం ధర తగ్గింది. గత 6 రోజులుగా బంగారం ధర కొంచెం కొంచెంగా తగ్గుతూ వస్తోంది. ఏప్రిల్ 6న మాత్రమే బంగారం ధరలో ఎలాంటి మార్పు లేదు. ఇవాళ కూడా బంగారం ధర తగ్గింది.

ఇక బంగారం కొనుగోలు చేసే వారు ఆభరణాలకు బదులు బంగారు బిస్కెట్లు, గోల్డ్ బాండ్లు కొంటే అది ఒక రకమైన పెట్టుబడి లాంటిదే. ఇది ఎప్పటికీ సెకండ్ హ్యాండ్ కాదు. ఆ రోజు బంగారం ధరను బట్టి చాలా సంవత్సరాల తర్వాత కూడా మంచి రేటు పొందవచ్చు. అందుకే బంగారం పెట్టుబడిదారులకు ఇష్టమైన పెట్టుబడి.

# స్విగ్గీ సంచలన నిర్ణయం.. అలా సరుకులు కొంటే

## బంపర్ ఆఫర్.. డబ్బు ఆదా ఎంతంటే




స్విగ్గీ, జెప్టో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ఇలా అనేక ఈ కామర్స్ ప్లాట్‌ఫాంలు ప్రస్తుతం అందు బాటులో ఉన్నాయి. దీంతో ఈ మార్కెట్లో విపరీతమైన పోటీ పెరిగిపోయింది. ఆయా కంపెనీలు వినియోగదారులను ఆకర్షించేందుకు బంపర్ ఆఫర్లను ఇచ్చేస్తున్నారు. మరి మార్కెట్లో నిలబడాలంటే తప్పదు కదా. అయితే... గత ఏడాది సెప్టెంబర్‌లో జెప్టో సంస్థ సూపర్ సేవర్ పేరుతో ఆఫర్ తీసుకొచ్చి వినియోగదారులను ఆకట్టుకుంది. కొత్త వినియోగదారులను కూడా పెంచేసుకుంది. ఈ పోటీని తట్టుకునేందుకు స్విగ్గీ ఏం చేసిందంటే.స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ప్రస్తుతం కిరాణా సరుకులు, రోజువారీ నిత్యావసర వస్తువులు, నుంచి ఎలక్ట్రానిక్స్, స్మార్ట్‌ఫోన్‌లు, ఫ్యాషన్, మేకప్, గిఫ్ట్ బొమ్మలు ఇలా సుమారు 35,000 ఉత్పత్తులను కస్టమర్లక అందుబాటులోకి తీసుకొచ్చింది. మొదట్లో ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫాంగా అమ్మక తప్పని పరిస్థితి ఎదురైంది.

## రెచ్చిపోయిన జాన్వీ కపూర్ చెల్లి, అమీర్ ఖాన్ కొడుకు.. దిమ్మతిరిగే షాక్



స్టార్ నటుల వారసులు వాళ్ళ షాడో నుంచి బయటకి వచ్చి నిరూపించుకోవడానికి పడరాని కష్టాలు పడాల్సి వస్తోంది. అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెగా కెరీర్ బిగినింగ్ లో విమర్శలు ఎదుర్కొంది. ఇప్పుడు బాలీవుడ్ లోనే కాదు పాన్ ఇండియా స్థాయిలో జాన్వీ కపూర్ క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది. జాన్వీ కపూర్ చెల్లి ఖుషి కపూర్ తనకంటూ గుర్తింపు తెచ్చుకునేందుకు గట్టి ప్రయత్నాలే చేస్తోంది. ఇప్పుడిప్పుడే ఖుషి కపూర్ కి హీరోయిన్ గా అవకాశాలు వస్తున్నాయి. ఖుషి కపూర్ ఈ ఏడాది నటించిన చిత్రం లవ్ యాపా. ప్రదీప్ రంగనాథన్ సూపర్ హిట్ మూవీ లవ్ టుడే చిత్రానికి బాలీవుడ్ లో రీమేక్ గా తెరకెక్కించారు. ఈ చిత్రంలో ఖుషి కపూర్, అమీర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ జంటగా నటించారు. జునైద్ ఖాన్, ఖుషి కపూర్ రెచ్చిపోయి ఈ చిత్రంలో రొమాన్స్ పండించారు.వీళ్లిద్దరి కెమిస్ట్రీకి మంచి మార్కులు పడ్డాయి. కానీ థియేటర్స్ లో ఈ చిత్రం ఆశించిన స్థాయిలో వసూళ్లు రాబట్టలేకపోయింది. ఫలితం డిజాస్టర్ గా మారింది. కానీ ఇటీవల ఈ చిత్రం ఓటీటీలో రిలీజ్ అయింది. ఓటీటీలో మాత్రం ఆడియన్స్ ఈ చిత్రాన్ని చూసేందుకు ఎగబడుతున్నారు. కానీ ఇంతలో జాన్వీ, జునైద్ ఖాన్ లకు ఐబొమ్మ ఊహించని షాక్ ఇచ్చింది. లవ్ యాపా చిత్రం ఐబొమ్మలో లీక్ అయింది. ప్రస్తుతం ఈ మూవీ ఐబొమ్మలో ట్రెండింగ్ గా మారింది. సినిమా రిజల్ట్ ఎలా ఉన్నప్పటికీ ఖుషి కపూర్ పెర్ఫార్మెన్స్ కి మాత్రం ప్రశంసలు దక్కుతున్నాయి.

## శంకర్‌ను అట్లీ కాపీ కొడుతున్నారా? అల్లు అర్జున్ మూవీ విషయంలో స్ట్రాటజీ ఇదే

డైరెక్టర్ అట్లీ శంకర్ స్ట్రాటజీని కాపీ కొట్టారా?: తక్కువ సమయంలోనే టాప్ డైరెక్టర్లలో ఒకరిగా ఎదిగిన వారిలో అట్లీ (%శ్రీవవ%) ఒకరు. డైరెక్టర్ శంకర్ దగ్గర రోబో, స్నేహితుడు సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన అట్లీ, ఆ తర్వాత రాజా రాణి సినిమాతో డైరెక్టర్‌గా పరిచయం అయ్యాడు. ఆ తర్వాత విజయ్‌తో తెరి, మెర్సల్, బిగిల్ లాంటి హ్యాట్రిక్ హిట్ సినిమాలు తీశాడు. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. అక్కడ మొదటి సినిమానే షారుఖ్‌ఖాన్‌తో తీసి వెయ్యి కోట్ల వసూళ్లు రాబట్టాడు.కేవలం 5 సినిమాలు మాత్రమే తీసిన అట్లీ తన 6వ సినిమా కోసం రూ.100 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకునే డైరెక్టర్‌గా ఎదిగాడు. రాజమౌళి తర్వాత ఇండియాలోనే ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకునే డైరెక్టర్ ఎవరంటే అది అట్లీనే. అట్లీ గురువైన శంకరే ఒక సినిమాకు రూ.50 కోట్లు తీసుకుంటున్నారు. ఆయన కంటే డబుల్ రెమ్యూనరేషన్ తీసుకుంటున్నాడు అట్లీ. ఆయన డైరెక్షన్‌లో త్వరలో రాబోయే



సైన్స్ ఫిక్షన్ సినిమాలో అల్లు అర్జున్ నటిస్తున్నాడు. ఈ సినిమాను సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.డైరెక్టర్ అట్లీ, శంకర్‌ను కాపీ కొట్టే తక్కువ సమయంలోనే అద్భుతమైన ఎదుగుదల సాధించాడని నెటిజన్లు పోలుస్తున్నారు. డైరెక్టర్ శంకర్ తన ప్రారంభంలో ప్రేమ కథా చిత్రాన్ని డైరెక్ట్ చేశారు. అట్లీ డైరెక్టర్‌గా రాజా రాణి అనే ప్రేమ కథతోనే ఎంట్రీ ఇచ్చాడు. అదేవిధంగా శంకర్ నెమ్మదిగా సామాజిక సందేశాత్మక కమర్షియల్ సినిమాలు తీయడం ప్రారంభించాడు.అట్లీ కూడా తెరి సినిమాలో మహిళల భద్రత గురించి, మెర్సల్‌లో వైద్య రంగంలో జరిగే అవినీతి గురించి, బిగిల్ సినిమాలో ఆటల్లో రాణించాలని తపించే మహిళల గురించి, జవాన్‌లో రైతుల సమస్యల గురించి ఇలా సామాజిక సందేశాత్మక సినిమాలు తీసి తనను తాను టాప్ డైరెక్టర్‌గా నిలబెట్టుకున్నాడు.ఇందులో మరో హైలైట్ ఏమిటంటే, శంకర్ చేసిన తప్పులన్నింటినీ అట్లీ చేయలేదు. టాప్ నటులతో సినిమాలు తీస్తున్న సమయంలోనే ఒక్కసారిగా కొత్త నటులతో బాయ్స్ అనే సినిమా తీశాడు శంకర్. ఆ సినిమా ఆయనకు కలిసి రాలేదు. అందుకే అట్లీ అలాంటి రిస్క్ తీసుకోలేదు. ఇప్పుడు త్వరలో శంకర్ లాగే ఒక సైన్స్ ఫిక్షన్ సినిమాను ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు అట్లీ. శంకర్ రజనీకాంత్‌తో కళానిధి మారన్ నిర్మాణంలో సినిమాను డైరెక్ట్ చేయనున్నాడు.

## పవన్ అభిమానుల పూజలు ఫలించాయి.. చేతులు జోడించి థ్యాంక్స్ చెప్పిన శంకర్.. హెల్త్ అప్డేట్ ఇదే



పవన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదానికి గురయ్యాడు. కాళ్లు, చేతులకు గాయాలు కావడంతో వెంటనే అక్కడి సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. అరకు పర్యటనలో ఉన్న సమయంలో బాబు తల్లి అన్నా ఫోన్‌లో పవన్‌కు ఘటన గురించి తెలిపారు. మిగిలిన నాయకుల్లా కాకుండా.. అరకు ప్రజలకు ఇచ్చిన మాట కోసం పవన్ తన టూర్‌ని కొనసాగించారు. ఒకవైపు బాధను దిగుమింగుకుని గిరిజనులతో మమేకమై పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

అరకు పర్యటన మంగళవారం మధ్యాహ్నం ముగించుకున్న పవన్ ఆ రాత్రి 9.30 గంటలకు సింగపూర్ వెళ్లారు. పవన్ వెంటన, అన్న చిరంజీవి, వదిన సురేఖ కూడా ఆయనకు తోడుగా వెళ్లారు. పవన్ నిన్న మీడియాతో మాట్లాడుతూ.. పెద్ద కుమారుడు అఖీరా నందన్ పుట్టినరోజు నాడే చిన్న కుమారుడు గాయపడటం బాధ కలిగించిందన్నారు. బాబు కోలుకుంటున్నాడని, కాకపోతే అతని ఊపిరితిత్తుల్లోకి పొగ వెళ్లడంతో కొంత కాలం ఆ ప్రభావం ఆరోగ్యంపై ఉంటుందని వైద్యులు చెబుతున్నారన్నారు. పవన్ కుమారుడు గాయపడటంపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారని,ధన్యవాదాలు తెలిపారు.

## తాను చేయాల్సిన మూవీ రాజశేఖర్‌కి, తలుచుకుని బాధపడ్డ స్టార్ హీరో, కట్ చేస్తే అప్పుల్లో నిర్మాత, ఆ సినిమా ఏంటి



శ్రీకాంత్ ఒకప్పుడు ఫ్యామిలీ సినిమాలతో హీరోగా రాణించారు. వరుసగా విజయాలు సాధించింది ఫ్యామిలీ ఆడియన్స్ కి దగ్గరయ్యారు. మ్యాన్లీ స్టార్‌గా ఎదిగారు. చిరంజీవి, బాలయ్య, వెంకీ, నాగ్‌లకు పారలల్‌గా జగపతిబాబు, అర్జున్, రాజేంద్రప్రసాద్ వంటి హీరోలకు పోటీగా శ్రీకాంత్ కూడా సినిమాలు చేసి విజయాలు అందుకున్నారు.స్టార్ హీరోగా రాణించారు. అయితే ఓ సినిమా విషయంలో ఆయన బాగా బాధపడ్డాడు. తాను చేయాల్సిన మూవీ రాజశేఖర్ వద్దకు వెళ్లడమే దీనికి కారణం. చివరికి అదే సినిమాలో శ్రీకాంత్ ఓ కీలక పాత్రలో నటించారు. కానీ హీరోగా మిస్ అయినందుకు బాధపడినట్టు తెలిపారు.శ్రీకాంత్.. అంజి టాక్స్ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని తెలిపారు. శ్రీకాంత్‌కి దర్శకులు ఈవీవీ సత్యనారాయణ, ఎస్వీకృష్ణా రెడ్డి వంటి దర్శకులు వరుస విజయాలు అందించారు. ఆడియెన్స్ కూడా ఓన్ చేసుకున్నారు. దీంతో బ్యాక్ టూ బ్యాక్ విజయాలు అందుకుని స్టార్ గా ఎదిగారు.ఆ సమయంలోనే తమ్మారెడ్డి భరద్వాజ దర్శకత్వంలో దొంగరాస్కెల్ సినిమా చేశారు శ్రీకాంత్. ఇది బాగానే ఆడింది. ఆ తర్వాత ఆయన దర్శక, నిర్మాతగా %-%వేటగాడుసినిమా చేయాలనుకున్నారు. దాదాపు ప్రాజెక్ట్ ఓకే అయ్యింది. ఈ మూవీ బాలీవుడ్‌లో వచ్చిన చిత్రానికి రీమేక్. అది హాలీవుడ్ మూవీకి రీమేక్. శ్రీకాంత్ హీరోగా సౌందర్య, రంభ హీరోయిన్లుగా ఈ మూవీని ఓకే చేశారు. కానీ అనుకోని కారణాలతో సడెన్‌గా హీరో మారిపోయారు. రాజశేఖర్ వద్దకు ఈ ప్రాజెక్ట్ వెళ్లిందట. ఆయన హీరోగా ఈ మూవీని స్టార్ట్ చేశారు తమ్మారెడ్డి భరద్వాజ. దీనికి ఆయనే నిర్మాత, దర్శకుడు. చివర్లో ఓ కీలక పోలీస్ పాత్రకి శ్రీకాంత్‌నే తీసుకున్నారట.అయితే ఈ మూవీ షూటింగ్ టైమ్‌లో శ్రీకాంత్ చాలా సార్లు తన బాధని వ్యక్తం చేశారట. రాజశేఖర్‌తోనే అన్నాడట. తాను చేయాల్సింది, ఇలా జరిగిందని, దానికి రాజశేఖర్ కూడా పాజిటివ్‌గా స్పందించి ఎంకరేజ్ చేశారని తెలిపారు శ్రీకాంత్. కొన్ని సినిమాల విషయంలో అలా జరుగుతుందన్నారు. అది మన చేతుల్లో లేదని తెలిపారు.

అయితే శ్రీకాంత్ బాధపడే విషయం ఏంటంటే, ఆ సమయంలో తాను చేస్తున్న సినిమాలకంటే వేటగాడు%-% చాలా పెద్ద ప్రాజెక్ట్. సౌందర్య, రంభ అప్పట్లో ఫుల్ ఫామ్‌లో ఉన్న హీరోయిన్లు. ఈసినిమా పడితే తన లైఫ్ మారిపోతుందని, పెద్ద రేంజ్ కి వెళ్లిపోతానని శ్రీకాంత్ బాగా ఆశలు పెట్టుకున్నారు. కానీ చివరి నిమిషంలో ప్రాజెక్ట్ తన చేతుల నుంచి వెళ్లిపోయింది. అదే తనని బాధపెట్టింది. ఇక రాజశేఖర్ హీరోగా, సౌందర్య, రంభ హీరోయిన్లుగా, తమ్మారెడ్డి భరద్వాజ రూపొందించిన ఈ చిత్రం 1995లో విడుదలైంది. కానీ బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టింది. దీనికి కారణం రాజశేఖరే అని తెలిపారు రైటర్ తోట ప్రసాద్. హిందీ చిత్రంలో షారూఖ్ ఖాన్ హీరోగా నటించగా, అప్పటికీ ఆయనకు హిందీలో పేరు లేదు, ఆయన పాత్రలో నెగటివిటీ ఉండటంతో అక్కడి ఆడియెన్స్ రిసీవ్ చేసుకున్నారు.కానీ తెలుగులో రాజశేఖర్‌కి మంచి స్టార్ ఇమేజ్ ఉంది. పైగా ఫుల్ ఫామ్‌లో ఉన్నారు.

## రాజమౌళి తర్వాత బుచ్చిబాబే.. వామ్మో రాంగోపాల్ వర్మ పొగడ్తలు, పెద్ది టీజర్ పై రివ్యూ



మెగా పవర్ స్టార్ రాంచరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ పెద్ది. ఇటీవల విడుదలైన టీజర్ తో రాంచరణ్ స్టేడియం బయటకి సిక్సర్ కొట్టారు అంటూ అంచనాలు పెరిగిపోయాయి. అంత అద్భుతంగా టీజర్ ఉంది. పాన్ ఇండియా స్థాయిలో పెద్ది చిత్రంపై ఫస్ట్ షాట్ టీజర్ అంచనాలు పెంచేసింది. సినీ ప్రముఖులు కూడా బుచ్చిబాబు టేకింగ్ పై, రాంచరణ్ స్క్రీన్ ప్రెజెన్స్ పై ప్రశంసలు కురిపించారు.

ఎవరెన్ని పొగడ్తలు కురిపించినా రాంగోపాల్ వర్మ నోటి నుంచి వచ్చే మాట వేగంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. తరచుగా మెగా ఫ్యామిలీపై విమర్శలు చేసే రాంగోపాల్ వర్మ ఈసారి ప్రశంసలు కురిపించారు.. అది కూడా రాంచరణ్ పై. ఇటీవల విడుదలైన పెద్ది టీజర్ కి మైండ్ బ్లోయింగ్ రెస్పాన్స్ వస్తుండడంతో వర్మ రియాక్ట్ అయ్యారు. బుచ్చిబాబుని ఏకంగా రాజమౌళితో పోల్చుతూ వర్మ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అనుమానం లేదు.. పెద్ది చిత్రం రియల్ గేమ్ ఛేంజర్ కాబోతోంది. పెద్ది టీజర్ లో రాంచరణ్ గ్లోబల్ స్టార్ లాగా కాదు యూనివర్సల్ స్టార్ లా కనిపించారు. రాజమౌళి తర్వాత రాంచరణ్ పొటెన్షియల్ ని అర్థం చేసుకున్న డైరెక్టర్ బుచ్చిబాబు మాత్రమే అని నాకు అనిపిస్తోంది. పెద్ది చిత్రం ట్రిపుల్ సిక్సర్ అవుతుంది అంటూ ఆర్జీవీ ప్రశంసలు వర్షం కురిపించారు. ఆర్జీవీ కామెంట్స్ పై మెగా ఫ్యాన్స్ స్పందిస్తున్నారు. నిజంగానే పెద్ది చిత్రం రియల్ గేమ్ ఛేంజర్ అవుతుంది అని అంటున్నారు. పెద్ది చిత్రంలో రాంచరణ్ ఉత్తరాంధ్ర యాసలో డైలాగులు చెబుతున్నారు.

## చరణ్ లాంటి భర్త ఉంటే గొడవలుండవ్.. ఉపాసన థీరీ వింటే చచ్చినా భార్యాభర్తలు విడిపోరు

పెళ్లంటే నూరేళ్ల పంట అని పెద్దలు అంటుంటారు. పెళ్లిళ్లు స్వర్గంలో నిర్ణయించబడతాయని మరికొందరు చెబుతుంటారు. మరి అంతటి పవిత్ర బంధంతో ఒక్కటవుతున్న నేటి దంపతులు.. చిన్న చిన్న విషయాలకే విడిపోతున్నారు. ప్రధానంగా ఇగోలతో ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోవడం, సర్దుకుపోలేకపోవడం వంటివి లేకపోవడంలో దంపతుల మధ్య గొడవలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి అంశాలపై ఉపాసన స్పందించారు. పెళ్లి అంటే ఆషామాషీ విషయం కాదని ఆమె చెబుతున్నారు. సినిమాలకు రివ్యూలు ఉన్నట్లే పెళ్లి తర్వాత కూడా రివ్యూలు ఉండాలని అంటున్నారు ఉపాసన.ఈ మధ్య కాలంలో పెళ్లి చేసుకున్న వాళ్లు విడిపోవడం కాదు.. ఒకరినొకరు చంపుకోవడం ఎక్కువైంది. తాజాగా అనేక ఘటనల్లో భర్తను చంపుతున్న భార్యలు.. భార్యలను కడతేరుస్తున్న భర్తలు.. అది కూడా మామూలుగా కాదండోయ్.. ఎంతో కర్కశంగా చంపుతున్నారు. అసలు ఇంతటి శతృత్వం భార్యాభర్తల మధ్య ఎందుకు వస్తుంది. దీనికి ప్రధాన కారణం ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోవడం.. కనీసం ఇద్దరూ కలిసి మనసు విప్పి మాట్లాడుకోలేకపోవడమే కారణంగా చెబుతున్నారు.



భార్యాభర్తల మధ్య మనస్పర్థల రావడం అన్న అంశంపై ఉపాసన మాట్లాడారు. ఎన్ని పనులు ఉన్నా.. చరణ్‌తో కలిసి వారంలో ఒకరోజు డిన్నర్ డేట్‌కి ఉపాసన వెళ్తుందట. అక్కడే ఆ వారంలో జరిగిన విషయాలు, వ్యక్తిగత విషయాలు గురించి ఇద్దరు మాట్లాడుకుంటారంట. అలా చేయడం వల్ల ఒకరిపై ఒకరికి ప్రేమ పెరుగుతుందని ఆమె చెబుతున్నారు. చరణ్ సినిమాల్లో పెద్ద హీరో అయినప్పటికీ ఇంట్లో ఎప్పుడు అలా బిహేవ్ చేయడని ఉపాసన అంటున్నారు. ఇంట్లోని పనులన్నీ చేస్తుంటారని, తనకి కూడా సాయం చేస్తుంటారని చెబుతున్నారు. దీంతోపాటు రాంచరణ్ మహిళలకు ఎప్పుడూ మద్దతుగా ఉంటారని, ఏది చేయాలన్నా ప్రోత్సహిస్తారని అంటున్నారు. అందుకే తాను ధైర్యంగా అటు వ్యాపారం, ఇంటి వ్యవహారాలు చక్కబెడుతున్నట్లు వివరించారు. చరణ్ సెక్యూర్డ్‌గా ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చారు ఉపాసన.

ప్రతి ఒక్కరి దాంపత్య జీవితంలో ఒడిదొడుకులు సహజమేనని ఉపాసన అంటున్నారు. ఆ సమయంలో ఒకరి ఒకరు తోడుగా ఉండాలని అలా చేస్తే ఎలాంటి సమస్యనైన పరిష్కరించుకోవచ్చని ఆమె చెప్పుకొచ్చారు. సమస్య వచ్చినప్పుడు ఇద్దరూ కూర్చుని చర్చించుకుని దాన్ని పరిష్కరించోకోవాలని చెబుతున్నారు. ఇదే తమ దాంపత్య జీవితం ఇంత సంతోషంగా ఉండటానికి కారణమని అంటున్నారు. ఇలా చేస్తే ప్రతిఒక్కరి జీవితం ఆనందమయమేనని తెలిపారు. ఎంత డబ్బున్నా, అసలు డబ్బు లేకున్నా.. అర్థం చేసుకోలేని మనుషులు లేకపోతే ఆ జీవితం నిరుపయోగమే... కాబట్టి.. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకరికొకరు సమయం కేటాయించుకుని ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకుంటే అవుతుంది.

## కూతురు, భార్య బట్టలు, నగలు, కార్లు చోరీ.. కన్నీళ్లతో రేవంత్ రెడ్డికి రిక్వెస్ట్.. ఏందిరయ్యా ఈ రచ్చ



క్రమశిక్షణకు మారుపేరు అనే చెప్పుకునే నటుడు మంచు మోహన్‌బాబుకి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు విష్ణు, కుమార్తె లక్ష్మీ, చిన్నకుమారుడు మనోజ్. ముగ్గురినీ చిన్నప్పటి నుంచి ఒకేలా చూస్తూ వచ్చారు మోహన్‌బాబు. అయితే.. గత కొంతకాలంగా విష్ణుకి, మనోజ్‌కి మధ్య విభేదాలు తలెత్తాయి. అవి కాస్త చినికిచినికి గాలివానలా మారాయి. రెండు వర్గాలుగా విడిపోయి ఇద్దరూ కొట్టుకునే వరకు వెళ్లింది. ఈ పంచాయతీ సోషల్‌మీడియాలో తారాస్థాయికి చేరుకోవడంతో మంచు మోహన్‌బాబు రంగ ప్రవేశం చేశారు.మనోజ్, విష్ణు మధ్య జరుగుతున్న గొడవలపై మోహన్‌బాబు మీడియా ముఖంగా ఎక్కడా మాట్లాడలేదు. అయితే.. పలుమార్లు లేఖలు విడుదల చేశారు. ఓసారి ఆడియో ఫుటేజ్ విడుదల చేశారు. అందులో మనోజ్‌ను మాత్రమే హెచ్చరిస్తూ.. నువ్వు చేస్తుంది తప్పు ఇది మంచి పద్ధతి కాదని మందలించారు. కానీ విష్ణుని పల్లెత్తి మాటకూడా అనలేదు. దీంతో ఆయన వైఖరి ఎటువైపు ఉందో అందరికి తెలిసిపోయింది. అయితే... అసలు గొడవంతా ఆస్తుల గురించి కాదని మనోజ్ పదేపదే చెబుతున్నాడు. మంచు మనోజ్ చెబుతున్న ప్రకారం తన తండ్రి ఆస్తి నుంచి ఒక్క రూపాయి కూడా తాను తీసుకోలేదని అంటున్నాడు. ఈ విషయం మోహన్‌బాబుకు ఎప్పుడో చెప్పినట్లు తెలిపారు. తన కష్టం మీద సినిమాలు చేసుకుంటూ కుటుంబాన్ని బతికించుకుంటానని చెబుతున్నారు మనోజ్.

## రామ్ చరణ్ చేతికి అకీరా నందన్ హీరోగా ఎంట్రీ బాధ్యతలు గెస్ట్ రోల్.. రేణు దేశాయ్ క్రేజీ రియాక్షన్



టాలీవుడ్‌లో స్టార్ వారసులు హీరోలుగా రావడం కామన్‌గా జరుగుతూనే ఉంది. ఎన్టీఆర్ వారసులుగా బాలకృష్ణ, కృష్ణ వారసులుగా మహేష్ బాబు, కృష్ణంరాజు వారసులుగా ప్రభాస్ ఎంట్రీ ఇచ్చారు. చిరు వారసుడిగా రామ్ చరణ్ హీరోగా రాణిస్తున్నారు.ఇప్పుడు మూడో తరం వారసుల ఎంట్రీకి సమయం వచ్చింది. ఇప్పుడు పవన్ కళ్యాణ్ వారసుడుకి సంబంధించిన వార్తలు వస్తున్నాయి. పవన్ కొడుకు అకీరా నందన్ హీరోగా ఎప్పుడు పరిచయం అవుతారనేది మెగా ఫ్యాన్స్ లో క్యూరియాసిటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ఇటీవల అకీరా నందన్‌కి సంబంధించిన క్రేజీ వార్తలు వినిపించాయి. పవన్ కళ్యాణ్ నటిస్తున్న చిత్రంలో అకీరా నందన్ ఎంట్రీ ఇస్తారని, ఇందులో చిన్న గెస్ట్ రోల్ చేస్తున్నారని, చిన్నప్పుడు పవన్‌గా అకీరా కనిపిస్తాడనే చర్చ నడిచింది. దీనిపై ఎలాంటి క్లారిటీ లేదు.మరోవైపు రామ్ చరణ్.. అకీరా బాధ్యతలు తీసుకున్నాడని, హీరోగా తనే పరిచయం చేస్తాడనే కొత్త వాదన వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో దీనిపై తాజాగా అకీరా మదర్ రేణు దేశాయ్ స్పందించారు. ఆమె ఈ రూమర్స్ ని ఖండించారు.ఇలాంటి రూమర్స్ గతంలోనూ విన్నాను అని, అప్పుడు కూడా చెప్పాను, మళ్లీ చెబుతున్నాను, అకీరా ఇప్పుడు ఏ సినిమా చేయడం లేదని తెలిపారు. నటిస్తున్నారనేది పూర్తిగా ఫేక్ అని చెప్పారు. ఇక అకీరా నందన్ ని హీరోగా పరిచయం చేసే బాధ్యతలు చరణ్ తీసుకున్నాడనే వార్తలను కూడా ఆమె ఖండించారు. చరణ్ లాంటి నమ్మొద్దు అని తెలిపారు.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com